జూన్
2024

218

సంపుటి : 20 సంచిక : 1 వెల రు. 15/-

## ఈ సంచికలో........

పేదరికపు యుగాన్ని అధిగమించడం ఎలా?
నిరుద్యోగ భారతం
అవినీతిపై యుద్ధం: మాటలు ఘనం ఆచరణ శూన్యం
హర్ష సామ్రాజ్యం
బ్రిటన్‌లో ఆకలి కేకలు
ప్రజా ఉద్యమాలతోనే పార్టీకి గుర్తింపు
సంస్కృతి-సమాజం: శాస్త్రీయ అవగాహన
ఎన్నికల ప్రచారంలో అధోగతికి దిగజారిన మోడి
తెలుగు వెలుగుల వేమన్న


స్ఫూర్తి

# తెలుగు వెలుగుల వేమన్న

పిబి చారి

వేమన పద్యాలు వందల సంవత్సరాల వరకు గ్రంథస్తం కాకుండా కేవలం సామాన్యుల నోటి మీదనే నిలిచి ఉన్నాయి. 1816లో భారతదేశం వచ్చిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ వేమన సాహిత్యం మీద 18 ఏళ్లపాటు పరిశోధన చేసి కొన్ని వందల పద్యాలను సేకరించాడు. అంతేకాదు బ్రౌన్ దొర తెలుగు సాహిత్యానికి విశేష సేవ చేసిన ఆంగ్లేయుడు. తొలి తెలుగు శబ్ద కోశమును ఈయననే పరిష్కరించి ప్రచురించాడు. అదే బ్రౌన్ డిక్షనరీగా పేరొందిన నిఘంటువు. ఇప్పటికీ దాన్ని తెలుగులో ప్రామాణికంగా ఉపయోగిస్తారు. వేమన పద్యాలను సేకరించడమే కాదు వాటిలోని గొప్పతనాన్ని గ్రహించిన బ్రౌన్ ఆ పద్యాలన్నింటినీ లాటిన్, ఆంగ్ల భాషలలోకి అనువదించాడు కూడా. అందువల్ల తెలుగువారు సిపి బ్రౌన్‌కు ఎంతో రుణపడి ఉంటారు. విలియం హొవర్డ్ కాంబెల్ (1910), జి. యు. పోప్, సి. ఇ. గోవర్ వంటి ఆంగ్ల సాహితీవేత్తలు వేమనను లోక కవిగా కీర్తించారు. తెలుగువారిలో వేమన కీర్తి అజరామరం చేయటానికి కృషి చేసిన వారు కట్టమంచి రామలింగారెడ్డి. రాష్ట్రంలో పలుచోట్ల వేమన జయంతి ఉత్సవాలు నిర్వహించటానికి రామలింగారెడ్డి గారి కృషి ఎంతో ఉన్నది. 1839లో తొలిసారిగా బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు పుస్తక రూపంలో వెలుగులోకి వచ్చాయి.

వేమన కాలం గురించి, ఆయన జీవితం గురించి, సిపి బ్రౌన్, వంగూరి సుబ్బారావు, వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రి, బండారు తమ్మయ్య, ఆరుద్ర, రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ, వేమూరి విశ్వనాథ శర్మ, కొమర్రాజు వెంకట లక్ష్మణ రావు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, కట్టమంచి రామలింగారెడ్డి, త్రిపురనేని వెంకటేశ్వరరావు, ఆచార్య ఎన్ గోపి పరిశోధనలు చేశారు. అయినప్పటికీ వేమన సరిగ్గా ఏ కాలం వాడో పూర్ణంగా గుర్తించలేకపోయారు. సుమారు 1652-1730 మధ్యకాలంలో జీవించి ఉండవచ్చు అని ఒక అభిప్రాయం. మరో అభిప్రాయం ప్రకారం 1352-1430 మధ్యకాలంలో జీవించి ఉండవచ్చు. వేమన ఏ కాలానికి



చెందినవాడు అనే దానిమీద అనేక పరిశోధనలు జరిగినప్పటికీ ఏకాభిప్రాయం లేదు. వేమన ఫలానప్పుడు జన్మించాడు అనటానికి ఇంతవరకు సరైన చారిత్రక ఆధారాలు దొరకలేదు.

కులమత బేధాలను నిరసించిన వేమన యొక్క కులం గురించి పరిశోధకులు ఒక అభిప్రాయానికి రాలేకపోయారు. సిపి బ్రౌన్ వేమన జంగం (శైవ సంస్కర్తల కులం) కులానికి చెందిన వాడని అభిప్రాయపడ్డాడు. వేమన రెడ్డి కులానికి, కాపు కులానికి చెందినవాడు అని కూడా మరికొందరు భావించారు. ఆయన పద్యాలను బట్టి కొందరు భావించినా కాపు, రెడ్డి అనే కులాలు దత్త మండలాలలో పర్యాయపదాలుగా వాడబడు తున్నాయి. కావున ఏ కులమని నిర్ధారించలేకపోయినా పద్యాలలో కనిపించే వ్యవసాయ పరిజ్ఞానం వలన ఆయన రైతు కుటుంబానికి చెందిన వాడు అని నిర్ధారించవచ్చు అని అంటారు మరి కొందరు. వేమన ఏ కులం వాడు అన్నది అప్రస్తుతం. ఆయన ఒక నిండైన మనిషి. ఆయన లోకానికి అందించిన అపూర్వ సాహిత్యం ఒక సత్యనిఘంటువు.

వేమన పద్యాలలో వాడిన ప్రాంతాన్ని సూచించే పదాలు (పచ్చు, దుడ్డుట, బిత్తలి లాంటివి) రాయలసీమ ప్రాంతంలో మాత్రమే వాడుకలో ఉన్నందున ఆయన రాయలసీమ వాడు అని చెప్పవచ్చు.

పరిశోధనలు కొనసాగిన క్రమంలో వేమన వాడిన మక్కా, అల్లా, మహమ్మద్, గులాము, బిక్కలు, జింజిరీలు వంటి పరిష్యా పదాలు వాడకం వల్ల ఇతడు 17వ శతాబ్దం వాడని, రాయలసీమ ప్రాంతానికి చెందిన వాడని తేలిందని అంటారు కొందరు. వేమన జీవితం గురించి అనేక కథలు, కథనాలు ఉన్నాయి. అవేవీ అంత విశ్వసించదగినవి కావు. జీవిత విశేషాలను కథలుగా చెప్పుకోవటం ఆంధ్రులకు అలవాటే. అది పరిపాటే. అందువలన వాటికి అంత ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం లేదని చరిత్రకారులు భావిస్తూ ఉంటారు.

ప్రాపంచిక జీవితంలో ఎంతో మోసం, కపటం, నాటకం, డంబం గ్రహించిన వేమన, వాటిని రూపుమాపటానికి సన్యాసులు చూపించే పరిష్కారాలు వట్టి బూటకం అని ఆ సన్యాసుల బ్రతుకులలో కూడా అవే లక్షణాలు ఉన్నాయని తెలుసుకున్నారు. వారి మోసాన్ని ఎలుగెత్తి చాటాడు. వేమన పద్యాలు లోకనీతులు. సామాజిక చైతన్యం వేమన పద్యాల లక్షణం. వేమన సృజించని అంశం లేదు. వట్టించుకోని పార్శ్వం లేదు. సమాజంలోని అన్ని సమస్యలు భిన్న కోణాల్లో దర్శించి ఆ దర్శన వైశిష్ట్యాన్ని వేమన తన పద్యాలలో ప్రదర్శించాడు. కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లు, మతం పేరిట జరుగుతున్న దోపిడీలు, విగ్రహారాధనను నిరసించటం, కుహానా గురువులు, దొంగ సన్యాసులు ఒకటేమిటి కనిపించిన ప్రతి సామాజిక అవకతవకల మీద వేమన్న కలం ఝులిపించాడు. సమాజానికి పట్టిన చీడ పీడను, బూజును చీపురుతో దులిపివేశాడు. పద్యాలన్నీ ఆట వెలదిలోనే చెప్పాడు. ఎంతో లోతైన భావాన్ని కూడా సరళమైన భాషలో చక్కటి ఉదాహరణలతో హృదయానికి హత్తుకునేలా చెప్పాడు వేమన. మొదటి రెండు పాదాల్లో నీతిని ప్రతిపాదించి మూడోపాదంలో దానికి తగిన సామ్యం చూపిస్తాడు. ఉదాహరణకు

అల్పుడెపుడు పలుకు  
నాడంబరముగాను  
సజ్జనుండు పలుకు చల్లగాను  
కంచు మ్రోగునట్లు  
కనకంబు మ్రోగునా  
విశ్వదాభిరామ వినురవేమ.

కొన్ని పద్యాలలో ముందే సామ్యం చెప్పి, తరువాత నీతిని చెబుతాడు."అనగ అనగ రాగ మతిశయించునుండు/తినగ తినగ వేము తియ్యనుండు/సాధనమున పనులు సమకూరు

(మిగతా 33వ పేజీలో)

## ఈ సంచికలో...

1. తెలుగు వెలుగుల వేమన్న
పిబి చారి........2

2. పేదరికపు యుగాన్ని అధిగమించడం ఎలా?
ప్రభాత్ పట్నాయక్ ........4

3. నిరుద్యోగ భారతం
సుజయ్ చక్రవర్తి........8

4. అవినీతిపై యుద్ధం: మాటలు ఘనం ఆచరణ శూన్యం
పరంజొయ్ గుణ ఠాకుర్తా........11

4.హర్ష సామ్రాజ్యం
ఎంవిఎస్ శర్మ........15

6. బ్రిటన్‌లో ఆకలి కేకలు
అరవింద్ శివరామకృష్ణన్........17

7. ప్రజా ఉద్యమాలతోనే పార్టీకి గుర్తింపు
ఎస్.వీరయ్య........18

8. స్రంస్కృతి-సమాజం: శాస్త్రీయ అవగాహన... 21

9. ఎన్నికల ప్రచారంలో అధోగతికి దిగజారిన మోడీ
ఎ.కోటిరెడ్డి........29



**సంపాదకుడు :**
**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం :**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్.వెంకట్రావు**
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at: cpim.org


# యుద్ధ నేరస్తులు

**2023** అక్టోబర్ 17న ఇజ్రాయిల్‌పై హమాస్ ఆకస్మిక దాడికి ప్రతీకారం పేరుతో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ మారణహోమం ప్రారంభించి ఆరుమాసాలు దాటిపోయింది. ఇప్పటికే 34,000 మంది పాలస్తీనియన్లు చనిపోయారు. వారిలో అత్యధికులు ముక్కుపచ్చలారని పసిపిల్లలు, స్త్రీలు, వృద్ధులు. లక్షల మంది క్షతగాత్రులయ్యారు. అయినా నిరాయుధులైన, నిస్సహాయులైన పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులు, మారణకాండ ఆగడం లేదు సరికదా రఫాలో తలదాచుకుంటున్న పాలస్తీనా శరణార్థి శిబిరాల మీద కూడా బాంబుదాడులకు పాల్పడి వందలాది మందిని పొట్టనపెట్టుకుంటున్నారు. గాజాపై దాడి సందర్భంగా ఆ ప్రాంతాన్ని ఖాళీచేయాలని ఇజ్రాలీ సైన్యం హుకుం జారీ చేయడంతో లక్షలాది మంది పాలస్తీనియన్లు పిల్లాపాపలతో పారిపోయి శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఇప్పుడు రఫాపైన కూడా దాడులకు తెగబడ్డంతో అక్కడ నివసిస్తున్న 15 లక్షల మంది ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయి. రఫాకు ఆహారం, నీరు, ఇతర నిత్యావసరాల సరఫరాను బంద్ చేయడం ద్వారా ఇజ్రాయిల్ అక్కడి ప్రజలను ఆకలి దప్పులతో చంపేయడానికి పూనుకున్నది.

ఇజ్రాయిల్ యుద్ధకాండ పాలస్తీనాతో ఆగలేదు. గత కొద్ది వారాలుగా ఇజ్రాయిల్ సైన్యాలు సిరియా మీద, ఇరాన్, ఇరాక్‌ల మీద, లెబనాన్‌మీద, సరికొత్తగా ఈజిప్టుమీద దాడులకు తెగబడుతూ యుద్ధాన్ని మరింత విస్తరించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఏప్రిల్ 1న ఇజ్రాయిల్ అంతర్జాతీయ సూత్రాలకు విరుద్ధంగా సిరియా రాజధాని డెమాస్కస్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయంపై క్షిపణులతో దాడి చేసింది. ఈ దాడిలో ఇరాన్ సైన్యంలో ఉన్నత స్థాయి కమాండర్లు ఇద్దరితో సహా 13 మంది మరణించారు. ఈ ఏడాది జనవరి 19న ఇరాన్‌లోని ఇస్ఫాహన్ నగరంమీద ఇజ్రాయిల్ చేసిన దాడిలో 100 మంది చనిపోయారు. గత మార్చి చివరిలో ఇజ్రాయిల్ దళాలు లెబనాన్‌మీద వరుస దాడులకు పాల్పడి 16 మంది ప్రాణాలు బలి తీసుకున్నాయి. గాజాను పూర్తిగా ధ్వంసం చేసి రఫాపైకి దాడికి వెళుతున్న ఇజ్రాయిలీ సైన్యం గాజా సరిహద్దులోని సున్నితమైన ఈజిప్టు భూభాగాన్ని చేజిక్కించుకోవడంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి.

ఇజ్రాయిల్ దురాగతాలను మొత్తంగా చూసినప్పుడు యుద్ధాన్ని మొత్తం పశ్చిమాసియా అంతటికీ విస్తరించడానికి తీవ్రమైన ప్రయత్నాలు జరుగుతున్నట్లు బోధపడుతుంది. యుద్ధం విస్తరించడం మొత్తం ప్రపంచానికి, ముఖ్యంగా భారత దేశానికి చాలా హానిచేస్తుంది. పశ్చిమాసియాలో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయుల జీవితాలను ప్రమాదంలో పడేస్తుంది.

యుద్ధం చేస్తున్నదీ, వేలాది మంది ప్రజల ప్రాణాలు తీస్తున్నదీ ఇజ్రాయిల్ అయినప్పటికీ దాని వెనుక ఉండి నడిపిస్తున్నది అమెరికా అని అందరికీ తెలుసు. ఒకవైపు పాలస్తీనా ప్రజల ప్రాణాలు పోతున్నాయని మొసలి కన్నీరు కారుస్తూనే అమెరికా అధ్యక్షుడు బైడెన్ మరోవైపు కోటాను కోట్ల రూపాయల విలువ చేసే ఆయుధాలను ఇజ్రాయిల్‌కు నిరంతరాయంగా పంపిస్తున్నాడు. ఐక్య రాజ్య సమితిలోనూ, అంతర్జాతీయ వేదికల మీద అత్యధిక దేశాలు ఇజ్రాయిల్ దాష్టీకాన్ని ఖండిస్తూ తీర్మానాలు చేస్తూ ఉంటే అమెరికా వాటికి మోకాలడ్డుతోంది. నిజానికి అమెరికా, దాని ఐరోపా మిత్ర దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ అండ లేకుండే ఇజ్రాయిల్ ఇంతటి దుస్సాహసానికి పాల్పడలేదు. అందుకే ఇజ్రాయిల్, అమెరికా రెండూ యుద్ధానికి కారకులు, బైడెన్, నెతన్యాహూలిద్దరూ యుద్ధ నేరస్తులు.

ఇటీవలి కాలంలో అంతర్జాతీయ న్యాయస్థానాలు, మానవ హక్కుల సంఘాలు, శాంతి సంఘాలు పాలస్తీనా ప్రజానీకంపై సాగిస్తున్న దురాగతాలను ఖండిస్తున్నాయి. అనేక దేశాల్లో ఇజ్రాయిల్, అమెరికా దురాగతాలకు వ్యతిరేకంగా ప్రజా నిరసన జ్వాలలు మిన్నుముట్టుతున్నాయి. ఇజ్రాయిల్ పైశాచికానికి నిరసనగా అమెరికాలోని విశ్వ విద్యాలయాల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున చేపట్టిన నిరసనలను అమెరికా సామ్రాజ్యవాద పాలక వర్గాలు నిరంకుశంగా అణచివే స్తున్నారు. చివరికి ఇజ్రాయిల్‌లో కూడా ప్రధాని నెతన్యాహూ యుద్ధోన్మాదానికి వ్యతిరేకత పెరుగుతోంది. కానీ మన దేశంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం ఇజ్రాయిల్ దురాగతాలను ఖండించకపోగా ఇజ్రాయిల్‌కు పెద్ద ఎత్తున ఆయుధాలు పంపుతున్నట్లు ఇటీవల ఆయుధాలతో కూడిన భారతీయ నౌకకు స్పెయిన్ అనుమతి నిరాకరించిన ఘటన తెలుపుతున్నది.

ఇజ్రాయిల్-అమెరికా కూటమి యుద్ధాన్ని పాలస్తీనా నుండి పశ్చిమాసియా అంతటికీ విస్తరించడానికి ప్రయత్నిస్తున్నాయన్నది స్పష్టం. సంక్షోభంలో ఉన్న ప్రపంచం యుద్ధాన్ని తట్టుకోలేదు. అందుకే సామ్రాజ్యవాదుల యుద్ధ విస్తరణ యత్నాలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించాలి. ప్రజల నుండి ఒత్తిడి పెంచడం ద్వారా మాత్రమే యుద్ధ విస్తరణను ఆపగలం.

ఈ మాసం ముఖ్యాంశం

# పేదరికపు యుగాన్ని అధిగమించడం ఎలా?



రచయిత ప్రముఖ మార్క్సిస్టు ఆర్థిక వేత్త, బహు గ్రంథ కర్త

**ప్రభాత్ పట్నాయక్**

గతంలో ఎన్నడూ లేని విధంగా దేశం లో అసమానతలు పెరుగుతున్నాయి. యువకులు పెద్ద సంఖ్యలో ఉపాధి లేమి సమస్యను ఎదుర్కుంటున్నారు. నిరుద్యోగం ఏటికేడాది పెరుగుతోంది. ఈ పరిస్థితులే పేదల, కష్టజీవుల స్థితిగతులను మెరుగుపరిచే విధానాల వైపు అన్వేషించేలా చేస్తోంది. సంపన్నులపై పన్ను విధించడం వాటిలో కీలకమైనది. ప్రస్తుతం దేశ ఆర్థిక స్థితి అత్యంత దారుణంగా ఉంది. గత 50 సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా ఆర్థిక స్థితి దిగజారింది. సమకాలీన ప్రమాణాల ప్రకారం జీవనాధార వస్తువులను కొనుగోలు చేయడానికి అవసరమైన ఆదాయ స్థాయిని కూడా అత్యధిక మంది ప్రజలకు ప్రస్తుత వ్యవస్థ అందిచడంలేదు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం, కరోనా సమయంలో ప్రవేశపెట్టిన ప్రతి ఒక్కరికి నెలకు 5 కిలోల ఉచిత ఆహారధాన్యం వంటివి ఈ కష్ట సమయంలో ప్రజలకు కొంత మేర ఉపశమనం కలిగించాయి.

నిరుద్యోగం పెరుగుతుండటంతో కార్మిక శక్తిపైన కూడా ప్రభావం పడుతోంది. కార్మికులు చేసే పనికి సైతం పరిమితులు విధిస్తున్నారు. ఇది కార్మికుల పేదరికాన్ని మరింతగా పెంచుతోంది. ఈ కష్టాల నుండి బయట పడటానికి కార్మికులకు, పేదలకు ఉపశమన పథకాలు అవసరమౌతాయి. అటువంటి పథకాలు ఉన్నప్పటికీ కూడా గత 50 సంవత్సరాలతో పోలిస్తే ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం పేదరికం ఉంది. ఇది కొంత మేర అతిశయోక్తిగా అనిపించవచ్చు. కాని నిజం! అయితే, దీనిని నిర్ధారించడం కష్టం. జీవనాధార వస్తువులను ప్రామాణికంగా తీసుకోవడం ద్వారా పేదరికాన్ని పూర్తిగా అంచనా వేయలేం. కొత్త ఉత్పత్తుల తయారీతో జీవనాధార వస్తువుల జాబితా మారుతుంటుంది. అదే సమయంలో నిర్దిష్ట కేలరీల విలువతో ఆహారం వంటి ప్రాథమిక భాగం స్థిరంగా ఉంటుంది. అందువల్ల నిజఆదాయంతో సగటు కేలరీలను పోల్చడం ద్వారా పేదరాకాన్ని అంచనా వేయవచ్చు .

దేశంలో పేదరికపు అంచనాలు ప్రారంభమైన 1973-74వ సంవత్సరంలో ప్రణాళిక సంఘం గ్రామీణ భారతంలో ఒక వ్యక్తికి రోజుకు 2,200 కేలరీలు, పట్టణ ప్రాంతంలో ఒక వ్యక్తకి రోజుకు 2,100 కేలరీల ఆహారాన్ని ప్రామాణికంగా నిర్ధేశించింది. ఈ స్థాయిని అందుకోలేని వారిని పేదలుగా పరిగణించింది. ఇప్పుడు కూడా ఆ స్థాయిలనే ప్రామాణికంగా తీసుకోవడం ద్వారా, వాటిని అందుకోలేని జనాభాను, వారి పేదరికాన్ని అంచనా వేయవచ్చు. 1973-74లో ఈ కనీస ప్రమాణపు కేలరీల ఆహారాన్ని తీసుకోలేని గ్రామీణ జనాభా 56 శాతంగా తేలింది. 2017-18 నాటికి ఇది 80 శాతానికి పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో ఆ మేరకు కనీస కేలరీల ఆహారం అందుబాటులో లేని జనాభా 1973-74లోనూ, 2017-18 లోనూ 60శాతంగా ఉంది. నిజానికి 2017-18లో వెయిటెడ్ ఏవరేజి చాలా ఎక్కువగా ఉంది. గణాంకాలు ఇబ్బందికరంగా ఉన్నాయి కాబట్టి ప్రభుత్వం వాటిని అణచిపెట్టాలని నిర్ణయించింది. (ఇక్కడ ఇచ్చిన గణాంకాలు కూడా అందుబాటులో ఉన్న లెక్కల ఆధారంగా రూపొందించినవి). నిజానికి ఆ ఏడాది తలసరి గ్రామీణ వ్యయం 2011-12 కంటే 9శాతం తక్కువగా ఉంది.

2022-23కు సంబంధించిన ఎన్ఎస్ఎస్ఓ సర్వే యొక్క వివరణాత్మక ఫలితాలు ఇంకా ప్రచురించలేదు. అంతేకాకుండా, గతానికన్నా భిన్నమైన విధానాన్ని ఈ సర్వే కోసం వినియోగించారు. అందువల్ల ఆ సర్వే ఫలితాలను మునుపటి వాటితో పోల్చడం సాధ్యం కాదు. కానీ, 2017-18 తరువాత కరోనా రక్కసి విజృంభణ, లాక్‌డౌన్‌ను అత్యంత కఠినంగా, క్రూరంగా అమలు చేయడం, పట్టణాలు తిరస్కరించడంతో పెద్ద సంఖ్యలో గ్రామీణ ప్రాంతాలకు వలసలు పెరగడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్నప్పుడు గడిచిన 50 సంవత్సరాల కాలంలో ఎప్పటికన్నా ఎక్కువగా పేదరికం గ్రామీణ ప్రాంతంలో నెలకొందని నిర్వివాదంగా చెప్పవచ్చు.

2022-23 నాటి ఎన్ఎస్ఎస్‌సర్వే యొక్క వివరణాత్మక ఫలితాల్లో అక్కడక్కడా కనిపించే కొన్ని అంకెలు 2017-18 నుండి పరిస్థితులు ఏమాత్రం మెరుగ్గా లేవన్న వాస్తవానికి సాక్ష్యాలుగా నిలుస్తాయి. 2019-21వ సంవత్సరానికి సంబంధించిన జాతీయ కుటుంబ సర్వే-5 (ఎన్‌హెచ్ఎస్) ప్రకారం 57 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. అదే, 2015-16కు చెందిన ఎన్‌హెచ్ఎన్4 గణాంకాల ప్రకారం 53 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. అంటే, 2015-16తో పోలిస్తే 2019-21 మధ్యకాలంలో రక్తహీనతతో బాధపడుతున్న మహిళల సంఖ్య 3 శాతం పెరిగింది. ఇది పెరిగిన పోషకాహార లేమి లోపాన్ని స్పష్టంగా తెలియచేస్తోంది. అదేవిధంగా, ప్రపంచ

ఆకలి నివేదిక (గ్లోబల్ హంగర్ ఇండెక్స్)లో 2015నుండి 2023 మధ్య కాలంలో భారతదేశపు ర్యాంకులో పెద్దగా మార్పు రాలేదు. ఈ నివేదిక కొలమానాల్లో పిల్లల మరణాల రేటు (చైల్డ్ మోర్టాలిటి) కూడా ఒకటి. ఇది ప్రతి ఏడాదీ ఆందోళన కరంగానే నమోదవుతోంది. మరో మూడు కొలమానాల పరిస్థితి కూడా అంతే. ఇవన్నీ కలిసి పోషకాహార లేమి తీవ్రతకు అద్దం పడతాయి. పేదరికం పెరిగిందని వాదించడమంటే 50 సంవత్సరాల క్రితం కంటే ప్రజలు ప్రస్తుతం అధ్వాన్నంగా ఉన్నారని కాదు. వారి సొంత సంపాదనతో పాటు, ప్రభుత్వం వారికి అందించే 'బదిలీ'లను కలుపుకుని జీవన ప్రమాణాలను లెక్కిస్తాము. అందువల్ల వారి నిజసంపాదన తగ్గినంతమాత్రాన జీవన ప్రమాణాలు పడిపోయాయని చెప్పలేము. కానీ, దానికి ఎంతో ప్రాధాన్యత ఇంది. అసలు ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడుతోంది?

నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఈ పరిస్థితికి కారణం. నోట్లరద్దు, కరోనా వ్యాప్తి సందర్భంగా విధించిన కఠిన లాక్‌డౌన్ వంటివి మోడీ సర్కారు చర్యలకు ఉదాహరణలు. వ్యవసాయంతో పాటు చిన్న తరహా ఉత్పత్తి రంగంపై కూడా ఈ చర్యలు తీవ్ర ప్రభావం చూపాయి. నూతన ఉదారవాద ఆర్థిక విధానాల ద్వారా అప్పటికే పేదరికాన్ని అనుభవిస్తున్న ప్రజలను మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలు కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. 2,200 కంటే తక్కువ కేలరీలు వినియోగించే గ్రామీణ జనాభా 1993-94లో 58 శాతం ఉండగా, 2011-12 నాటికి 68కి పెరిగింది. పట్టణ జనాభాలో వీరి శాతం 57 నుండి 65కి పెరిగింది. మోడీ ప్రభుత్వం అమలు చేసిన నోట్ల రద్దు, లాక్‌డౌన్‌లు పేదరికంలో మగ్గుతున్న ఈ ప్రజానీకంపైనే అత్యధిక ప్రభావం చూపాయి.

**నయా-ఉదారవాదం**

మోడీ తెరమీదకు రావడానికి చాలా ముందునుండే దేశంలో పేదరికం ఉంది. అయితే, పేదరికానికి కారణమైన నయా-ఉదారవాద విధానాలను మోడీ మరింత ఉధృతంగా అమలు చేశాడు. వ్యవసాయ రంగాన్ని నీరుగార్చే మూడు నల్ల చట్టాలను తీసుకురావడానికి మోడీ చేసిన ప్రయత్నం ఈ విధానాల అమలులో పరాకాష్ట. రైతాంగం సంఘటితంగా ఆ ప్రయత్నాలను తిప్పికొట్టింది.

> **“ పేదరికానికి కారణమైన నయా-ఉదారవాద విధానాలను మోడీ మరింత ఉధృతంగా అమలు చేశాడు. ఇది పేదరికాన్ని మరింతగా పెంచింది. వ్యవసాయ రంగాన్ని నీరుగార్చే మూడు నల్ల చట్టాలను తీసుకు రావడానికి మోడీ చేసిన ప్రయత్నం ఈ విధానాల అమలులో పరాకాష్ట. రైతాంగం సంఘటితంగా ఆ ప్రయత్నాలను తిప్పికొట్టింది. ”**



పేదరికాన్ని నిర్మూలించడంలో భారత పాలకులు విఫలమయ్యారు.

నయా-ఉదారవాదం లేదా, దాని సమర్థకులు ఎప్పటి నుండో కోరుతున్న అనేక అంశాలను ప్రధాన మంత్రిగా మోడీ అమలు చేశారు. ఇది పేదరికాన్ని మరింతగా పెంచింది.

వ్యవసాయ రంగానికి ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి లభించిన మద్దతు ఉపసంహరించడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నించింది. (రైతాంగం ఆందోళనతో మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకున్న మూడు నల్ల చట్టాల్లో ఇది కూడా భాగం) ప్రైవేటు వడ్డీ వ్యాపారాలను పునరుద్ధరించడం, ప్రపంచ మార్కెటు ఒడిదుడుకులకు రైతాంగాన్ని వదిలి వేయడం, (అగ్రి బిజినెస్‌లోకి బహుళజాతి కంపెనీలను అనుమతించడంతో వారు వలసపాలన కాలం తీరులో రైతులతో వ్యవహరిస్తున్నారు) విద్య, వైద్య రంగాలను ప్రైవేటీకరించడం వంటి చర్యలన్నీ వ్యవసాయానికి లభించిన మద్దతు ఉపసంహరించే కోవలోకి వస్తాయి. ఈ చర్యలతో తీవ్ర ఒత్తిడికి గురయిన రైతు మరో మార్గం లేక పొట్టకూటి కోసం పట్టణాలకు వలస వెళ్లవలసి వస్తుంది.

కార్మిక ఉత్పాదకత వృద్ధి రేటు పెరగడానికి చేపట్టిన చర్యలు కూడా పేదరికం పెరిగేందుకు దోహదం చేసిన చర్యల్లో ఒకటి. అనేక దేశాల మధ్య వాణిజ్య వస్తువుల ప్రవాహాలకు ఆంక్షలు ఎత్తివేయడంతో ఉత్పత్తిదారుల మధ్య పోటీ పెరగిన కారణంగా సాంకేతిక రంగంలో అనేక మార్పులు వచ్చాయి. ఈ మార్పులను దేశంలో అమలు చేయడంతో ఉపాధి పెరగనప్పటికీ ఉత్పాదకత మాత్రం పెరిగింది. దేశంలో జిడిపి వేగంగా (వేగం అనడం అతిశయోక్తి అయినప్పటికీ!) వృద్ధి చెందుతున్నట్టు కనిపిస్తున్నప్పటికీ శ్రామిక శక్తి యొక్క సహజ వృద్ధి రేటుకంటే ఉపాధి వృద్ధి రేటు పడిపోవడం దీనికి నిదర్శనం.

> **❝ జాతీయ ఆదాయ పంపిణీ గురించి థామస్ పికెట్టీ అతని సహచరులు చేసిన పరిశోధనల్లో దేశ వ్యాప్తంగా ఉన్న ఒక్క శాతం మంది శతకోటీశ్వరుల వద్ద 2022వ సంవత్సరం నాటికి 22.6శాతం సంపద పోగుపడినట్లు తేలింది. 1922 నుండి (దేశానికి స్వాతంత్రం రాక ముందు) ఈ స్థాయిలో అసమానతలు ఎప్పుడూ చోటుచేసుకోలేదు. ❞**

బతకడం కోసం పట్టణాలకు వలస వచ్చిన రైతులను ఈ వృద్ధి ప్రక్రియ పరిగణలోకి తీసుకోదు. శ్రామిక శక్తిలో సహజంగా వచ్చే పెరుగుదలను కూడా ఇది గ్రహించదు. ఫలితంగా రిజర్వు శ్రామిక శక్తిలో గణనీయమైన పెరుగుదల ఏర్పడుతుంది. వృద్ధి ప్రక్రియ లెక్కలోకి తీసుకునే శ్రామికశక్తిలో సైతం తలసరి ఉపాధి తగ్గుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

### ముఖ్యాంశాలు

ఉపాదిహామీ చట్టం, ఆహార ధాన్యాల ఉచిత పంపిణీ పథకం వంటి ప్రభుత్వం నిర్వహించే సహాయ కార్యక్రమాల ద్వారా సంక్షోభం నుండి కొంత మేరమాత్రమే ఉపశమనం లభిస్తోంది. జనాభాలో అత్యధికులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజల పేదరికం గత 50 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా నేడు తీవ్రమైంది. ఉపాధి హామీ చట్టంలో భాగంగా 2019-20లో 265.30 కోట్ల వ్యక్తిగత పనిదినాలు కల్పించగా, 2023-24లో 305.20 కోట్ల పనిదినాలను కల్పించాల్సి వచ్చింది. గ్రామీణ ప్రాంతంలో పెరుగుతున్న ఒత్తిడికి ఇది నిదర్శనం.

### నిరుద్యోగ సంక్షోభం

నయా-ఉదారవాద విధానాలకు సంబంధించిన రెండు ధోరణులు భారతదేశంలో ప్రబలంగా కనిపిస్తున్నాయి. కార్మికవర్గాన్ని దయనీయ స్థితికి నెట్టివేసి, దుర్బలంగా మార్చే చర్యలను పెద్ద ఎత్తున అమలు చేస్తున్నారు. ప్రస్తుతం మనకు దేశ వ్యాప్తంగా ఆ పరిస్థితులే కనిపిస్తున్నాయి. అదే సమయంలో కార్మిక ఉత్పాదకత రేటు పెరుగు తుంది. ఇది జిడిపిలో మిగులు వాటాను పెంచుతుంది. ఆదాయ పంపిణీ, సంపదలలో అనూహ్యమైన అసమానాతలకు దారి తీస్తుంది. ఈ పరిణామం కూడా మనకు స్పష్టంగానే కనిపిస్తుంది.

జాతీయ ఆదాయ పంపిణీ గురించి థామస్ పికెట్టీ అతని సహచరులు చేసిన పరిశోధనల్లో దేశ వ్యాప్తంగా ఉన్న ఒక్క శాతం మంది శతకోటీశ్వరుల వద్ద 2022వ సంవత్సరం నాటికి 22.6శాతం సంపద పోగుపడినట్లు తేలింది. 1922 నుండి (దేశానికి స్వాతంత్రం రాక ముందు) ఈ స్థాయిలో అసమానతలు ఎప్పుడూ చోటుచేసుకోలేదు. ఆదాయానికి సంబంధించిన గణాంకాలకు కీలకమైన ఆదాయపన్ను 1922 నుండే దేశంలో అమలులో వచ్చింది. నయా-ఉదారవాదం అమలు ద్వారా పెరిగిన అసమానతలు బ్రిటిష్ పాలన నాటికంటే మించి పోవడం గమనార్హం. (1982లో ఒక్క శాతం ధనవంతుల వాటా ఆరుశాతం మాత్రమే. ఈ తరహా అసమానతల పెరుగుదల కేవలం భారత దేశానికి మాత్రమే పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఇదే తీరు కనవడుతుంది. ఆదాయాల్లో అసమానతలు సమిష్టి డిమాండ్ ను తగ్గిస్తుంది. సాధారణంగా ధనికులకంటే ఆదాయంలో ఎక్కువ భాగాన్ని పేదలు ఖర్చు చేస్తారు.) ఇది అధికోత్పత్తి వైపు మొగ్గుచూపుతుంది. వాస్తవంలో ఇది స్థబ్దతకు దారి తీస్తుంది. సరళీకరణ ఆర్థిక విధానాలు అమలు చేస్తున్న రాజ్యం దీనిని నివారించ దానికి ఎటువంటి చర్యలనూ తీసుకోలేదు. పైపైన తీసుకునే ద్రవ్య చర్యలు ఎటువంటి ఫలితాలను ఇయ్యవు.

దీని అర్థం ఏమిటంటే, నయా-ఉదారవాదపు ఉచ్ఛ స్థితిలో కూడా నిరుద్యోగం పెరుగుతూనే ఉంటుంది. అది సంక్షోభంలోకి ప్రవేశించినప్పుడు నిరుద్యోగం పతాక స్థాయికి చేరుతుంది. ప్రస్తుతం మనం చూస్తున్నది అదే. ఉపాధికి సంబంధించిన వాస్తవ చిత్రం ప్రభుత్వ గణాంకాలలో వెల్లడి కాదు. కారణం ఏమిటంటే నిరుద్యోగానికి సంబంధించిన అనేక ప్రమాణాలు ప్రభుత్వ గణాంకాల్లో కనిపించవు. ఉదాహరణకు పనిగంటల తగ్గింపు ద్వారా వ్యక్తమయ్యే నిరుద్యోగం గణాంకాల్లో కనిపించదు. అదే విధంగా కుటుంబ సంస్థల్లో ఆ కుటుంబాల్లోని మహిళలను ఉద్యోగులుగా చూపిస్తారు. కానీ, వారికి జీతాలు చెల్లించరు. ఫలితంగా ఉద్యోగుల సంఖ్య పెరుగుతుంది. ఇది ఐఎల్ఓ నిబంధనలకు విరుద్ధం.

మరోవైపు సెంటర్‌ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి సేకరించిన డేటా నిరుద్యోగ పెరుగుదలను స్పష్టంగా చూపుతుంది. 2008, 2019 మధ్య నిరుద్యోగ రేటు కొంచెం అటు, ఇటుగా 5,6 శాతాల మధ్య ఉన్నట్లు చూపారు. ఆ తరువాత అది గణనీయంగా పెరిగి 2024 మార్చి నాటికి 8శాతానికి చేరుకుంది.

### 'ఉపాధి హామీ' గణాంకాలు

నిరుద్యోగ తీవ్రతను నిరూపించడానికి పరోక్ష ఆధారాలు పుష్కలంగా ఉన్నాయి. వాటిలో మొదటిది ఉపాధి హామీ చట్టం కింద పనుల కోసం డిమాండ్‌కు సంబంధించినది. 2019-20లో 265.3 కోట్ల వ్యక్తిగత రోజుల పనికి డిమాండ్ ఉంది. ఆ తరువాత రెండు సంవత్సరాల్లో కరోనా విజృంభించింది. మొదటి ఏడాది 389.9 కోట్ల పనిదినాలకు, రెండవ ఏడాది 363.2 కోట్ల పనిదినాలకు డిమాండ్ పెరిగింది. కరోనా విజృంభణ తగ్గిన తరువాత కూడా ఉపాధి హామీ చట్టం కింద పనులకు డిమాండ్ కొనసాగుతుండటంతో పాటు, వైరస్ వ్యాపించడానికి ముందు ఉన్న సంవత్సరాల కన్నా చాలా ఎక్కువగా ఈ డిమాండ్ కొనసాగింది. 2023-24లో 305.2 కోట్ల వ్యక్తిగత పనిదినాలను దేశ వ్యాప్తంగా కల్పించాల్సివచ్చింది. ఇది కరోనా వ్యాప్తికి ముందుసంవత్సరం 2019-20 కన్నా చాలా ఎక్కువగా ఉండటాన్ని గమనించవచ్చు. ఆ ఏడాదితో పోలిస్తే ఉపాధి పనులకు15శాతం డిమాండ్ పెరిగింది. గ్రామీణ భారతదేశంలో ఉపాధి, ఉద్యోగావకాశాల కొరత వేతనాలపైనా కూడా ప్రభావం చూపుతుంది. 2014-15, 2022-23 మధ్య గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ, వ్యవసాయేతర పనులకు సంబంధించి పురుషులకిచ్చే సగటు వేతనం గ్రామీణ వినియోగదారుల ధరల సూచిక పెరుగుదల కంటే తక్కువగానే పెరిగింది. ఆహార ధరల సూచిక కన్నా కూడా ఈ పెరుగుదల తక్కువ. ఇది నిజవేతనాల తరుగుదలను సూచిస్తుంది. శ్రామిక శక్తికి

సంబంధించి నిరుద్యోగులు పెరిగే కొద్ది లేబర్‌రిజర్వు పెరుగుతుంది. లేబర్ రిజర్వు పెరగడం వేతనాల తగ్గుదలకు దారి తీస్తుంది. ఇది నయా–ఉదారవాదం యొక్క ముఖ్యమైన లక్షణం. మనం ప్రస్తుతం చూస్తున్న పేదరికానికి ఇది ఒక కారణం. ప్రస్తుతం పెద్ద ఎత్తున యుద్ధం జరుగుతున్న ఇజ్రాయిల్‌లో ఉద్యోగాల కోసం లక్నోలోని ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో జనవరి 25న రిక్రూట్‌మెంట్ డ్రైవ్ జరిగింది. యుద్ధం కారణంగా ప్రాణభయం ఉన్నప్పటికీ ఉద్యోగాల కోసం వేలాదిమంది తరలివచ్చారు. నిరుద్యోగ తీవ్రతకు ఇదో నిదర్శనం.

> ❝ మెజారిటీ జనాభాకు అవసరమైన ఆదాయాన్ని అందించలేనప్పుడు, ప్రభుత్వ పథకాల ద్వారా అందించే ఉపశమనంకూడా ఈ దుస్థితిని పూర్తిగా తొలగించలేనప్పుడు నయా -ఫాసిజం వైపు మొగ్గు కనిపిస్తుంది. ప్రస్తుత సంక్షోభ కాలంలో ఇది ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తోంది. ❞

**నయా–ఫాసిస్టు ప్రభుత్వం**

మెజారిటీ జనాభాకు అవసరమైన ఆదాయాన్ని అందించలేనప్పుడు, ప్రభుత్వ పథకాల ద్వారా అందించే ఉపశమనంకూడా ఈ దుస్థితిని పూర్తిగా తొలగించలేనప్పుడు నయా –ఫాసిజం వైపు మొగ్గు కనిపిస్తుంది. ప్రస్తుత సంక్షోభ కాలంలో ఇది ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తోంది. ప్రపంచీకరణ చెందిన పెట్టుబడితో ఏకస్వామ్య (మోనోపాలి) బూర్జువాలు , నయా–ఫాసిస్టు శక్తులు భాగస్వాములుగా మారుతారు. ఇది నయా–ఉదారవాద, నయా–ఫాసిస్టు కూటమిగా ముందుకొస్తుంది. ప్రజల దృష్టిని నిత్య జీవిత సమస్యల నుండి మైనార్టీల వంటి ఇతర అంశాల వైపు మళ్లిస్తుంది. వారికి వ్యతిరేకంగా శత్రుత్వాన్ని సృష్టిస్తుంది. ఇప్పటికే సంక్షోభంలో ఉన్న వ్యవస్థకు మరిన్ని సవాళ్లు ఎదురుకాకుండా ముందుకు తీసుకువెళ్లడం దీని లక్ష్యం.

అయితే, సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ఉదారవాద ప్రభుత్వం, ఫాసిస్టు ప్రభుత్వాల పనితీరు ఒకే మాదిరి ఉంటుంది. నయా–ఫాసిస్టు ప్రభుత్వం ఉదారవాద ప్రభుత్వాని కంటే ఎక్కువగా సంక్షోభాన్ని అధిగమించలేదు. ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి ఈ ప్రభుత్వాలు అనుసరించే ద్రవ్య విధానం ఒక మొద్దుబారిన సాధనంగా మారుతుంది. పేదల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేసే ప్రభుత్వపు ఆర్థికజోక్యాన్ని ఇది అడ్డుకుంటుంది. నిజానికి ఈ చర్యలు ప్రభావవంతంగా ఉండాలంటే ఆదాయంలో అధికశాతం ఖర్చు చేసే శ్రామిక ప్రజలపై కాకుండా, ధనవంతులపై పన్ను విధించడం ద్వారా ఆర్థికలోటును భర్తీ చేసుకోవాలి. అయితే, ప్రపంచీకరణ విధానాలు వీటిని అంగీకరించవు. అందువల్ల నయా–ఉదారవాద విధానంలో సంక్షోభానికి పరిష్కారం లేదు. సంక్షోభాన్ని అధిగమించాలంటే నయా–ఉదారవాదానికి అతీతంగా వెళ్లడమే మార్గం. సంక్షోభాన్ని ఎదుర్కోవాలని భావించే ఏ ప్రభుత్వమైనా ఉదారవాద విధానాలకు భిన్నంగా ధనవంతులపై పన్ను విధించి, శ్రామిక ప్రజల జీవితాలను మెరుగుపరచాలి. ఈ నేపథ్యంలో అన్ని కుటుంబాలకు కనీస ఆదాయాన్ని అందించే కార్యక్రమాన్ని చేపట్టాలనే ప్రతిపాదన ముందుకు వచ్చింది. అయితే, దీనికి కూడా అనేక పరిమితులు ఉన్నాయి. వాటిలో మొదటిది, ప్రభుత్వం ఒక స్వచ్ఛంద సంస్థ అనే అభిప్రాయాన్ని కలిగిస్తుంది. ఇది ప్రజల గౌరవాన్ని తగ్గిస్తుంది. ప్రభుత్వానికి కృతజ్ఞతతో ఉండాలన్న భావనను పెంపొందిస్తుంది. రెండవ కారణం, ప్రభుత్వం ఇచ్చే మొత్తాన్ని ఎప్పుడైనా తగ్గించుకోవచ్చు. లేదా మొత్తం పథకాన్ని రద్దు చేయవచ్చు. మూడవది, ప్రజలకు అందచేసే డబ్బు, వారి జీవితాలను మెరుగుపరచాలంటే ఆ నిధులు దుర్వినియోగం కాకుండా సక్రమంగా ఖర్చు చేయించగల సంస్థలు ఉండాలి.

ఈ కారణాలవల్ల సార్వత్రిక, రాజ్యాంగ బద్ధంగా హామీ ఇవ్వబడిన, న్యాయబద్ధమైన ఆర్థిక హక్కులను ప్రజలకు కల్పించడమే సముచితమైన చర్యగా ఉంటుంది. అంటే ప్రస్తుతం మనకున్న ప్రాథమిక రాజకీయ, పౌర హక్కులకు సమానమైన ప్రాథమిక ఆర్థిక హక్కులన్నమాట!

**ఐదు ఆర్థిక హక్కులు**

కనీసం ఐదు ప్రాథమిక ఆర్థిక హక్కులను ప్రవేశపెట్టాల్సిఉంటుంది. అవి ఆహారంపై హక్కు.(కరోనా వ్యాప్తికి ముందు ఉన్న తరహాలోనే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికి ఆహారం పొందే హక్కు), ఉపాధి హక్కు (ఉపాధి చూపించడంలో విఫలమైతే పూర్తి వేతనం చెల్లించాలి) ప్రభుత్వ సంస్థల్లో (హయ్యర్ సెకండరీ స్థాయి వరకు) ఉచిత నాణ్యమైన విద్యను పొందే హక్కు, జాతీయ ఆరోగ్య సేవ ద్వారా ఉచిత, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ హక్కు, చివరగా జీవించే హక్కును కల్పించాల్సి ఉంటుంది.

నాన్ కంట్రిబ్యూటరీ, వృద్ధాప్య పెన్షన్, వికలాంగుల ప్రయోజనాల కోసం జనాభాలో ఒక్క శాతంగా ఉన్న శతకోటీశ్వరులపై కేవలం రెండు పన్నులు విధించడం ద్వారా ఈ ఆర్థిక హక్కులను కల్పించవచ్చు. మొదటిది, సంపదపన్నును రెండు శాతం విధించాలి. రెండవది సంతానం లేదా స్నేహితులకు సంక్రమించే ఆస్తులపై మూడవ వంతు వారసత్వ పన్ను విధించడం,

కచ్చితంగా చెప్పాలంటే, ఈ పన్నుల ద్వారా వచ్చే మొత్తం ప్రతిపాదిత హక్కుల ఆధారిత సంక్షేమ రాజ్యపు ఆర్థిక అవసరాలను తీర్చడానికి మాత్రమే ఉపయోగపడుతాయి. వాటి సక్రమ అమలుకు సరైన ఉత్పత్తి ప్రణాళిక ద్వారా నిజమైన వనరులను సమీకరించాల్సి ఉంటుంది. కేంద్రం, రాష్ట్రాల మధ్య పరిపాలన, బాధ్యతల విభజన సక్రమంగా జరగాలి. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను రూపొందించాలి. ఈ చర్యలు తీసుకోగలిగితే ప్రస్తుతం సంక్షోభంలో ఉన్న మన ఆర్థిక వ్యవస్థ దానిని అధిగమించి, నయా–ఫాసిజం నుండి వచ్చే ముప–ను ఎదుర్కొని హక్కుల ఆధారిత సంక్షేమ రాజ్యంగా ఆవిర్భవించగలుగుతుంది. ఈ దిశలో చర్యలు చేపట్టడానికి రాజ్యాంగ సవరణ చేయాలి. అలా చేయడం కష్టమైతే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం అమలుకు చేసిన విధంగా పార్లమెంటు ఉభయ సభల్లో ఏకగ్రీవ తీర్మానం చేయాలి.

**(అనువాదం: పొగడ దొరువు)**

ఈ మాసం ప్రత్యేకం

# నిరుద్యోగ భారతం



స్వాతంత్ర్యానంతర భారతదేశంలో నిరుద్యోగం, తగినంత పని దొరకకపోవటం ముఖ్యమైన సమస్యలుగా ఉన్నాయి. మనది వ్యవసాయం ప్రధానమైన దేశం కాబట్టి ఆర్థికవ్యవస్థలో మిగులు శ్రామికులు ఉన్నారు. పెట్టుబడులు తక్కువగా ఉండటంతో పారిశ్రామిక ఉత్పాదకత గిట్టుబాటు కానంత తక్కువగా ఉంటున్నది. వ్యవసాయ రంగం రుతుపవనాలపై ఆధారపడి ఉన్నది. ఉద్యోగాల కల్పన స్థితిని అంచనా వేయటానికి కార్మికశక్తి భాగస్వామ్యం దామాషా-ఎల్‌ఎఫ్‌పి - నిరుద్యోగ సూచీలు కీలకమైనవి. మొదటిది దేశంలోని పనిచేసే శక్తి కలవారిలో పనిచేస్తున్నవారి శాతాన్ని తెలుపుతుంది. ఇది మొత్తం పనిచేయగల శక్తికల వారిని లేక మొత్తం కార్మికుల సరఫరాను సూచిస్తుంది. మరోవైపున పనికోసం ఎదురు చూస్తున్నప్పటికీ పని దొరకని వారు ఎంతశాతం ఉన్నారన్న అంశాన్ని నిరుద్యోగుల శాతం తెలుపుతుంది. ప్రత్యేకమైన కొన్ని తరగతులను కూడా వీటిలో చేరుస్తుండటం వలన "పనిచేస్తున్నవారు" ఎవరు, "పనికోసం ఎదురు చూస్తున్నవారు" ఎవరు అన్న అంకెలు ఎప్పుడూ సంపూర్ణంగా ఉండవు. వాటిపై వివిధరకాలైన విశ్లేషణలు వస్తుంటాయి. వీటిని నిర్దిష్టంగా నిర్ణయించటంలో ఉన్న ఈ అనిశ్చితి వలన దేశంలో ఉద్యోగకల్పన స్థితి ఆశావహంగా ఉన్నదని చెప్పటానికి, నిరుద్యోగాన్ని తక్కువగా అంచనా వేయటానికి దారితీస్తున్నది.

ఒక వ్యక్తి వారం రోజుల పాటు ఎటువంటి ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొనకపోతే ఆ వారంలో అతను నిరుద్యోగిగా ఉన్నట్లు పరిగణిస్తున్నారు. 1972-87 సంవత్సరాల మధ్య నిరుద్యోగం 4-5 శాతంగా ఉండేదని, పట్టణ ప్రాంతాలలో కన్నా గ్రామీణ ప్రాంతాలలో అధికంగా ఉందని ఆ కాలంలో రూపొందించిన నేషనల్ శాంపుల్ సర్వే నివేదికలలో పేర్కొన్నారు. 1983, 1993 సంవత్సరాలలో 15-59 సంవత్సరాల

**సుజయ్ చక్రవర్తి**

వయసున్న వారిలో పనిలో భాగస్వాములవుతున్న వారు 58 శాతంతో దాదాపుగా స్థిరంగా ఉన్నదని ఎల్‌ఎఫ్‌పి ఆర్ నివేదికలో చెప్పారు. 1999-2000లలో కొంచెం తగ్గి 56 శాతంగా ఉంది. 2019, 2022 సంవత్సరాలలో వరుసగా 50, 55 శాతంగా ఉన్నది.

సరళీకరణ విధానాల అమలుకు ముందు, తర్వాత కూడా భారతదేశ ఆర్థికవ్యవస్థలో ఉద్యోగకల్పనే ప్రధానాంశంగా ఉన్నప్పటికీ, 90 శాతం మందికి పైగా ఏ విధమైన ఉద్యోగ భద్రత లేని అసంఘటిత రంగంలోనే ఉన్నారు. క్రమబద్ధమైన జీతం లేదా కూలి లభించే పనులలో 20 శాతం కన్నా తక్కువ మంది మాత్రమే ఉన్నారు.

1991లో కొత్తగా సరళీకరించిన భారతదేశ ఆర్థికవ్యవస్థలో ప్రభుత్వరంగ సంస్థలను పాక్షికంగా ప్రైవేటీకరించటానికి, ఉత్పత్తిరంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డిఐ) రావటానికి అవకాశం కల్పించారు. ఫ్యాక్టరీలలో పనిచేసే కూలీలకు కొంత మేరకు డిమాండ్ పెరగటానికి ఇది దోహదం చేసింది. ఐనప్పటికీ ఇది ప్రత్యేక ఆర్థిక మండళ్ళ(ఎస్ఇజెడ్)లో కాంట్రాక్టు ఉద్యోగాలకే ఎక్కువగా పరిమితమైంది. అక్కడ దుర్భరమైన పని పరిస్థితులు, గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ, వ్యవసాయేతర పనుల నుండి తొలగించ బడిన వారు అక్కడున్న కొద్దిపాటి ఉద్యోగాల కోసం పోటీ పడుతున్నారు. ఈ కాలంలో ప్రతికూల పరిస్థితులు, భూములను సేకరించటం తరచుగా వివాదాలకు దారి తీసినప్పటికీ గనుల రంగంలో కొద్ది మేరకు అసంఘటితరంగ ఉద్యోగాలను కల్పించారు. కొన్నిచోట్ల ఈ రోజుకు కూడా ఆ వివాదాలు కొనసాగుతున్నాయి. రవాణారంగం లాంటి సహాయక పరిశ్రమలు 1980లలో ఉన్న నిరాశాజనకమైన పరిస్థితుల నుండి కొంత మేరకు బైటపడ్డాయి. మొత్తంగా చూసినపుడు 1990లలో జరిగిన పారిశ్రామికాభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ పెరుగుదల భారీగా కార్మికులను తొలగించటానికి దారితీయలేదు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో లేని విధంగా పెట్టుబడులు విపరీతంగా పెట్టవలసిన పరిశ్రమలను ఎఫ్‌డిఐ తనతో పాటు తీసుకువచ్చింది. 2000ల ప్రథమార్థంలో 3-4 శాతానికి పెరగటానికి ముందు వాస్తవంగా 1990-2000లలో నిరుద్యోగం 3 శాతం కన్నా తక్కువకు పడిపోయింది. 2022లో 4 శాతం కన్నా తక్కువకు తగ్గటానికి ముందు నిరుద్యోగం 2019లో 5.8 శాతంకు పెరిగింది. భారతదేశంలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజి సంస్థలైన ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సి సర్వీసెస్, విప్రో లాంటి కంపెనీలు ప్రపంచవ్యాపితంగా ప్రభుత్వాలు, కంపెనీలు సెల్యూలర్ కమ్యూనికేషన్స్, ఉత్పత్తిరంగంలో కంప్యూటర్‌లను వినియోగించుకోవటం, జీతాల చెల్లింపు, అకౌంటింగ్ రంగాలకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌లను రూపొందించటం కోసం వేలాది మంది ఇంజనీరింగ్ పట్టభద్రులను ఉద్యోగాలలోకి తీసుకున్నారు. దీనితో పాటు ఉత్తరాది దేశాలలోని ఇంజనీరింగ్, టెక్నాలజి సంస్థలలో పనిచేయటం కోసం వేలాది మంది భారతీయ యువతీ యువకులు విదేశీ ప్రభుత్వాల అనుమతి కోసం పోటీపడుతున్నారు.

**యువతలో నిరుద్యోగ సమస్య**

2000 నుండి 2008 వరకు బిజినెస్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్‌కు డిమాండ్ బాగా పెరిగింది. దానితో దేశంలో బెంగళూరు, హైదరాబాద్, పూనెలలో "టెక్ హబ్"లు వేగంగా అభివృద్ధి చెందాయి. ఐటి, ఐటి సేవల రంగాలలో కార్యకలాపాలు, ఈ రంగాలకు సహకారంగా ఉండే నిర్మాణం, అవసరమైన

పరికరాలను అందించటం, అతిథులకు సదుపాయాలు కల్పించటం, తదితరాలు అభివృద్ధి చెందినప్పటికీ, శ్రామికశక్తికి డిమాండ్ పెరుగుదల బలహీనంగా ఉంది. ఈ కాలంలోనే ప్రైవేటురంగంలో విద్య వేగంగా విస్తరించింది. 2003 నుండి 2010 వరకు ఎనిమిది సంవత్సరాల కాలంలో ఏడు సంవత్సరాలు జిడిపి 7.8 శాతం చొప్పున పెరగటంతో జిడిపి పెరుగుదల ఆకట్టుకొనే విధంగా ఉంది. 1990 నుండి శ్రామికుల ఉత్పాదకత పెరుగుదల తలసరి ఉత్పాదకత పెరుగుదలకు దాదాపు సమానంగా ఉండటంతో ఉత్పత్తి పెరుగుదల ఉపాధికల్పనపై పరిమితమైన ప్రభావాన్ని మాత్రమే చూపగలిగింది.

**❝ ఒక దశాబ్దపు ఎన్ఎస్ఎస్ డేటాను పరిశీలించినట్లైతే ఉద్యోగాల కల్పన అతి తక్కువగా ఉన్నదని, 2000-2012 మధ్యకాలంలో ఉద్యోగాలలో పెరుగుదల రెండు శాతం కన్నా తక్కువ ఉన్నదని స్పష్టమౌతున్నది. వాస్తవంగా రెండు శాతం కన్నా తక్కువ స్థాయిలో ఉద్యోగాలు కల్పించటం అనే ఈ క్రమం గత రెండు దశాబ్దాలలో ఎక్కువ కాలం కొనసాగింది.❞**

ఒక దశాబ్దపు ఎన్ఎస్ఎస్ డేటాను పరిశీలించినట్లైతే ఉద్యోగాల కల్పన అతి తక్కువగా ఉన్నదని, 2000-2012 మధ్యకాలంలో ఉద్యోగాలలో పెరుగుదల రెండు శాతం కన్నా తక్కువ ఉన్నదని స్పష్టమౌతున్నది. వాస్తవంగా రెండు శాతం కన్నా తక్కువ స్థాయిలో ఉద్యోగాలు కల్పించటం అనే ఈ క్రమం గత రెండు దశాబ్దాలలో ఎక్కువ కాలం కొనసాగింది. దీనిని 4-5 శాతంకు పెంచకపోతే, భారతదేశంలో ప్రస్తుతం 1.69 శాతం చొప్పున పెరుగుతున్న శ్రామికశక్తిలోని మిగులు శ్రామికులను ఇముడ్చుకోవటం అసంభవం అవుతుంది.

ఈ సహస్రాబ్దిలో పరిమిత స్థాయిలో మాత్రమే యువతకు ఉద్యోగాలు కల్పించగలగటం ఆందోళన కలిగిస్తున్నది. దేశంలో అధికంగా ఉన్న మానవ వనరులను వినియోగించుకోవటంలో ఇది తీవ్రమైన సవాళ్ళను ముందుకుతెస్తుంది. గత కొన్ని దశాబ్దాల నుండి భారతదేశంలో 15-29 సంవత్సరాల వయసున్న వారిలో నిరుద్యోగ రేటు పెరుగుతున్నదని అంతర్జాతీయ కార్మికసంస్థ విడుదల చేసిన ఇండియా ఎంప్లాయ్‌మెంటు నివేదిక 2024లో పేర్కొన్నది. యువతలో నిరుద్యోగం 2000 సంవత్సరంలో 5.6 శాతం ఉండగా, 2012కు 6.2 శాతానికి చేరింది. 2019 నాటికి మూడురెట్లు పెరిగి దాదాపుగా 18 శాతానికి చేరి, 2020 నాటికి 15.1 శాతానికి తగ్గింది. ఎల్ఎఫ్‌పిఆర్ యువకులలో 61.2 శాతం ఉండగా, యువతులలో మూడురెట్లు తక్కువగా 21.7 శాతమే ఉంది. గ్రామీణప్రాంతంతో పాటు పట్టణప్రాంతంలో కూడా లింగ వ్యత్యాసం ఒకే విధంగా ఉన్నది. విద్యారంగం విస్తరించటం వలన యువతలో నిరుద్యోగం పెరిగిందని, స్త్రీ, పురుషులలో ఎక్కువగా, పట్టభద్రులలో అత్యధికంగా నిరుద్యోగం ఉన్నదని ఐఎల్‌వో నివేదికలో పేర్కొంది.

2019-22 మధ్య తగ్గినప్పటికీ గత రెండు దశాబ్దాలలో విద్యావంతులలో నిరుద్యోగం పెరిగింది. 2022లో సెకండరి విద్యను పూర్తి చేసిన లేదా అంతకన్నా అధికంగా విద్యను అభ్యసించిన వారిలో నిరుద్యోగం ఆరు రెట్లు, 18.4 శాతం ఎక్కువగా ఉన్నది. పట్టభద్రులలో తొమ్మిది శాతం అధికంగా ఉన్నది. భారతదేశంలోని నిరుద్యోగులలో 83 శాతం యువతే ఉన్నది. వీరిలో సెకండరి లేదా పట్టభద్రులైన వారు 2000 సంవత్సరంలో 35.2 నుండి 2022లో 65.7 శాతానికి పెరిగారు. మొత్తంగా చూసినపుడు బయటికి నిరుద్యోగం తక్కువగా, స్థిరంగా ఉన్నట్లు కనిపించినప్పటికీ, పనిచేయటానికి సిద్ధపడిన వారికి వారంలో తగినంత పని దొరకని స్థితిని అది కప్పిపెడుతున్నది. పనిచేయటానికి సిద్ధపడిన వారికి వారంలో పని దొరకకపోవటం 2012లో 8.1 శాతం నుండి 2019లో 9.1 శాతానికి పెరిగి, 2022లో 7.5 శాతానికి తగ్గింది.

ఉన్నత విద్యారంగంలో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవటం ఈనాడు ప్రపంచవ్యాపితంగా జరుగుతున్నది. ఒక దశాబ్దం క్రితంతో పోల్చుకున్నప్పటికీ పరిపాలన నిర్వహణ, సాధారణ కార్యకలాపాల కోసం ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు కొద్దిమంది యువత, అతికొద్దిమంది వ్యక్తులను మాత్రమే తీసుకొంటున్నాయి. అనమానతలు పెరగటంతో సరుకులు, సేవలకు డిమాండ్ తగ్గటం వలన ప్రపంచవ్యాపితంగా ఉత్పత్తి కూడా తగ్గిపోతున్నది. దానితో పాటు ఉత్పత్తిలో కృత్రిమ మేధను ఉపయోగించుకోవటం, ఆటోమేషన్‌ను పెంచటం వలన తక్కువ నైపుణ్యం ఉన్న, నైపుణ్యం కలిగిన శ్రామికుల ఉత్పాదకత పెరిగింది. ఫలితంగా గతంలో చేసిన అదే మోస్తరు పనులను ఇపుడు చేయటానికి కొద్దిమంది శ్రామికులే అవసరమౌతున్నారు. ఈ విధంగా విస్తరిస్తున్న నిరుద్యోగం ఆర్థికవ్యవస్థ మీద తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఫలితంగా విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకొని, తమస్థాయికి తగని ఉద్యోగాల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకొంటున్న నైపుణ్యం కలిగిన వారు కూడా ఉద్యోగాలను పొందటం సాధ్యం కాదు.

ఈ క్రమం ఉద్యోగాలు పొందటానికి తగిన అర్హత లేదనే భావనకు గురౌతున్న, తక్కువ విద్యార్హతలు కలిగిన వారు ఉద్యోగాలు పొందే అవకాశాలను కుదించివేస్తుంది. ఏ విధమైన నైపుణ్యం పెంపుదల అవసరం లేకపోయినప్పటికీ, యువత అభివృద్ధి అవుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ప్రయోజనం పొందగల స్థాయిలో ఉన్నప్పటికీ, రానున్న సంవత్సరాలలో వారిలో అత్యున్నత విద్యావంతులు కూడా ఉద్యోగాలను పొందలేరు. గత రెండు దశాబ్దాలలో దేశంలో ఉద్యోగ కల్పన లేని అభివృద్ధి జరుగుతుండటం వలన ఈ సహస్రాబ్దిలో కల్లా ఎక్కువగా అనమానతలు పెరిగాయి. 2022-23లో దేశంలోని ఒక శాతం ధనికులు సంపదలో 40.1, ఆదాయంలో 22.6 శాతాలను స్వంతం చేసుకుంటున్నారని థామస్ పికెట్టి రాసిన వ్యాసంలో పేర్కొన్నాడు. సంపద, ఆదాయాల పున:పంపిణీ జరగకుండా సాంప్రదాయకమైన విద్య కోసం ఫీజులు చెల్లించటానికి ఇబ్బందులు పడుతూ, ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్న మధ్య తరగతి వారు అత్యున్నత నైపుణ్యాలను పొందాలన్న ఆశ సుదూర స్వప్నంగా మిగిలిపోతుంది.

**భయపెడుతున్న సాంకేతిక పరిజ్ఞానం**

సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధల వినియోగం అసమానంగా ఉన్నప్పటికీ అవి

> **“మరోవైపున కార్మికశక్తి అధికంగా ఉండే భారతదేశం లాంటి చోట్ల అధిక పెట్టుబడితో యంత్రాలను వినియోగించటం గిట్టుబాటు కాదు. కాబట్టి సాంప్రదాయకంగా అభివృద్ధి అవుతున్న బట్టలు, వస్త్రాలు, తోలు, చెప్పులు తదితర రంగాలలో స్వయం చలిత యంత్రాలను ప్రవేశపెట్టలేం. ప్రపంచంలోని ధనిక దేశాలలో వ్యవసాయ రంగంలో స్వయంచలిత యంత్రాలను ప్రవేశపెట్టటం పెరుగుతున్నది.”**

ఆర్థిక వ్యవస్థలోని అనేక రంగాలలోని కార్మికులను తొలగిస్తాయి. సరుకుల తయారీలో అత్యున్నతమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే ఎగుమతులపై ఆధారపడిన పరిశ్రమలు, ఆటోమొబైల్, టెలికాం లాంటి రంగాలలో త్రీడి ప్రింటింగ్ తదితర ఆధునికమైన స్వయం చలిత యంత్రాలను ప్రవేశపెడతారు. ఈ యంత్రాలు వస్తువులను కూర్చే పనిని పర్యవేక్షించటానికి తక్కువ మంది శ్రామికులు సరిపోతారు. రవాణ, గోడౌన్లు, సున్నితమైన పరికరాలను నిర్వహించటానికి అయ్యే ఖర్చు కూడా బాగా తగ్గుతుంది.

సేవలరంగంలో, ప్రత్యేకంగా ద్రవ్య, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ఐటి సేవల రంగాలలో నిరంతరం సాంకేతికాభివృద్ధి జరుగుతూ ఉంటుంది. కాబట్టి ఆటోమేషన్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఐటి, ఐటి సేవల రంగాలలో ఆటోమేషన్ వలన దేశంలో తక్కువ నైపుణ్యం అవసరమైన 6,40,000 ఉద్యోగాలు పోతాయని, మధ్యరకం, అత్యున్నతమైన సాంకేతిక పరిజ్ఞానం అవసరమైన 1,60,000 కొత్త ఉద్యోగాలు వస్తాయని “భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం” అన్న నివేదికలో ఐఎల్ఓ చెప్పింది.

కృత్రిమ మేధను ఉపయోగించటం ద్వారా కార్మికులకు, వినియోగదారులకు సేవ చేసే “అగ్రిగేటర్, జిఐజి, ఊబెర్, ఓలా, జొమాటో, స్విగ్గి, డన్‌జో, అర్బన్ కంపెని” లాంటి “ప్లాట్‌ఫాం” ఆర్థికవ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నారు. ఇవి వ్యక్తిగత రవాణ, సరుకులను వినియోగదారులకు అందజేయటం, ఇంటిని శుభ్రపరచటం తదితర సేవలందించే సంస్థలను వినియోగదారులతో కలుపుతాయి. ఈ రంగంలో 2.4 కోట్ల ఉద్యోగాలు లభిస్తాయని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపు, డెల్ ఫౌండేషన్ 2021లో రూపొందించిన నివేదికలో చెప్పాయి. అయితే ఇవన్నీ తాత్కాలికమైనవి, అస్థిరమైన గిగ్ సేవల ఉద్యోగాలు. ఈ సేవలకు ఉండే డిమాండ్‌తోనే వీటి లభ్యత ఉంటుంది.

త్వరితంగా ముగిసిపోయే, కాంట్రాక్టు తరహాలోని ఈ విధమైన ఉద్యోగాల వలన ఆరోగ్య బీమా, సెలవులు, నిరుద్యోగులకు లభించే వివిధ రిటైర్‌మెంట్ ప్రయోజనాలు తదితరాలు కార్మికులకు లభించవు. ఫలితంగా అనారోగ్యం లేదా మార్కెట్లో సంభవించే ఎగుడుదిగుడులతో ఈ గిగ్ ఆర్థికరంగాలలో పనిచేసే కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటారు. దీనితో పాటు ఈ గిగ్ రంగాలలో పనిచేసే కార్మికులకు నిర్దిష్టమైన వేతనాలు ఉండవు. కమిషన్ ప్రాతిపదికగా లేదా అతి తక్కువ వేతనాలకు పనిచేసే వీరిపై ఆ సంస్థలు విపరీతమైన పని భారాన్ని మోపుతాయి. ఫలితంగా వారి ఆరోగ్య సమస్యలు తీవ్రమై, తమ జేబులో నుండి ఎక్కువగా ఖర్చు చేయాల్సిన పరిస్థితులను ఎదుర్కొంటారు.

మరోవైపున కార్మికశక్తి అధికంగా ఉండే భారతదేశం లాంటి చోట్ల అధిక పెట్టుబడితో యంత్రాలను వినియోగించ టం గిట్టుబాటు కాదు. కాబట్టి సాంప్రదాయకంగా అభివృద్ధి అవుతున్న బట్టలు, వస్త్రాలు, తోలు, చెప్పులు తదితర రంగాలలో స్వయం చలిత యంత్రాలను ప్రవేశపెట్టలేం. ప్రపంచంలోని ధనిక దేశాలలో వ్యవసాయ రంగంలో స్వయంచలిత యంత్రాలను ప్రవేశపెట్టటం పెరుగుతున్నది.

**పరిష్కారాలు**

దేశంలో తీవ్రంగా ఉన్న అసమానతలను యుద్ధ ప్రాతిపదికపై పరిష్కరించాల్సి ఉంది. ప్రపంచీకరణ చెందిన ఆర్థికవ్యవస్థ అవసరాలను తీర్చాలంటే మన విద్యావ్యవస్థను పూర్తిగా సంస్కరించాలి. వ్యక్తులను విద్యావంతులను చేయటం, వారికి నైపుణ్యాలను నేర్పటం, ఉన్న నైపుణ్యాలను మరింత ఆధునీకరించుకునే విధంగా తోడ్పాటు అందించాలి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు ప్రమాదకరంగా పెరగటం, గాలి, నీటి కాలుష్యాన్ని అరికట్టేందుకు తోడ్పడే, బొగ్గుకు ప్రత్యామ్నాయాలను వినియోగించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవటం భారతదేశానికి అవసరం. తమకున్న కొద్దిపాటి భూమిని సాగుచేసుకొంటూ తీవ్ర దారిద్ర్యంలో ఉన్న, వర్షాధార వ్యవసాయంపై ఆధారపడిన ఎక్కువ మంది చిన్న రైతులు వ్యవసాయంలో స్వయం చలిత యంత్రాలను ప్రవేశపెట్టలేరు. శ్రామికులు ఎక్కువగా ఉండటం, దిగుబడులు తక్కువగా ఉండటం వలన యంత్రీకరణకు పెట్టుబడులు పెట్టటం లాభదాయకం కాదు. కొత్తగా వ్యవసాయరంగంలోకి వస్తున్న సంస్థలు యాంత్రీకరణ చేస్తున్నప్పటికీ, ఈ రంగంలో ఎక్కువగా యాంత్రీకరణ చేయటం లేదా కృత్రిమ మేధను ప్రవేశపెట్టటం సాధ్యం కాదు.

**పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**

భవిష్యత్ శ్రామికశక్తికి ఎదురయ్యే ప్రధాన సమస్య పర్యావరణ మార్పులు. స్థిరమైన అభివృద్ధి సాధనకై జి20 ఏర్పాటు చేసిన గ్రూపు 2018లో ఇచ్చిన నివేదికలో తరచుగా, తీవ్రస్థాయిలో సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలు మానవుల ఉత్పాదకతను తగ్గించాయని వెల్లడించింది. వీటి వలన పని ప్రదేశాలలో సంభవిస్తున్న వైపరీత్యాలతో 2000–2015 సంవత్సరాల మధ్య ప్రపంచంలో సంవత్సరానికి 2.3 కోట్ల పని సంవత్సరాల (వర్కింగ్ లైఫ్ ఇయర్స్)ను నష్టపోయామని పేర్కొన్నారు. జి20లో సభ్యదేశాలైన చైనా, బ్రెజిల్, ఇండియాలు తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. 2008–15 మధ్య సంవత్సరానికి సగటున వ్యక్తికి, సంవత్సరానికి చైనాలో 8.7, బ్రెజిల్‌లో 3.2, భారతదేశంలో 1.5 వర్కింగ్ లైఫ్ ఇయర్స్‌ను నష్టపోయాయి. ప్రస్తుతం వేస్తున్న అంచనా ప్రకారం 2030 నాటికి పెరిగే ఉష్ణోగ్రతలతో జి20 దేశాలలో 1.9 శాతం, భారతదేశంలో 5.2 శాతం పని గంటలు తగ్గిపోతాయి. ఉష్ణోగ్రతల మార్పుతో వ్యవసాయ కార్మికులు, అభివృద్ధి అవుతున్న ఆర్థికవ్యవస్థలలోని కార్మికులపై తీవ్రమైన ప్రభావం పడుతుంది.


మనుషులపై ఆధారపడే పరిస్థితులు తక్కువగా ఉంటాయని స్పష్టమౌతున్నందున ఉద్యోగాలను కల్పించటం, వాటిని స్థిరంగా కొనసాగించటం భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో భవిష్యత్ ప్రభుత్వాలకు

(మిగతా 34వ పేజీలో)

విశ్లేషణ

# అవినీతిపై యుద్ధం: మాటలు ఘనం ఆచరణ శూన్యం

**పరంజొయ్ గుణ ఠాకుర్తా**



రచయిత ప్రముఖ పాత్రికేయుడు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో నాలుగు దశాబ్దాల అనుభంతో అనేక వ్యాసాలు రాశారు.

ఒక దశాబ్దానికి ముందు, అప్పటికింకా మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారు, 2014 ఎన్నికల ప్రచారంలో మోడీ గారు, "నేను తినను. ఎవరినీ తిననివ్వను" అని ప్రకటించారు. అంతేకాదు పన్ను స్వర్గధామాలలో నిల్వ ఉన్న నిధులను వెలికి తీసి భారత దేశంలో పేదలకి – ఒక్కొక్క కుటుంబానికి రూ 15 లక్షల చొప్పున పంచిపెడతానని సెలవిచ్చారు. మోడీ తనకు తాను అవినీతిని నిర్మూలించే వీరుడిలా ప్రదర్శించుకున్నారు. అప్పటి కాంగ్రెస్ పాలన అవినీతి మయమని, తాను దేశాన్ని ఆ అవినీతి నుండి బయట పడేస్తానని ప్రగల్భాలు పలికారు.

కానీ, ఆ అవినీతి సొమ్ము దేశానికి చేరనే లేదు. ఆ తర్వాత మోడీ మాటవరసకు అలా అన్నారని అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడూ, ఇప్పటి కేంద్ర గృహ మంత్రీ ఎన్నికల ప్రచారంలో కొట్టి పారేశారు.

రాజకీయ ఆర్థిక సమస్యలలో అవినీతి ప్రధానాంశం కాని ఎన్నికలు భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో లేనే లేవు. భారతదేశంలో వర్గాలతో సంబంధం లేకుండా, సాధారణ ప్రజలందరూ నిత్యం ఎదుర్కొనేది, బాధించేదీ అవినీతి అంశం. దీన్ని తలకెత్తుకుని, ప్రచారాంశంగా వాడుకుని విజయవంతమైన వారే రాజకీయ నాయకులందరూ. కానీ వారు ఎన్నికైన తర్వాత ఆ విషయంలో ఎంత శ్రద్ధ తీసుకున్నారు, ఏం చేశారన్నది వేరే విషయం. ఎన్నికల్లో మాత్రం ప్రజల సానుభూతి పొంద డానికి ఉపయోగించే అస్త్రాలలో అవినీతి ఒకటి.

మోడీ అందుకు మినహాయింపు కాదు. అందువలననే ఈరోజు ప్రజలు అతనిని మాటలు కోటలు దాటాయి కదా! చేతలు గడప దాటలేదెందుకు అని ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఎన్నికల బాండ్లు కొనుగోలు వ్యవహారంలో సుప్రీంకోర్టు బాండ్ల కొనుగోలు దారుల చిట్టాను ప్రకటించమని ఆదేశించినా ప్రకటించకుండా ఉండడానికి శతవిధాల ప్రయత్నాలు చేయడం అతని బూటకాన్ని, డాంబికాన్ని బయట పెట్టింది.

1980లలో విశ్వనాథ్ ప్రతాప్ సింగ్, అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీని అవినీతికి ప్రతిరూపంగా చిత్రించారు. గల్లీ గల్లీ మే షోర్‌హై రాజీవ్ గాంధీ చోర్ హై (వీధివీధినా అరుపులు, రాజీవ్ గాంధీ దొంగ దొంగ) అనే నినాదాన్ని ప్రజలు బాగా స్వీకరించారు. లోక్ సభలో ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోయింది. రాజీవ్ గాంధీ స్వీడెన్ కి చెందిన బోఫోర్స్ అనే సంస్థ నుండి ముడుపులు స్వీకరించి భారతదేశ సైనిక రంగం ద్వారా ఆయుధాల కొనుగోలు ఒప్పందం చేసుకున్నారనే అభియోగాన్ని ఎదుర్కొన్నారు.

2004 మే లో మన్మోహన్ సింగ్ నీతి మంతునిగా పేరుగడించి ప్రధానిగా ఎన్నికైన తరువాతే ఆ నింద నుండి కాంగ్రెస్ విముక్తి పొందింది. కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పివి నరసింహా రావు ఉన్నకాలంలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. 1993లో స్టాక్ మార్కెట్‌ని ఒక కుదుపు కుదిపి, ప్రజలను నిట్ట నిలువునా ముంచిన హర్షద్ మెహతా వాటాల విక్రయాల విషయంలో గురక పెట్టి నిద్ర పోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. 2004-2014 మధ్య కాలంలో, పదేళ్ల పాటు ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్ తన పదవి చివరి రోజుల్లో అనేక అపవాదులు మోశారు. బొగ్గు గనుల కేటాయింపు, స్పెక్ట్రమ్ కేటాయింపులు–అందుకు రూపొందించిన విధి విధానాల విషయం నుండి ధరల నిర్ణయం వరకు. భారత కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ – కాగ్ (ప్రజల ధనం వినియోగాన్ని పరిశీలించడానికి ఏర్పరచిన రాజ్యాంగ వ్యవస్థ) ప్రభుత్వ ఉదాసీనతను, చర్యలు తీసుకోక పోవడాన్ని ప్రశ్నించింది.

పుండు మీద కారం చల్లినట్టు ఆనాడు యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ న్యూ ఢిల్లీలో నిర్వహించిన కామన్వెల్త్ గేమ్స్‌లో జరిగిన అక్రమాలు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాయి. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా చేసే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఈ సందర్భంగా ఒప్పందాలు జరిగాయి అని ఆరోపణలు వెల్లువెత్తాయి. బీహార్ ముఖ్యమంత్రి, రాష్ట్రీయ జనతా దళ్ నాయకుడు, లాలూ ప్రసాద్ యాదవ్ ఖైదు చేయబడిన తరువాత చట్టంలో కొన్ని మార్పులు తెచ్చేందుకు విఫల ప్రయత్నాలు జరిగాయి. అప్పటికి లాలూ కాంగ్రెస్ కూటమిలో భాగస్వామిగా ఉన్నారు .

2014 జనవరి 5, (అప్పటికి మోడీ తిరుగులేని ప్రధానమంత్రి అభ్యర్థిగా బరిలో ఉన్నారు) ఇప్పుడు బాబా రాందేవ్ గారి పతంజలి ఆయుర్వేదిక్ ట్రస్ట్ లిమిటెడ్ ఉన్న స్థలంలో శంఖు స్థాపన చేస్తూ, "అవినీతిని అంతం చేయాలంటే విధాన రూపకల్పనలో, అమలులో కూడా క్రమంగా ముందుకెళ్లాల్సి ఉంటుంది" అని మోడీ అన్నారు.

మనం వెనక్కి తిరిగి చూసుకుంటే, అదెంత కపటత్వం తో కూడినదో తెలుస్తుంది. 2024 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు రాందేవ్ బాబాని, అతని సహచరులను– తప్పుడు వాణిజ్య ప్రకటనలు ఇస్తున్నందుకు అభిశంసించింది. పతంజలి 'మందులు' కోవిడ్ సోకిన వారికి పని చేస్తాయని, రోగాన్ని 'నయం' చేస్తాయని ప్రకటించినందుకు అభిశంసించి 'భేషరతుగా' క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. రాందేవ్ బాబా, మోడీ కూడా బీజేపీ సైద్ధాంతిక మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్‌తో దగ్గరి సంబంధాలు ఉన్నవారే.

ఈ మధ్యకాలంలో పతంజలి గ్రూప్ వ్యాపారం అంగాలుపంగలుగా పెరిగింది. రాయిటర్స్‌తో సహా అనేక ప్రసార మాధ్యమాలు పతంజలికి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, హర్యానా, అస్సాంలలోని బీజేపీ పాలిత ప్రభుత్వం ఉదారంగా అనేక రాయితీలు కల్పిస్తున్నదని కోడై కూశాయి. భూమి కేటాయింపులు అందులో ప్రధానమైనవి.

**❝ అప్పడప్పడూ గాంధీ, నెహ్రూ ఆధిప త్యంలో నడు స్తున్న కాంగ్రెస్ అని చెపుతున్న ప్పటికీ, అవినీతిని అంతం చేయ డానికి మోడీ విధాన పరమైన ఎటువంటి నిర్ణ యాలు తీసుకోలేదు. అవినీతికి గల కారణాలు గానీ, దానిని గుర్తించే విధానంపై గానీ దృష్టి పెట్టలేదు. అవినీతిని గురించిన సమగ్ర అవగా హన ఉన్నట్టు, రాజకీయ చిత్త శు ద్ధి ఉన్నట్టుగా ఆయన ప్రసంగాలలో ఎక్కడా కనిపించ లేదు. ❞**

2017 సెప్టెంబర్‌లో న్యూ ఢిల్లీలో జరిగిన బీజేపీ జాతీయ కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో, మోడీ అవినీతిని అంతమొంది స్తానన్న తన తీర్మానాన్ని మళ్ళీ ఒకసారి ఉ టంకించారు. కానీ ఆ పని ఎలా చేస్తారో వివ రించలేదు. ఆయన 'అవినీతికి వ్యతిరేకంగా జరిపే నా పోరాటంలో రాజీ లేదు. ఎవరినీ వదలను. వారు నా బంధువులైనా' అన్నారు.

అప్పుడప్పుడూ గాంధీ, నెహ్రూ ఆధిప త్యంలో నడుస్తున్న కాంగ్రెస్ అని చెపుతున్న ప్పటికీ, అవినీతిని అంతం చేయడానికి మోడీ విధాన పరమైన ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదు. అవినీతికి గల కారణాలు గానీ, దానిని గుర్తించే విధానంపై గానీ దృష్టి పెట్టలేదు. అవినీతిని గురించిన సమగ్ర అవగా హన ఉన్నట్టు, రాజకీయ చిత్త శుద్ధి ఉన్నట్టుగా ఆయన ప్రసంగాలలో ఎక్కడా కనిపించ లేదు. అసమగ్రం అని ఎందుకు అనవలసివస్తునం దంటే, అవినీతిని పెంచి పోషించే వారిపైన అతనికి సమగ్ర అవగాహన ఉన్నట్లు లేదు. రాజకీయ చిత్తశుద్ధి అని ఎందుకు అనాల్సి వస్తున్నదంటే, అవినీతి నిర్మూలనకు సమర్థ వంతమైన, బాగా క్రమబద్ధీకరించిన పరిపాల నా వ్యవస్థ నిర్మాణాన్ని రూపొందించక పోవ డం వలన.

ఆ తరువాత కాలంలో మోడీ ప్రభుత్వ హయాంలో–అంతకు ముందున్న ప్రభుత్వ పాలన కంటే – ఎక్కువసార్లు డైరెక్టరేట్ అఫ్ ఎన్ఫోర్స్‌మెంట్, ఆదాయ పన్ను శాఖ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ది నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోల చేత తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపైనా, రాజకీయ ప్రత్యర్థుల పైనా దాడులు చేయించారు.

"అవినీతిని నిలువరించడానికి బదులు గా ప్రభుత్వం, ఏజెన్సీలను "ఆయుధాలుగా" మార్చుకుని ప్రత్యర్థులను లక్ష్యాలుగా చేసుకుని, ఆ ఆయుధాలను ప్రయోగిస్తున్నది. అందులో నేటికీ మిగిలిన రెండు చట్టాలు– ఉపా , పిఎంఎల్ఏ చట్టాలు– కూడా ఉన్నాయి. ఈ చట్టాల కింద నిందితుడే తాను నిరపరాధినని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

అవినీతికి మూలాధారాలు ఎన్నో. అందులో కొన్నింటిని ఇక్కడ పరిశీలిస్తే మోడీ ఎక్కడ తప్పటడుగు వేస్తున్నారో అర్థమవు తుంది. 1990ల తరువాత భారతదేశ ఆర్థిక వ్యవస్థ "ఉదారవాద విధానాలు" అమలు చేయడం మొదలు పెట్టిన తరువాత కూడా భారతదేశం ప్రపంచ దేశాల్లో అత్యధిక నియంత్రణలు గల దేశంగా ఉంది. మోడీ గారి ఈ మాటలు గుర్తు పెట్టుకోండి: "అతి తక్కువ ప్రభుత్వ జోక్యం, అతి ఎక్కువ పాలన".

విధాన రూపకల్పనలో రాజ్యం విచక్షణ, దానిని అమలు చేయడంలో పారదర్శకత అనేవి రాజ్యం చేతిలో ఉన్న ప్రధానమైన అస్త్రాలు. నేతల చేతులలో భారత సమాజం మగ్గిపోతున్నాదని ఊరికే అనలేదు. లైసెన్స్ విధానంలో రాజకీయనాయకులు అధికార గణం కుమ్మక్కు కావడం పరిపాటి. అవినీతిని అంతం చేయాలంటే పారదర్శక విధానాలు ఉండాలి. ఎన్నికలకు నిధులు సమకూర్చడం, రాజకీయ పార్టీలు నడపడం కూడా పారదర్శ కంగా జరగాలి. మోడీ ప్రకటనలలో ఈ అంశాలు ఏవి రాలేదు. అసలు అవినీతి ఎందు కు జరుగుతున్నదనే విషయం ప్రస్తావనే లేదు. ఏ రోగమైనా నయమవాలంటే, దాని అసలు కారణాన్ని వెలికి తీయగలగాలి. మోడీ మాటలన్నీ కేవలం ధర్మోపదేశాలు లాగా ఉ న్నాయి. అయినప్పటికీ, ఆయన చేసిన ప్రకటనలు అవినీతిని అంతం చేయడానికి ఆయన పూనుకున్నాడనే భ్రమ కల్పించాయి. అతని రాజకీయ పార్టీకి ఎన్నికల లాభాలు తెచ్చి పెట్టాయి.

2016 నవంబర్ 8న మోడీ అత్యంత విధ్వంసకర నిర్ణయం తీసుకున్నారు. నోట్ల రద్దు. రాత్రికి రాత్రే, రూ 500/–రూ 1000/ – నోట్లు చెల్లకుండా పోయాయి. భారత దేశ ఆర్థిక వ్యవస్థకి ఇదో గొడ్డలి పెట్టు. భారతదేశం లోని 87% విలువ గల నోట్లు చెల్లకుండా పోయాయి. మోడీ ఈ చర్యను సమర్థించు కున్నారు. అది నల్ల ధనాన్ని వెలికి తెస్తుందనీ, అవినీతిని అంతం చేస్తుందనీ చెప్పుకున్నారు. "అవినీతిని అంతమొందించడానికి, నల్ల ధనాన్ని వెలికి తీయడానికి నోట్ల రద్దు తప్పనిసరి. ప్రజలు నన్ను అవినీతికి వ్యతిరేకం గా పోరాడామని చెప్పారు" అన్నారు.

భారతదేశ ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభా వం సంవత్సరాల తరబడి కొన సాగింది. అభివృద్ధి రేటు పడిపోయింది. నోట్ల రద్దు భారతదేశ సమాజంలో అత్యంత బలహీనుల జీవనంపై పడింది: మహిళలు, వృద్ధులు, రైతులు, రోజువారీ కూలి చేసుకునే వారు, చిన్న చిన్న షాపుల్లో పనులు చేసుకునే వారు, వ్యాపారులు, అనేక మంది ఇతరులు, అనియత రంగాలని మనం పిలుచుకునే వారు డబ్బు లేక నష్టపోయారు. 2016 నవంబర్ తర్వాత ప్రభుత్వ అధికారులు నోట్ల రద్దు గురించి మాట్లాడడం మానేశారు. ప్రభుత్వం అవినీతి ని ఏ మేరకు అంతం చేసిందో చెప్పనే లేదు.

అవినీతిని అంతం చేయడానికి ప్రభుత్వం తీసుకున్న మరో చర్య–1988 అవినీతి వ్యతిరేక చట్టాన్ని సవరించడం. ఈ చట్టంలో లంచం ఇచ్చిన వాడు, లంచం తీసుకున్న ప్రభుత్వో ద్యోగి కూడా నేరస్తులు. కానీ 2018 జులైలో మోడీ చేసిన చట్ట సవరణ ప్రభుత్వోద్యోగుల నేరాన్ని తక్కువగా చూపుతున్నది. లంచాలు ఇచ్చే వారందరినీ ఒకే గాటన కట్టకూడదు. కొందరు బలవంతంగా ఇవ్వవలసి వస్తుంది. కొందరు ఇష్టపూర్వకంగా ఇస్తారు. మోడీ చేసిన సవరణ, లంచం ఇచ్చిన వారికి అంతకు ముందు చట్టాల్లో విచారణ జరుగుతున్న సమ యంలో ప్రకటన చేసినప్పుడు ఉన్న 'రక్షణ'ని తొలగించింది. ఫలితంగా లంచాలు ఇచ్చేవారు కోర్టులకి సాక్షులుగా వచ్చే అవకాశాలు తగ్గుతాయి.

పైగా పిసిఏ చట్ట సవరణలో మరో లోపం నేరం నిర్ధారించడంలో ఉంది. సవరించబడిన చట్టంలో ఆదాయాలకన్నా మించి ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయో నిరూపించుకోవడమే కాదు, అధికంగా పొందాలన్న కోరికను కూడా 'రుజువు' చేసుకోవలసి ఉంటుంది. అంటే చట్టాన్ని మరికొంత నీరుగార్చడం. మోడీగారు అవినీతి నిరోధక చట్టాన్ని మరింత కఠినతరం చేసే బదులుగా మరింత నీరు గార్చారు .

ఈ చట్ట సవరణలు సమగ్రంగా లేవు. ఇందులో అధికారులు చట్టవ్యతిరేక కార్యకలా పాల ద్వారా, తమ స్థానాన్ని దుర్వినియోగం చేస్తే, లేదా తానే లాభం పొందే విధంగా చర్యలు చేపడితే, లేదా ఇతరులకు లాభం

చేకూరిస్తే ఏం చర్యలు తీసుకోవాలో రాయలేదు. పైగా ఇప్పటికి నాలుగు సంవత్సరాలు దాటుతున్నా ఈ చట్ట సవరణలు పార్లమెంటులో ఆమోదింప చేయలేదు. అంటే మోడీ గారికి అవినీతి నిర్మూలన మీద ఎంత శ్రద్ధ ఉందో అర్థం చేసుకోవచ్చు. మోడీ బహిరంగంగా అధికారు లు మీద కఠిన చర్యలు తీసుకుంటామని చెప్తున్నారు గాని చట్టాలలో అటువంటి ప్రతిపాదనలు పెట్టడం లేదు. పెట్టినవి కూడా అమలు చేయడానికి ప్రయత్నించడం లేదు. ఒకటి చెప్తే ఆచరణలో ఇంకోటి చేస్తున్నారు.

మన్మోహన్ సింగ్ తన పాలనలోని చివరి రోజుల్లో విజిల్ బ్లోయర్స్ చట్టం తీసుకొచ్చారు. 2014 మే 9న ఇది ఆమోదం పొంది చట్టమైంది. ప్రభుత్వాధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు, అవినీతికి పాల్పడినట్లు రుజువైతే వారి పై చట్ట పకారం చర్యలు తీసుకోడానికి అవకాశం ఉంది. కానీ ఈ చట్టంలోనే నేరాన్ని గుర్తించిన వారికి రక్షణ కల్పించడం జరిగింది. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారి వివరాలు రహస్యంగా ఉంచడానికి అవకాశం కల్పించబడింది. ప్రభుత్వ అధికారులలో అవినీతికి వ్యతిరేకంగా పోరాడటానికి ఇదో పెద్ద సాధనం .

2015 లో మోడీ ప్రభుత్వం చేసిన సవరణలో అవినీతి చేసిన వారి ఆచూకీ చెప్పిన వారికి ఎటువంటి రక్షణ కల్పించబడలేదు. తద్వారా వారందరి నోళ్లు మూయించినట్ట యింది. అందువల్ల కూడా దేశంలో అవినీతి మరింత పెరిగింది.

2005లో ప్రవేశ పెట్టబడిన సమాచార హక్కు చట్టాన్ని కూడా ఈ ప్రభుత్వం పటిష్ట పరచలేదు. మన్మోహన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చట్టం అవినీతిని నిరోధించగల బ్రహ్మాస్త్రం. మరింత పారదర్శకత పెంచేది, దానిని పటిష్ట పరిచే బదులుగా, మోడీ ప్రభుత్వం దాని సమర్థతను దెబ్బతీసే చర్యలకు శ్రీకారం చుట్టింది.

భారతదేశంలో అత్యంత ఎక్కువ అవినీతి జరిగేది ఎన్నికల నిధులు సమకూర్చడంలో. ఎన్నికల బాండ్లను కొన్న వారి పేర్లు బయట పెట్టినప్పటికీ ఏ ఏ రాజకీయ పార్టీలు ఎవరెవరి కోసం ఎంత మొత్తంలో నిధులు సమకూర్చి పెట్టారో వివరాలు ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. ఎన్నికలలో పార్టీలు చేస్తున్న ఖర్చు వారికి చేరిన బాండ్ల కన్నా ఎన్నోరెట్లు ఎక్కువ ఉంటుంది. రాజకీయ పార్టీలు అధికారికంగా అనేక రూపాలలో నిధులు సేకరించే విధానాలు ఎవరికీ అంతుచిక్కకుండా ఉన్నాయి. రాజకీయ పార్టీల అధికారిక లెక్కల ప్రకారమే వారు ఖర్చు

❝ ప్రభుత్వం అవినీతిని రూపుమాపుతున్నా నని చెపుతున్న ప్పటికీ, ఆశ్రిత పెట్టుబడి దిన దినాభివృద్ధి చెందుతున్నది. ధనికులు 'ప్రేమ మూర్తులుగా' మోడీ హృదయాన్ని నిరంతరంగా దోచుకుంటున్నారు. 2015 జనవరిలో మోడీ ఒక ఫాన్సీ సూట్ వేసుకోవడం వివాదాస్పదమైంది. దానిమీద అంతా మోడీ పేరు నేయబడి ఉంది. ప్రత్యర్థులు మోడీ ప్రభుత్వాన్ని సూట్ బూట్ ప్రభుత్వం అని ఎద్దేవా చేసారు. ❞

చేస్తున్న మొత్తాలు వారికి అందిన నిధుల మొత్తాల కంటే చాల ఎక్కువ.

గత దశాబ్దకాలంగా 'నియంత్రిత వశీ కరణ' అనే కొత్త ఆరోపణలు వస్తున్నాయి. టెలికమ్యూనికేషన్స్, విమానాశ్రయాలు, పోర్టు లు, బొగ్గు గనులు, ఇంధన రంగం మొదలైన వాటన్నిటిలో ప్రభుత్వ రంగాన్ని పక్కన పెట్టి అంబానీ, ఆదానీలను అందలం ఎక్కిస్తున్నదీ ప్రభుతం. ప్రభుత్వ రంగ సంస్థలకి ప్రైవేటు సంస్థలతో సరిసమానమైన పోటీ పడే అవకా శాలు కూడా ఇవ్వడం లేదు. అన్ని పరిశ్రమలు అదానీ గ్రూప్‌కో, అంబానీ గ్రూప్‌కో కట్టబెడు తున్నది. మోడీ ప్రభుత్వం వారికి మేలుచేసే నిర్ణయాలను తీసుకుంటున్నది. అదానీ గ్రూప్ అధినాయకుడు గౌతమ్ అదానీ, మోడీకి బాగా దగ్గరగా ఉంటారు. మోడీ 2014 ఎన్నికలలో అతని విమానాన్ని వాడు కున్నారు.

పెట్రోలియం రంగంలో గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్‌ని ఒఎన్‌జిసి అప్పుల ఊబి నుంచి బయట పడేసింది. గుజరాత్ అంటే ప్రధాని మోడీకి అత్యంత ప్రేమన్న విషయం తెలిసిందేకదా!

ప్రభుత్వం అవినీతిని రూపుమాపుతున్నా నని చెపుతున్నప్పటికీ, ఆశ్రిత పెట్టుబడి దిన దినాభివృద్ధి చెందుతున్నది. ధనికులు 'ప్రేమ మూర్తులుగా' మోడీ హృదయాన్ని నిరంత రంగా దోచుకుంటున్నారు. 2015 జనవరిలో మోడీ ఒక ఫాన్సీ సూట్ వేసుకోవడం వివాదాస్ప దమైంది. దానిమీద అంతా మోడీ పేరు నేయబడి ఉంది. ప్రత్యర్థులు మోడీ ప్రభుత్వాన్ని సూట్ బూట్ ప్రభుత్వం అని ఎద్దేవా చేసారు.

వెంటనే దానికి ప్రతిస్పందన వచ్చింది: ఆ సూట్‌ని వేలానికి పెట్టారు. వచ్చిన మొత్తం దానధర్మాలకు, గంగానది శుభ్రపరచాడనికి వినియోగించబడుతుందని ప్రకటించారు. ఆ సూట్ ధర రూ 11,00,000 (అక్షరాలా పదకొండు లక్షలు) కానీ వేలంలో వచ్చినది రూ 4,31,31,311 అంటే నాలుగువందల రెట్లు. ఆ తరువాత తెలిసింది ఏమిటంటే ఆ సూట్ కొన్న లాల్జీభై పటేల్ గుజరాత్ వాసి. అతనికి అక్కడ గుజరాత్ ప్రభుత్వం ఒక ప్రైవేటు స్పోర్ట్స్ క్లబ్ కట్టుకోడానికి స్థలాన్ని కేటాయించింది.

లలిత్ మోడీ ఇదివరకటి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో పనిచేసేవారు. ప్రస్తుతం ఆయన లండన్‌లో ఉంటున్నారు ఆయనా, రాజస్థాన్ ముఖ్యమంత్రిగా పనిచేసిన వసుంధర రాజే సింధియా కుమారుడు దుష్యంత్ రాజే కలిసి పెద్ద మొత్తం చెల్లించి ఆ కంపెనీలో భారీగా వాటాలు కొన్నారు. మోడీ, బీజేపీ గతంలో బాహాటంగా తూర్పార పట్టిన రాబర్ట్ వాద్రా లావాదేవీల వంటివే ఈ లావాదేవీలు. డిఎల్ఎఫ్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ వాద్రాకి చెందిన భూమిని 2008 కొనింది. దానికి అధిక మొత్తంలో ధర చెల్లించింది. అందువలన వాద్రా విపరీతమైన లాభం పొందారు.

మోడీ ప్రభుత్వం, అనిల్ అంబానీ ఆధ్వ ర్యంలోని ప్రైవేటు గ్రూప్‌కి వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడంలో అనుకూలంగా వ్యవహరిం చింది. అంతర్జాతీయ ఆయుధ ఉత్పత్తి పరిశ్ర మలో అనిల్ ధీరుభాయి అంబానీ గ్రూప్ భాగస్వామి. భారతదేశ కంపెనీ భాగస్వామ్యం ఉంటేనే గానీ విదేశీ ఆయుధ తయారీ పరిశ్రమ నుంచి ఆయుధాలు కొనుగోలు చేయకూడదన్న నియమాన్ని పాటించే నెపంతో అనిల్ అంబా నీని ఆ విదేశీ ఆయుధ కంపెనీతో భాగస్వామిని చేశారు. ఆ విదేశీ పరిశ్రమే డస్సాల్ట్ ఏవియేషన్. అదే రాఫెల్ యుద్ధ విమానాలను మన ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కి సరఫరా చేసింది.

మోడీ ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని రకాల నీతి నియమాలను పక్కన పెట్టి తమ కనువైన వారికి కేటాయింపులు జరుపుతున్నారు. ప్రధానంగా టెలికాం రంగంలో, ఇంటర్నెట్ రంగంలో. రెలియాన్స్ జిఓ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో భాగస్వామి. ఇది ముఖేష్ అంబానీ కి చెందిన గ్రూప్ .

మోడీ స్వరాష్ట్రం గుజరాత్‌లో డైమండ్ వ్యాపారం చేసే మెహుల్ చోక్సీ నీరవ్ మోడీ

> **❝ క్యాబినెట్ మంత్రి పీయూష్ గోయెల్ తన కంపెనీలోని వాటాలన్నిటినీ 1000 రెట్లు అధిక మొత్తాలకు పిరమల్ గ్రూప్‌కి అమ్మేశారని ఆరోపించబడింది. ఈ విషయాన్ని వైర్ అనే పత్రిక పరిశోధనలో తేలింది. బీజేపీకి చెందిన గోయల్ మంత్రి అవక ముందే, 2014 లోనే ఆ కంపెనీ నుండి బయట పడాలనుకున్నారని చెప్పుకుంది. 2010 వరకు గోయల్ ముంబై లో ఉన్న షిర్డీ ఇండస్ట్రీస్‌కి అధినేతగా ఉన్నారు.❞**

మామ. 2018 అయనా, నీరవ్ మోడీ కంపెనీ, దేశంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంకుకి 1 బిలియన్ డాలర్ల అప్పు ఎగ్గొట్టారు. అది ఒక పెద్ద కుంభకోణం గా మారింది. లలిత్ మోడీ లాగే నిరవ్ మోడీ, చోక్సి కూడా దేశాన్ని వదిలి పారిపోయారు. ఆ ధైర్యంతో ఆ తరువాతి కాలంలో ప్రభుత్వ బ్యాంకులలో అప్పులు చేసి దేశాన్ని వదిలి పారిపోవడం చాలామందికి అలవాటుగా మారింది. ఆ నేరాలన్నీ భారతదేశ చట్టాలకు ఆవల ఉండడం వలన తప్పించు కునేందుకు విదేశాలలో ఆశ్రయం పొందుతున్నారు. 2018 మార్చిలో మోడీ ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టంలో ఫ్యుగిటివ్ ఎకనమిక్ అఫెండర్స్ యాక్ట్ (ఆశ్రయం పొందిన ఆర్థిక నేరగాళ్ల చట్టం) చేశారు. దాని ప్రకారం ఆర్థిక నేరం చేసిన వారికి భారతదేశంలో ఉన్న ఆస్తులను జప్తు చేసుకోవచ్చు.

వెనక్కి తిరిగి చూసుకుంటే, మోడీ ప్రభుత్వం అవినీతిని నివారించడంలో విఫలమవడమే కాదు, స్పందించలేదు. దానికి సంబంధించిన చట్టాల అమలులోకూడా విపరీతమైన జాప్యం చేసింది అని తెలుస్తున్నది. 2016 మార్చ్‌లో సారా దిగ్గజం విజయ్ మల్యా అప్పు వసూలు చేసుకోడానికి భారతదేశ బ్యాంకులు డెబ్ట్ రికవరీ ట్రిబ్యునల్‌కి వెళ్లేముందు భారతదేశాన్ని విడిచి వెళ్లిపోయారు. అతని కంపెనీలు చెల్లించాల్సిన మొత్తం రూ 9,000 కోట్లు. మాల్యా ఈ అప్పులన్నీ యుపిఏ ప్రభుత్వం ఉండగా పొందింది. కానీ పారిపోయింది మాత్రం మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత. మాల్యాని వెనక్కి రప్పించే ప్రయత్నాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి.

మోడీ పాలనలో ఆర్థిక నేరాలు వరుసగా ఒకదాని తర్వాత ఒకటి జరుగుతూనే ఉన్నాయి. దేశంలోనే అతిపెద్ద ప్రైవేటు రంగ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసారు చందా కొచర్,. ఆమెకు ఆ బ్యాంకు వీడియోకాన్ గ్రూప్ కి అప్పు ఇచ్చిన సంగతి తెలిసే ఉంటుంది. ఆ కంపెనీ ప్రమోటర్ వేణు గోపాల దూత్ కొచర్ భర్తతోనూ, సంబంధీకులతోనూ కొన్ని లాలూచి ఒప్పందాలు చేసుకున్నారు. ఈ విషయంలో ఆమె తన అధికారాన్ని దుర్వినియోగ పరిచారన్నది ఆరోపణ. అంతర్గతంగా, బయట కూడా చట్టాలు అమలుచేసే సంస్థలు నేరస్తులను పట్టుకునే పనిలో ఉన్నాయి.

క్యాబినెట్ మంత్రి పీయూష్ గోయెల్ తన కంపెనీలోని వాటాలన్నిటినీ 1000 రెట్లు అధిక మొత్తాలకు పిరమల్ గ్రూప్‌కి అమ్మేశారని ఆరోపించబడింది. ఈ విషయాన్ని వైర్ అనే పత్రిక పరిశోధనలో తేలింది. బీజేపీకి చెందిన గోయల్ మంత్రి అవక ముందే, 2014 లోనే ఆ కంపెనీ నుండి బయట పడాలనుకున్నారని చెప్పుకుంది. 2010 వరకు గోయల్ ముంబై లో ఉన్న షిర్డీ ఇండస్ట్రీస్‌కి అధినేతగా ఉన్నారు. అది ఎనిమిది ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ 650/– కోట్ల అప్పులు బకాయిలు ఉంది.

ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రుప్ట్ కోడ్ పెద్ద పెద్ద కంపెనీల సమూహాలు పెద్ద మొత్తాలలో రుణాలు ఎగగొట్టడం సులభతరం చేసింది. ఆ అప్పులన్నీ ప్రభుత్వరంగ బ్యాంకుల నుండి పొందినవే. ఈ మధ్య కాలంలో నేషనల్ కంపెనీ ట్రిబ్యునల్, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ పనిచేసే తీరు చూస్తే ఎన్నిరకాల అవినీతి కార్యక్రమాలు జరిగాయో తెలుస్తుంది. ఇష్టమైన వారికి ఇష్టమైనట్టు అభిమానం చూపడం వలన వారు తీసుకున్న అప్పులు తీర్చని పరిస్థితి కనపడుతోంది. నిర్ణయాలు తీసుకునే ముందు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం కనిపిస్తున్నది. కోడ్‌లో సూచించిన విధంగా తగు జాగ్రత్తలు తీసుకోబడడం లేదు.

అవినీతి నిర్మూలించడానికి తగిన చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నప్పటికీ, మోడీ ప్రభుత్వం, పరిపాలన పరమైన చర్యలకు పరిమితమవుతుంది. కేవలం అవినీతి ఆన వాళ్లను మాత్రం చెరపాలను కుంటున్నది. దాని మూలలకు వెళ్లే ప్రయత్నం చేయడం లేదు. అవినీతికి సంబంధించిన చట్టాలు పటిష్టపరచడం లేదు. చట్ట వ్యతిరేక, నిజాయితీ లోపించిన కార్యకలాపాలు నిలువరించే అవకాశాలను ఉపయోగించుకోవడం లేదు. అతని ప్రభుత్వం భారతదేశంలో మొదలు కంటా అవినీతిని తుడిచేయగల ఎన్నో చట్టాలను నీరు కార్చేసింది.

మోడీ పదేళ్ల పాలనలో చిన్న స్థాయిలలో అవినీతి ఏ మాత్రం తగ్గలేదు. పెద్ద స్థాయిలో అవినీతి పెరుగుతున్నది. ఆదాయం, సంపదలలో అసమానతలు పెరుగుతున్నాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు మూతపడుతున్నాయి. మరోవైపు అంబానీకి చెందిన కులీనుల పరిశ్రమలు పెరుగుతున్నాయి, కార్పొరేట్ లు విస్తరిస్తున్నాయి. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు చోద్యం చూస్తున్నది. చిన్న పరిశ్రమలకు అండగా ఉండే చర్యలు తీసుకో వడంలో, విధాన రూపకల్పనలో తీవ్రంగా విఫలమయింది. పూర్తిగా పక్షపాత బుద్ధితో వ్యవహరిస్తున్నది.

2016లో నోట్ల రద్దు అయిన తర్వాత మోడీకి అత్యంత సన్నిహితుడు అమిత్ షా కి చెందిన కంపెనీ సహకార బ్యాంకుల నుంచి పెద్ద మొత్తాలలో సొమ్ము అందుకున్నాయి. షా కొడుకు వాటా పెరుగుతుండడం కనిపిస్తుంది. ఇవి రెండూ ఆశ్రిత పక్షపాతాన్ని తెలియచేస్తాయి. బీజేపీ చెబుతున్నట్లు అది వ్యవస్థను అవినీతి లేకుండా శుభ్రం చేయడం కాదు. ఎన్నికల బండ్ల నుండి బీజేపీ అత్యధికంగా లాభం పొందిన విషయం నిజమని తేలిపోయింది

ప్రపంచవ్యాప్తంగా పాలక మితవాద మద్దతు దారులు జాతి, సంస్కృతుల 'స్వచ్ఛత' గురించి 'ఔన్నత్యం' గురించి అనేక కథలు ప్రచారంలో పెట్టారు. హిందూ– భారతీయ సమాజం అవినీతికి గురయ్యింది విదేశీయుల (ముస్లింలు,క్రిస్టియన్లు) రాకతోనే అని మొదట ప్రచారం చేసే ప్రయత్నం చేశారు. ఆ తరువాత ఒక కుటుంబం నీడలో నడిచే కాంగ్రెస్ అని అంటున్నారు. ఈ వాదనలు అన్నీ ఎన్నికల బాండ్లు వివరాలు ప్రకటించబడే వరకు సాగుతూనే ఉంటాయి. కానీ ఇప్పుడు మోడీని గానీ, ఆయన అనుయాయులను గానీ నమ్మే పరిస్థితి లేదు.

**(అనువాదం: కె. ఉషారాణి)**

చరిత్ర

# హర్ష సామ్రాజ్యం

**ఎంవిఎస్ శర్మ**



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకుడు

ఉత్తరప్రదేశ్, బీహార్ ప్రాంతాలమీద ప్రత్యక్షంగా తమ పాలనను నడిపిన గుప్తుల సామ్రాజ్యం దాదాపు 160 ఏళ్ళ తర్వాత క్షీణించింది. క్రీ.శ.6వ శతాబ్దం నడిమిలో శ్వేత హూణులు ఉత్తర వాయవ్య దిక్కు నుండి వచ్చి కాశ్మీర్, పంజాబ్, పశ్చిమ భారతం ప్రాంతం మీద తమ ఆధిపత్యాన్ని నెలకొల్పగలిగారు. ఇది క్రీ.శ.500 నాటికి సాధ్యపడింది. స్కందగుప్తుడి పాలనా కాలంలో ఈ హూణుల దాడులను విజయవంతంగా ఎదుర్కొన్నప్పటికీ, ఎక్కువ కాలంపాటు గుప్త సామ్రాజ్యాన్ని కాపాడుకోలేక పోయారు. క్రమంగా ఉత్తర, పశ్చిమ భారతం లోని గుప్త సామ్రాజ్య భూభాగాలు అంతవరకూ సామంతులుగా వ్యవహరించిన స్థానిక పాలకుల చేతుల్లోకి పోయాయి. అటువంటి సామంతులలో థానేసర్ (హర్యానా) కేంద్రంగా పాలించిన హర్ష వర్ధనుడు ఒకడు. ఇతడి కాలంలో తక్కిన సామంతులందరినీ లొంగదీసుకుని తన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. క్రీ.శ. 606 నుండి 647 వరకూ హర్షవర్ధనుడు పాలించాడు.

హర్షుడు కనూజ్ (కన్యాకుబ్జం) కేంద్రంగా చేసుకుని తన సార్వభౌమాధికారాన్ని అన్ని వైపులా విస్తరించడం ప్రారంభించాడు. అప్పటికి ఉత్తర భారతంలో ఒక ప్రధాన కేంద్రంగా ఉండిన పాటలీపుత్రం (పాట్నా) తన ప్రాభవాన్ని కోల్పోసాగింది. వాణిజ్యం, వ్యాపారం ప్రధాన కార్యకలాపాలుగా ఉండిన పాటలీపుత్రానికి నాలుగు దిక్కుల నుండీ వచ్చే వ్యాపారులు చెల్లించే వివిధ సుంకాలు ప్రధాన ఆదాయంగా ఉండేది. ఐతే, ఒకసారి వాణిజ్యం బలహీన పడిన తర్వాత ఆ ఆదాయం తగ్గిపోయింది. దానికి తోడు భూదానాలు ఎక్కువగా అమలులోకి రావడంతో విస్తారమైన భూభాగాలమీద అదుపు కలిగివుండడమే వ్యూహాత్మకంగా ప్రథమ ప్రాధాన్యతను సంతరించుకుంది. స్కందావారాలు (సైనిక పటాలాలు మోహరించివుండే శిబిరాలు) అధికారానికి ప్రధాన కేంద్రాలు అయ్యాయి. అటువంటి ఒక విస్తార భూభాగాన్ని తన పర్యవేక్షణ లో ఉంచుకున్న కేంద్రం కనూజ్. పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోని ప్రస్తుత ఫరుక్కాబాద్ జిల్లాలో ఈ కనూజ్ ఉంది. హర్షుడు ఈ కేంద్రం మీద ఆధిపత్యాన్ని సాధించడంతో అది ప్రధాన రాజకీయ అధికార కేంద్రంగా రూపొందింది. గంగ. యమున నదుల మధ్య ఉన్న సారవంతమైన మైదాన ప్రాంతం ఇది. అందులో ఎత్తుగా ఉన్న భూభాగంలో కనూజ్ ఉండడంతో దాని చుట్టూ పటిష్టంగా అగడ్తలను నిర్మించడం తేలికైంది. అటు తూర్పు దిశగా గానీ, ఇటు పశ్చిమ దిశగా గానీ సైన్యాలను తక్కువకాలంలోనే భూ మార్గాల ద్వారా గానీ, నదీ మార్గాల ద్వారా గానీ కదిలించి మోహరించ డానికి అనువుగా ఉండింది. పూర్తి స్థాయిలో భూస్వామ్య సమాజం హర్షుడి రాజ్యంలో ఏర్పడిందని చరిత్రకారులు పరిగణిస్తారు.

హర్షుడి ఆస్థానంలో కవిగా ఉన్న బాణుడు హర్షచరిత అనే గ్రంధాన్ని రచించాడు. అది ఆ కాలపు చరిత్రను నిర్ధారించడానికి తోడ్పడింది. దానితోబాటు ఆ కాలంలో భారత దేశానికి వచ్చి 15 సంవత్సరాలపాటు ఇక్కడ ఉండి బౌద్ధ గ్రంధాలను అధ్యయనం చేయడమే గాక తన అనుభవాలను కూడా గ్రంథస్థం చేసిన హువాన్ త్సాంగ్ రచన కూడా ఒక ఆధారం. దానితోబాటు హర్షుడి కాలంలో జారీ చేసిన వివిధ శాసనాలు ఆ కాలంలో అమలులో ఉండిన రకరకాల పన్నుల గురించి, అధికారుల హోదాలు, విధుల గురించి తెలియజేస్తాయి.

హర్షుడిని ఆఖరి హిందూ చక్రవర్తిగా కొందరు వర్ణిస్తారు. అది వాస్తవం కాదు. హర్షుడు హిందూ మతానికి బలంగా కట్టుబడిన వాడూ కాదు. అతడు పాలించిన భూభాగం కూడా భారతదేశంలో ఒక చిన్న భాగం మాత్రమే. రాజస్తాన్. పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా ప్రాంతాలకు అతడి సామ్రాజ్యం పరిమితం. ఐతే అతడి ప్రభావం మరింత ఎక్కువ భూభాగం వరకూ విస్తరించివుండవచ్చు. అతడి రాజ్యానికి సరిహద్దులో ఉన్న రాజ్యాలు అతడి సార్వభౌమత్వాన్ని ఆమోదించివుండవచ్చు. కాని వ్యతిరేకించినవారు కూడా ఉన్నారు. తూర్పు భారతంలో శశాంకుడనే గౌడదేశపు రాజు శైవమతాన్ని అనుసరించినవాడు. హర్షుడి అధికారాన్ని సవాలు చేశాడు. బుద్ధగయ వరకూ వచ్చి అక్కడ బోధివృక్షాన్ని నరికివేసి హర్షుడి అధికారాన్ని సవాలు చేశాడు. క్రీ.శ.619లో శశాంకుడి మరణం అనంతరం ఆ వైరం ముగిసింది. అదేవిధంగా దక్షిణాపథాన తన సామ్రాజ్య విస్తరణ కోసం హర్షుడు ప్రయత్నించినప్పుడు నర్మదా నదీ తీరం వద్దనే చాళుక్య రాజు పులికేశి అడ్డుకుని తిప్పికొట్టాడు.

**రాజ్య నిర్వహణ**

గుప్తుల పాలనా పద్ధతిలోనే హర్షుడి పాలన కూడా కొనసాగింది. ఐతే గుప్తుల నాటికన్నా మరింత భూస్వామ్య లక్షణాలను సంతరించుకుంది. అధికార వికేంద్రీకరణ కూడా పెరిగింది. హర్షుడి వద్ద ఒక లక్ష మంది సైన్యం, 9,000 గజదళం ఉన్నట్టు చెప్తారు. ఇది ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎందుకంటే దిగువ దక్షిణ భారతాన్ని మినహా తక్కిన భారత ఉపఖండాన్ని యావత్తూ పాలించిన అశోకుడి వద్దే 30,000 మంది సైన్యం, 6,000 గజదళం ఉండేది. దానితో పోల్చితే చాలా చిన్న భూభాగం మీద మాత్రమే అధికారం కలిగివున్న హర్షుడు ఇంత పెద్ద సైన్యాన్ని ఏ విధంగా నిర్వహించ గలిగాడు? అన్న సందేహం రాకమానదు. యుద్ధ సమయాల్లో తన సామంతుల వద్ద నుండే సైన్యాన్ని సైతం మోహరించివుండాలి. ఆ సామంతులు కాల్బలాలు, గజ, ఆశ్విక దళాల రూపేణా అందించిన తోడ్పాటుతోనే అంత భారీ సైన్యాన్ని హర్షుడు సమకూర్చుకున్నాడు.

రాజ్యానికి ప్రత్యేక సేవలు అందించినందుకు పురోహితులకు భూములను దానంగా ఇచ్చే ఆనవాయితీ కొనసాగింది. దానికి తోడు హర్షుడు కొందరు రాజాధికారులకు కూడా భూములను దానంగా ఇచ్చినట్టు రాజశాసనాలు సూచిస్తున్నాయి. అంతకు ముందరి కాలంలో మాదిరిగానే పురోహితులకు ఇచ్చిన భూముల నుండి శిస్తువసూలు మినహాయించడం కొనసాగింది. హువాన్‌త్సాంగ్ కథనాల ప్రకారం హర్షుడి ఆదాయం నాలుగు భాగాలుగా విభజించడం జరిగింది. ఒక భాగం మహారాజు ఖర్చులకు, మరొక భాగం పండితులకు, మూడో భాగం అధికారులకు, ప్రభుత్వోద్యోగులకు, నాలుగవ భాగం మతసంబంధిత కార్యకలాపాలకు కేటాయించారు. మంత్రులకు, ఉన్నతాధికారులకు కూడా భూములనే కేటాయించారు. విశ్వాసపాత్రులైన. సమర్థులైన రాజాధికారు లకు వేతనాలకు బదులు భూదానాలిచ్చే భూస్వామ్య సాంప్రదాయం హర్షుడి కాలంతోనే మొదలైందని చెప్పవచ్చు. అందకే హర్షుడి పాలనా కాలంలో ఎక్కువగా నాణేల విడుదల, పంపిణీ జరగలేదు. నగదు పాత్ర పరిమితం చేయబడింది.

> **❝ హువాన్ త్సాంగ్ రాతల ప్రకారం బౌద్ధు లు 18 శాఖలుగా అప్పటికి చీలిపోయారు. గతంలో ప్రసిద్ధి కెక్కిన బౌద్ధ కేంద్రాలు తమ ప్రాభవాన్ని కోల్పోయాయి. బౌద్ధ సన్యాసుల శిక్షణ కోసం నలందలో బౌద్ధ విశ్వవిద్యాలయం నడిచింది. అందులో 10,000 మంది వరకూ విద్యార్థులు ఉండేవారని హువాన్ త్సాంగ్ రాశాడు. వారంతా బౌద్ధ సన్యాసులే. మహాయాన బౌద్ధంలో వారికి శిక్షణ గరిపేవారు. ❞**

హర్షుడి రాజ్యంలో నేరాలకు కఠినశిక్షలు ఉండేవి. దొంగతనం చేసినవాడి చెయ్యి నరికే శిక్ష అమలు జరిగింది. ఐతే దొంగతనాలు మాత్రం తరచూ జరుగుతూవుండేవని హువాన్ త్సాంగ్ తన అనుభవాలలో రాసుకున్నాడు. ఐతే తర్వాత కాలంలో హర్షుడిపై బౌద్ధమత ప్రభావం ఎక్కువగా పడినందున శిక్షలలోని క్రూరత్వాన్ని తగ్గించి నేరస్తులను ఖైదు చేసేవారు.

హువాన్ త్సాంగ్ చైనా నుండి క్రీశ.629లో వచ్చి తిరిగి క్రీ.శ.645లో చైనాకు మరలిపోయాడు. నలందలో ఉన్న విశ్వవిద్యాలయంలో బౌద్ధాన్ని అధ్యయనం చేయడానికి అతడు ఇక్కడికి వచ్చాడు. తిరిగిపోయేటప్పుడు బౌద్ధ సారస్వతాన్ని తనవెంట తీసుకునిపోయాడు. ఇక్కడ ఉన్నకాలంలో ఎక్కువ సంవత్సరాలు హర్షుడి ఆస్థానంలో ఉన్నాడు. ఇతడి ప్రభావంతోనే హర్షుడు బౌద్ధం వైపు ఆకర్షితుడయాడని, అనేక బౌద్ధ కేంద్రాలకు దానాలు విరివిగా ఇచ్చాడని అంటారు. హువాన్ త్సాంగ్ గ్రంథస్తం చేసిన అనుభవాలు ఆ కాలపు ఆర్థిక, సామాజిక జీవితం గురించీ, ఆనాటికి దేశంలో ఉన్న రకరకాల మత శాఖల గురించీ తెలియజేస్తాయి.

హర్షుడి కాలం నాటికి పాటలీపుత్రం, వైశాలి వంటి పాత నగరాలు పతనం కావడం మొదలైంది. అదే సమయంలో నదీ పరీవాహక ప్రదేశం నడుమ ఉన్న ప్రయాగ, కనూజ్ వంటివి ప్రధాన పట్టణాలుగా అభివృద్ధి చెందసాగాయి. సాధారణ బ్రాహ్మణులు, క్షత్రియులు సాధారణ జీవితాన్నే గడుపుతూ వుండేవారని, అదే సమయంలో రాజ బంధు వులు, పురోహితులు చాలా విలాసవంతంగా జీవిస్తూవుండేవారని హువాన్ త్సాంగ్ తెలిపా డు. దీనిని బట్టి అగ్ర కులాలు రెండింటిలోనూ ఎగువ, దిగువ దొంతరలు ఏర్పడడం మొదలైనట్టు భావించాలి. ఈ రెండు కులాల్లోని మెజారిటీ ప్రజలు వ్యవసాయాన్నే తమ వృత్తిగా చేపట్టారు. హువాన్ త్సాంగ్ శూద్రులను వ్యవసాయదారులుగా అభివర్ణించాడు. ఇది ప్రధానంగా గమనించాల్సిన అంశం. అంత వరకూ లభించిన ఆధారాలలో శూద్రులను తక్కిన మూడు కులాలవారికీ పేవ చేసే వారిగా మాత్రమే వర్ణించారు. అదే సమయంలో హువాన్‌త్సాంగ్ ఆ నాటి సమాజంలో పాకీ పని చేసేవారు, తలారి పని చేసేవారు అంటరానివారిగా పరిగణింపబడేవారని రాశాడు. అంటరానివారు ఊళ్ళకు దూరంగా జీవించే వారని, ఉల్లి, వెల్లుల్లి వంటివి ఆహారం లోకి తీసుకునేవారని అతడు పేర్కొన్నాడు. వారు ఊళ్ళోకి ప్రవేశించవలసివస్తే గట్టిగా అరుస్తూ తమ రాకను తెలియజేసేవారు. అప్పుడు తక్కిన కులాలవారు వారికి దూరంగా పోయేవారు.

హువాన్ త్సాంగ్ రాతల ప్రకారం బౌద్ధులు 18 శాఖలుగా అప్పటికి చీలిపోయారు. గతంలో ప్రసిద్ధి కెక్కిన బౌద్ధ కేంద్రాలు తమ ప్రాభవాన్ని కోల్పోయాయి. బౌద్ధ సన్యాసుల శిక్షణ కోసం నలందలో బౌద్ధ విశ్వవిద్యాలయం నడిచింది. అందులో 10,000 మంది వరకూ విద్యార్థులు ఉండేవారని హువాన్ త్సాంగ్ రాశాడు. వారంతా బౌద్ధ సన్యాసులే. మహాయాన బౌద్ధంలో వారికి శిక్షణ గరిపేవారు. ఐతే నలంద లోని శిథిలాలను తవ్వకాలలో కనుగొన్నప్పుడు ఆ ప్రాంతంలో చాలా భవనాలు ఉండేవని నిర్ధారణ అయింది. కాని వాటన్నింటినీ కలుపుకున్నా అక్కడ 10,000 మంది ఉండడానికి అవకాశం లేదు. క్రీశ 670లో ఆ ప్రాంతాన్ని పర్యటించిన మరొక చైనా యాత్రికుడు ఐ-జింగ్ కథనం ప్రకారం అక్కడ 3,000 మంది వరకూ విద్యార్థులు ఉండేవారు. ఇది వాస్తవానికి దగ్గరగా ఉందని చెప్పాలి. నలంద విశ్వవిద్యాలయాన్ని నిర్వహించడానికి అవసరమైన ఆర్థిక వనరుల కోసం చుట్టుపక్కల ఉండే 100 రెవెన్యూ గ్రామాల ఆదాయాన్ని కేటాయించారని హువాన్ త్సాంగ్ పేర్కొన్నాడు. ఐ-జింగ్ కథనం ప్రకారం అవి 200 రెవెన్యూ గ్రామాలు.

తన పాలన తొలి రోజుల్లో హర్షుడు అన్ని మతాల పట్ల సమరస భావనను ప్రదర్శిం చాడు. ఐతే క్రమంగా బౌద్ధం వైపు ఎక్కువ మొగ్గు చూపాడు. మహాయాన బౌద్ధాన్ని విస్తృతంగా ప్రచారంలో పెట్టడానికి కనూజ్‌లో ఒక మహా కూటమిని నిర్వహించాడు. అక్కడికి 20 దేశాలనుండి ప్రతినిధులు వచ్చారు. ఈశాన్య ప్రాంతంలోని కామరూప నుండి కూడా వచ్చారు. ఒక్కో తాటి పందిరిలోనూ 1000 మందికి వసతి ఏర్పాటు చేశారు. అటువంటి రెండు పందిళ్ళు నిర్మించారు. మధ్యలో ఒక ఎత్తైన పీఠం మీద నిలువెత్తు బౌద్ధ విగ్రహాన్ని బంగారంతో నిర్మించి ప్రతిష్టించారు. దానికి హర్షుడు పూజలు చేశాడు. ఆ కూటమిలో జరిగిన చర్చలను హువాన్ త్సాంగ్ ప్రవేశపెట్టాడు. తాను ప్రతిపాదించిన మహాయాన బౌద్ధ సూత్రాలను ఎవరైనా సరే ముందుకొచ్చి సవాలు చేయాలని పిలుపునిచ్చాడు. 5 రోజులపాటు ఎవరూ ముందుకు రాలేదు. కాని కొందరు శత్రువులు హువాన్ త్సాంగ్‌ను రహస్యంగా మట్టపెట్ట డానికి కుట్ర పన్నారు. అప్పుడు హర్షుడు హువాన్ త్సాంగ్‌కు ఎవరు హాని తలపెట్టినా వాళ్ళ తలలు తీయిస్తానని హెచ్చరించాడు. ఆ సరికి ఉన్నట్టుండి ఆ ప్రాంతంలో పెద్ద అగ్నిప్రమాదం సంభవించింది. అప్పుడు హర్షుడు అక్కడున్న బ్రాహ్మణులలో 500 మందిని నిర్బంధంలోకి తీసుకున్నాడు. వారిలో కొందరి తలలు తీయించాడు. ఈ గాథను బట్టి హర్షుడు అనుకున్నంత సహనశీలి కాదు అని స్పష్టం ఔతోంది. ఈ సంఘటన అనంతరం, హర్షుడు ఇటువంటి మహా కూటమినే మరొకదానిని ప్రయాగలో నిర్వహించాడు. ఆ తర్వాత అతడివద్ద ఉన్న దుస్తులు తప్ప తక్కిన సంపదనంతటినీ దానంగా ఇచ్చివేశాడు. హువన్ త్సాంగ్ హర్షుడిని వేనోళ్ళ కీర్తిస్తూ రాశాడు.

ఇక బాణుడు కూడా హర్షుడి తొలి కాలపు పాలనను కీర్తిస్తూ రాశాడు. కవిపండితులను హర్షుడు ఆదరించే తీరును, అతడి దయా గుణాన్ని కీర్తించాడు. అంతే కాక, ప్రియదర్శిక, రత్నావళి, నాగానంద అనే గ్రంధాలను హర్షుడు రచించాడని కూడా బాణుడు పేర్కొన్నాడు. ఐతే ఈ రచనలను దావకుడు అనే వేరే కవి రచించాడని, ఆ కావ్యాలకు హర్షుడి పేరు పెట్టివుండొొచ్చని చరిత్రకారులు భావిస్తున్నారు. ఆ మధ్య యుగాలలో పాలించిన ప్రభువును గొప్పగా చిత్రించడానికి ఆ కాలంలో ఎవరు ఏ గొప్ప సృజన చేసినా దానిని ఆ ప్రభువే చేసినట్టు ప్రచారం చేసే ఆనవాయితీ ఉండేది. సముద్రగుప్తుడి కాలంలో మొదలైన ఈ ఆనవాయితీ హర్షుడు రాజ్యంలో కూడా కొనసాగింది.

(తదుపరి వచ్చే సంచికలో)

అంతర్జాతీయం

# బ్రిటన్‌లో ఆకలి కేకలు




**అరవింద్ శివరామకృష్ణన్**

బ్రిటన్ ప్రపంచంలోని అత్యంత ధనిక దేశాల్లో ఒకటి కావచ్చుగాక కానీ ఆ దేశంలోని 25 లక్షల మంది ప్రజలు అన్నదానం మీద ఆధారపడి బ్రతుకుతున్నారు. ఆ దేశంలోని సంక్షోభాల్లో ఇదొకటి మాత్రమే....

ఈ రోజున బ్రిటన్ దరిద్రులకు నిలయంగా మారిపోయింది. అన్నదాన కేంద్రాలు (ఫుడ్ బ్యాంకులు) లేకుంటే అక్కడ ఆకలి చావులు సంభవించేవి. బ్రిటన్‌లో ఈనాడు 1 కోటి 13 లక్షల మంది ప్రజలు, అంటే జనాభాలో 14 శాతం మంది ఆహార అభద్రతా స్థితిలో జీవిస్తున్నారు. అంటే తినడానికి సరిపడా ఆహారం, సరైన ఆహారం లేక బాధపడుతున్నారు.

నేడు బ్రిటన్‌లో 25 లక్షల మంది ప్రజలు ఏదో ఒక రూపంలో అన్నదాన కేంద్రాలపై ఆధారపడి జీవిస్తున్నారని ఆ దేశ పార్లమెంటు చర్చల సందర్భంగా చెప్పారు. ఈ అన్నదాన కేంద్రాలు కూడా ప్రభుత్వం నడుపుతున్నవి కావు. ప్రజలు డబ్బు రూపంలోనూ, వస్తు రూపంలోనూ అందిస్తున్న విరాళాలపై ఆధారపడి నడుస్తున్నాయి. బ్రిటన్‌లోని చాలా సూపర్ మార్కెట్లు, మాములు వీధి షాపుల్లో కూడా మిగిలిపోయిన, లేదా విరాళాలుగా వచ్చిన ఆహారాన్ని, ఇతర నిత్యావసరాలను సేకరించే బాక్సులు ఉంటాయి. చర్చిలు, ఇతర ప్రార్థనా మందిరాల వద్ద కూడా ఇటువంటివి ఉంటాయి.

ట్రస్సెల్ ట్రస్ట్ అనేది ఈరోజు బ్రిటన్‌లో ఆహార పదార్థాల దానానికి మారుపేరుగా మారిపోయింది. ఇది అనేక చోట్ల అన్నదాన కేంద్రాలు నిర్వహిస్తుంది. 2023లో అది బ్రిటన్‌లో ఆకలి కేకలు అన్న ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక బ్రిటన్‌లోని దయనీయమైన పరిస్థితిని కళ్లకు కడుతుంది.

అన్నదాన కేంద్రాలను ఉపయోగించుకునే వారిలో పిల్లలు గల తల్లిదండ్రులు ఎక్కువగా ఉన్నారని నివేదిక తెలుపుతోంది. వారిలో కూడా నల్లజాతి పౌరులు ఎక్కువగా ఉంటున్నారు. ఇళ్లు లేనివారు, అద్దె ఇళ్లలో ఉంటున్న వారు అన్నదాన కేంద్రాలకు వచ్చి ఆహార పదార్థాలనూ, ఇతర నిత్యావసర వస్తువులనూ తీసుకు వెళుతుంటారు. చివరికి స్థిరమైన ఉద్యోగాలున్న నర్సులు, పోలీసులు వంటి వారకు కూడా అన్నదాన కేంద్రాలకు వస్తున్నారని నివేదిక ఆశ్చర్యకరమైన విషయాలు తెలిపింది.

డాక్టర్లుగానీ, కొన్ని స్వచ్ఛంద సంస్థలుగానీ, లేక ఇతర దాతృత్వ సంస్థలుగానీ సిఫార్సు చేసిన వారికి మాత్రమే ఈ అన్నదాన కేంద్రాల్లో భోజనం పెడతారు. ఉపాధి కేంద్రాలు, ప్రజలు ఉపాధికోసం రిజిస్టరు చేసుకున్న నిరుద్యోగ కేంద్రాలు కూడా వారిని సిఫార్సు చేయవచ్చు. సరిపడా వేతనాలు రాని వారిని కూడా సిఫార్సు చేయవచ్చు. అయితే ఉపాధి కేంద్రాల వద్ద నిరుద్యోగులు అన్నదాన కేంద్రాలనుండి సదుపాయాలు పొందేందుకు అవసరమైన వివరాలు ఇవ్వకూడదని ఈ కేంద్రాలకు చెందిన ఉద్యోగులకు ప్రభుత్వం ఒక ఉత్తర్వు ఇవ్వడం ద్వారా తన క్రూరత్వాన్ని చాటుకుంది. అమ్మ పెట్టనూ పెట్టదు, అడుక్కు తిననివ్వదు అన్నట్లున్న ప్రభుత్వ ఉత్తర్వులు సర్వత్రా విమర్శలకు గురయ్యాయి. ఇద్దరు పిల్లల కన్నా ఎక్కువ మంది ఉన్నవారికి అన్నదాన కేంద్రాల వద్ద సదుపాయాలు కల్పించకూడదని బ్రిటన్‌లోని మితవాద టోరీ ప్రభుత్వం 2017లో ఒక ఉత్తర్వు ఇచ్చింది. ప్రతిపక్ష లేబర్ పార్టీ కూడా దానికి వంతపాడింది. తాము అధికారంలోకి వస్తే ఈ ఉత్తర్వును కొనసాగిస్తామని ప్రకటించింది.

**పాఠశాలపై పచ్చి నిర్లక్ష్యం**

దీని కన్నా దారుణం ఏమంటే, ఇంగ్లండ్‌లోని కడు పేద ప్రాంతాల్లోని పాఠశాల పిల్లలకు ఉచిత ఫలహారాలు అందజేస్తున్నాయి. ఈ ఖర్చులను కొందరు ఉపాధ్యాయులే భరిస్తుంటారు. పేద పిల్లల బట్టలను వాషింగ్ మెషిన్‌లలో వేయడం, కొంతమంది పిల్లలకు స్నానాలుకూడా చేయిస్తుంటారు. ఈ పేద పిల్లలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఉపాధ్యాయులు చెప్పినట్లు గార్డియన్ పత్రిక రాసింది. కొంతమంది పిల్లలు పాఠశాల బయట స్థానిక సూపర్ మార్కెట్ల వద్ద ముష్టి అడుక్కుంటున్నారని కూడా వారు తెలిపారు. వీరి ఇళ్లుకూడా భయంకరంగా ఉంటున్నాయి. చిన్న చిన్న గదులు, రూమ్ హీటర్లుండవు, కిటికీలు పగిలిపోయి ఉంటాయి, ఒకే మంచం మీద ఇద్దరు ముగ్గురు పిల్లలతో తల్లులు నిద్రపోతుంటారు. ఎలుకల ద్వారా వారికి అనేక రకాల వ్యాధులు సోకుతుంటాయి. ఇంట్లో చలికి నిద్రపట్టక కొందరు పిల్లలు పాఠశాలల్లో నిద్రపోతుంటారు. (స్కాట్‌లాండ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు పిల్లలందరికీ ఉచిత భోజనం పెడతారు. ఆ తరువాత తరగుతుల వారికి వారివారి ఆర్థిక స్తోమత ఇతర పరిస్థితులను బట్టి ఉచిత భోజనం అందిస్తారు.)

పసిప్రాయంలో పౌష్టికాహార లోపానికి గురయ్యే పిల్లలకు పెద్దయినాక మధుమేహం, గుండె జబ్బులు వచ్చే అవకాశాలు మెండు. కొవ్వు, పంచదార అధికంగా గల చౌకబారు ఆహారాన్ని తినడం వల్ల ఇటువంటి వారికి మందబుద్ధి వస్తుంది, శారీరక ఎదుగుదల ఉండదు. (ఈ విషయాన్ని బ్రిటన్‌లో ఇటీవల ప్రచురించబడిన ఒక నివేదిక తెలిపింది.) కొన్ని గ్రూపుల బ్రిటిష్ ప్రజల్లో 2011 నుండి ఆయు:ప్రమాణం ఎదుగుదల లేకుండా ఉండిపోవడమో లేక తగ్గడమో జరుగుతున్నదని ఒక స్వతంత్ర ఆరోగ్య సంస్థకు చెందిన మేధో బృందం తెలిపింది. వీరిలో కూడా మహిళలు దాదాపు 10 శాతం ప్రాంతాల్లో ఉన్నారని తెలిపింది. దీనికి తోడు దేశంలో అతి ధనికులకూ, అతి పేదలకూ మధ్య ఆయు:ప్రమాణ వ్యత్యాసం విపరీతంగా పెరిగిపోతున్నది.

పాఠశాల విద్య, తదుపరి రెండు సంవత్సరాల ఉన్నత విద్య (మన దేశంలో

**(మిగతా 31వ పేజీలో)**

పార్టీ నిర్మాణం

# ప్రజా ఉద్యమాలతోనే పార్టీకి గుర్తింపు

ఎస్ వీరయ్య



రచయిత సిపిఐ(ఎం) తెలంగాణా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

మే 19న కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి జరుపుకున్నాం. సుందరయ్య మార్గమే నడవాలని, సుందరయ్య స్ఫూర్తితో పనిచేయాలని చెప్పుకున్నాం. సుందరయ్య మార్గం అంటే ఏమిటి? ఆయన స్ఫూర్తి ఏమిటి? అసలు సుందరయ్య ప్రత్యేకతలు ఏమిటి? వీటి గురించి స్పష్టత అవసరం. సుందరయ్య వర్ధంతి తంతుగా నిర్వహించుకోవల్సింది కాదు. వర్తమాన పరిస్థితులలో 'సుందరయ్య'ల అవసరం గురించి అర్థం చేసుకోవడమే కీలకం.

సరైన రాజకీయ విధానం కోసం రాజీ లేని పోరాటం చేసిన మహా నేత సుందరయ్య. అందుకనుగుణంగానే నిర్మాణ దక్షతను ప్రదర్శించారు. నిజమైన ప్రజా నాయకుడికి నిలువుటద్దమే సుందరయ్య. ఆ మహానేత జీవితంలో అన్నింటికంటే ముఖ్యమైనది సంస్కరణవాదం, రివిజనిజం మీద తిరుగులేని పోరాటం. ఆయన తొలితరం కార్మికనేత. వ్యవసాయ కార్మికసంఘం స్థాపించిన నాయకులు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి అనుక్షణం దిశానిర్దేశం చేసిన సుందరయ్య భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కార్మికవర్గ నాయకత్వ పాత్రను సరిగ్గా అంచనా వేసారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కార్మికవర్గం నుంచి తగినంత సంఘీభావం రాని బలహీనతను గుర్తించారాయన. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కార్యక్రమం రూపొందించే సమయంలోనూ, పార్టీ నిర్మాణంలో కర్తవ్యాలకు సంబంధించి కేంద్ర కమిటీ తీర్మానం తయారుచేసే సమయంలోనూ కార్మిక వర్గ నాయకత్వ పాత్రను నొక్కిచెప్పారు. ప్రజా ఉద్యమం నిర్మించే క్రమంలో ఎక్కడ కేంద్రీకరించాలో, ఎక్కడ పార్టీని నిర్మించాలో, ఏ పద్ధతిలో పనిచేయాలో స్పష్టతనిచ్చారు. 1967లో కేంద్రకమిటీ ఆమోదించిన 'పార్టీ నిర్మాణ రంగంలో కర్తవ్యాలు' అన్న తీర్మానం ఆయన నేతృత్వంలో రూపుదిద్దుకున్నదే. ఆ తీర్మానంలో ఫ్యాక్టరీ ప్రాతిపదికపైనే పార్టీని నిర్మించాలని స్పష్టంగా చెప్పారు. అంతేకాదు, పట్టణాలలో కార్మిక, విద్యార్థి రంగాలకు, గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కార్మిక, పేద రైతాంగాలకు ప్రాధాన్యతనివ్వాలని తీర్మానం చెప్పింది. కార్మిక రంగంలో కూడా కీలక, భారీ పరిశ్రమలకు ప్రథమ ప్రాధాన్యతనివ్వాలని, ఆ తర్వాత ఇతర పరిశ్రమలకు ప్రాధాన్యతనివ్వాలని కూడా చెప్పింది. ఇప్పుడు పరిశ్రమలలో, పారిశ్రామిక ప్రాంతాలలో కమ్యూనిస్టు పార్టీ స్థానమేమిటో, ట్రేడ్ యూనియన్ల పరిస్థితి ఏమిటో తెలిసిందే. వ్యవసాయ రంగంలో కృషిని కూడా లోతుగా పరిశీలించవలసిందే. వర్గ పోరాటమే సమాజ మార్పుకు చోదక శక్తి అన్నారు కారల్ మార్క్స్. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రస్తుత పరిస్థితిలో పెట్టుబడిదారులతోనూ, భూస్వాములతోనూ, ధనిక రైతాంగంతోనూ ప్రత్యక్ష ఘర్షణ ఏమేరకున్నదో సమీక్షించుకోవటం అవసరం. పారిశ్రామిక ప్రాంతాలలో యూనియన్ల సంఖ్య తగ్గటం, కాంట్రాక్టు, వలస కార్మికుల సంఖ్య గణనీయమైన స్థాయికి చేరటం దేనిని సూచిస్తున్నది? వ్యవసాయ రంగంలో భూమి కోసం, కూలి కోసం పోరాటం కన్నా ఇతర డిమాండ్లు ముందుకొస్తున్నాయి. పేదరైతులు, కౌలురైతుల సమస్యలకన్నా మధ్యతరగతి, ధనిక రైతుల సమస్యలే ప్రధాన చర్చనీయాంశం అవుతున్నాయి. జాతీయ కార్మికసంఘాల నాయకత్వంలో జరుగుతున్న దేశవ్యాపిత సమ్మెల ప్రభావాన్ని కూడా లోతుగా పరిశీలించటం అవసరం. ఒకప్పుడు యూనియన్లు లేని కంపెనీలు కూడా సమ్మె రోజున మూతపడేవి. క్రమంగా సమ్మె రోజు మూతపడినప్పటికీ ప్రత్యామ్నాయంగా మరో సెలవు దినం రోజు కార్మికులు పనిచేయటం మొదలైంది. ఇప్పుడు గణనీయమైన సంఖ్యలో వలస కార్మికులు కంపెనీ ఆవరణలోనే నివాసముంటున్నారు. బయట గేటు మూసి ఉంటుంది. లోపల పని జరుగుతూ ఉంటుంది. సమ్మెలో పాల్గొనే కార్మికుల సంఖ్య పెరుగుతున్నదని భావిస్తున్నాము. అంతిమంగా సమ్మె వల్ల నష్టపోయిన ఉత్పత్తిని బట్టే సమ్మె ప్రభావం మనకు అర్థమవుతున్నది. అసంఘటిత రంగంలో కూడా పోరాటాలలో గానీ, యూనియన్లలోగానీ పాల్గొంటున్నవారిలో ఆర్థిక వ్యవస్థను స్తంభింపజేయగలిగిన లారీ ట్రాన్స్‌పోర్టు, హమాలీ, పెద్దపెద్ద నిర్మాణ సంస్థలలో పనిచేసే కార్మికులకన్నా ఇతర రంగాల కార్మికులే ఎక్కువ.

భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కమ్యూనిస్టు కార్యకర్తలకు ప్రజలతో సంబంధాలు కూడా ఇప్పుడు చర్చనీయాంశమే. ప్రజలతో సంబంధాలను బలోపేతం చేయాలని కోల్‌కతాలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్లీనం పిలుపునిచ్చింది. ప్రజలతోనూ, పార్టీ కార్యకర్తలతోనూ సజీవ సంబంధాలు నెరపడంలో పుచ్చలపల్లి సుందరయ్య ఒక నమూనా. అడవులు, కొండల్లో రాత్రింబవళ్ళు కాలినడకన దళాలతో ప్రత్యక్ష సంబంధాలు నెరిపి దిశానిర్దేశం చేసిన నేత. ఆ ఉద్యమ పునాదులే ఆ తర్వాత సుదీర్ఘ కాలం పాటు ఎర్రజెండా వెలుగులను ప్రసరించాయి. పార్లమెంటరీ రాజకీయాలలోనూ ప్రజా ప్రతినిధులను

అందించాయి. ప్రజలతో మమేకం కావటం, గ్రామాలలో బసచేయటం, పేదల ఇండ్లలో వారు పెట్టింది తినడం కమ్యూనిస్టు కార్యకర్తలకు, నాయకులకు సహజం. కానీ ఇప్పుడు సరళీకృత ఆర్థిక విధానాల ప్రభావంతో గ్రామాలలో బసచేయటం కూడా ఒక పిలుపుగా, ఒక కార్యక్రమంగా మారింది. పారిశ్రామిక ప్రాంతాలలో 12 గంటల పనిదినం సాధారణమైంది. కమ్యూనిస్టు కార్యకర్తలు కార్మికులతో సంబంధాలు పెట్టుకోవాలంటే పారిశ్రామిక ప్రాంతానికి ఉదయం 6 గంటలకు ముందు లేదా సాయంత్రం 5 తర్వాత వెళ్ళాలి. లేదా రాత్రుళ్లు వారి నివాస ప్రాంతాలలో బసచేయాలి. కానీ వాస్తవంగా జరుగుతున్నదేమిటి? కార్మికులు కంపెనీలలో ఉన్నప్పుడు కార్యకర్తలు పనిలోకి వస్తున్నారు. పారిశ్రామిక కార్మికులతో సంబంధాలు బలహీనపడుతున్నాయి. వలస కార్మికులను సంఘటితం చేయకుండా పారిశ్రామిక రంగంలో పోరాటాలు అసాధ్యం. కానీ ప్రస్తుత ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో వలస కార్మికుల పాత్ర నామమాత్రమే.

క్షేత్రస్థాయి అధ్యయనంలో కూడా సుందరయ్య మార్గమే అనుసరణీయం. వ్యవసాయక సంబంధాలను లోతుగా అధ్యయనం చేసారు. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి సమస్య పరిష్కారానికి నిర్దిష్ట ప్రతిపాదనలు చేసారు. లోతైన పరిశీలన లేకుండా, అధ్యయనం చేయకుండా ఏ విషయంలోనూ ఆషామాషీగా మాట్లాడలేదు. దేశంలో వచ్చిన అనేక మార్పుల రీత్యా సుందరయ్య భాగస్వామిగా రూపొందిన పార్టీ కార్యక్రమాన్ని తర్వాత కాలంలో తాజాపరిచారు. ఆ తర్వాత సీపీఐ (ఎం) కేంద్రకమిటీ వ్యవసాయక సంబంధాలను లోతుగా అధ్యయనం చేసి మరో తీర్మానం చేసింది. అయినా అది మాత్రమే సరిపోదు. దేశం వైవిధ్యభరితం. ఉభయ తెలుగు రాష్ట్రాలలో కూడా అన్ని ప్రాంతాలూ ఒకే రకమైన అభివృద్ధి చెందలేదు. కమ్యూనిస్టు కార్యకర్తలు పార్టీ కార్యక్రమాన్ని, కేంద్రకమిటీ తీర్మానాలను అధ్యయనం చేయడంతో పాటు తమ పరిధిలో స్థానిక పరిస్థితులను లోతుగా అధ్యయనం చేయాలి. తాజా పరిస్థితుల మీద అంచనాకు రావాలి.

కన్నూర్‌లో జరిగిన పార్టీ అఖిలభారత మహాసభలో ఆమోదించిన రాజకీయ నిర్మాణ నివేదిక, పార్టీ నిర్మాణంలో ఎదుర్కొంటున్న అనేక బలహీనతలను ఎత్తిచూపింది. బలహీనపడుతున్న పార్టీ సభ్యత్వం చైతన్య స్థాయి, శాఖల పని విధానం, కార్యకర్తల బలహీనతలు తదితర లోపాల పట్ల హెచ్చరించింది. ఈ బలహీనతలకు కారణాలను గుర్తించింది. వాటినుంచి బయటపడాలని ఆదేశించింది. 'పార్టీ నిర్మాణ రంగంలో కర్తవ్యాలు' తీర్మానం ఈ కిందివిధంగా చెప్పింది.

**❝"ప్రజలు సాగించే తీవ్రమైన వర్గ పోరా టాలనుండే పార్టీ ఆవిర్భవిస్తుంది. ఆ పోరాటాల క్రమంలోనే పాక్షిక రాజకీయ పోరా టాల ద్వారానే అది బలపడి క్రమశిక్షణను సంతరించుకుంటుంది. ప్రజల ప్రత్యక్ష విప్ల వానుభవం ద్వారానే తన విప్లవ చైతన్యాన్ని అభివృద్ధి చేసుకుంటుంది. కార్మికవర్గ విప్లవ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీని కార్మికవర్గ ప్రజల విప్లవానుభవాలతో సంబంధం లేకుండా నిర్మించలేము." ❞**

"ప్రజలు సాగించే తీవ్రమైన వర్గ పోరాటాలనుండే పార్టీ ఆవిర్భవిస్తుంది. ఆ పోరాటాల క్రమంలోనే పాక్షిక రాజకీయ పోరాటాల ద్వారానే అది బలపడి క్రమశిక్షణను సంతరించుకుంటుంది. ప్రజల ప్రత్యక్ష విప్లవానుభవం ద్వారానే తన విప్లవ చైతన్యాన్ని అభివృద్ధి చేసుకుంటుంది. కార్మికవర్గ విప్లవ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీని కార్మికవర్గ ప్రజల విప్లవానుభవాలతో సంబంధం లేకుండా నిర్మించలేము." ఇప్పుడు పెరిగిన పార్టీ సభ్యత్వాన్ని, బలహీనపడిన ప్రజా సంబంధాలతో పోల్చినపుడు బలహీనతల పునాదిని అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. వర్గ పోరాటాలు తగ్గటం, పార్టీ సభ్యత్వం పెరగటం మధ్య వైరుధ్యం లోతుగా పరిశీలించాలి. అదే కేంద్ర కమిటీ తీర్మానంలో పార్టీ విధానానికి, నిర్మాణానికి ఉన్న సంబంధాన్ని కూడా నొక్కిచెప్పింది. "పార్టీకి ఖచ్చితమైన సైద్ధాంతిక, రాజకీయ విధానాన్ని స్థిరపర్చుకోకుండా, కనీసం జాతీయ, రాష్ట్ర స్థాయిలలో నిగ్గుదేలిన సుసంఘటితమైన మార్క్సిస్టు–లెనినిస్టు నాయకత్వ కేంద్రం లేకుండా కొన్ని లక్షలమంది గల నిజమైన గొప్ప కమ్యూనిస్టు పార్టీని నిర్మించగలగటం అనూహ్యం." కమ్యూనిస్టు పార్టీలో కేవలం ఎక్కువ సంఖ్యలో పార్టీ సభ్యత్వం ఉండటాన్ని బట్టి మాత్రమే ప్రజా పునాది పట్ల అంచనాకు రాలేమని కూడా ఆ తీర్మానం గుర్తుచేసింది. "రాజకీయంగా చైతన్యవంతులైన కార్మికవర్గంలో పార్టీకుండే గట్టి పునాది, లక్షలాది శ్రామిక వర్గంతో దానికి గల సంబంధాలు, విస్తృతమైన రాజకీయ పలుకుబడి, అన్నిటినీ మించి ఏ పిలుపుకైనా ప్రజలను సమీకరించగలిగిన శక్తి, ఇవన్నీ కమ్యూనిస్టు పార్టీ ప్రజా స్వభావాన్ని (మాస్ కేరక్టర్ ఆఫ్ ది పార్టీ) నిర్ణయించే అంశాలు. అందుకే పార్టీ సభ్యత్వం విషయంలో తగు జాగ్రత్తలు కూడా ఆ తీర్మానం చెప్పింది. "వర్గ పోరాటాలతో, ప్రజా పోరాటాలతో ముడిపెట్టే విస్తృతమైన సభ్యత్వం చేర్పింపును ఒక ఉద్యమంగా నడపాలి. అలాంటప్పుడు మాత్రమే అన్యవర్గ శక్తులు, స్వలాభపరులు పార్టీలో వెల్లువగా దూరకుండా ఆపగలము. ప్రజా ఉద్యమంలో స్తబ్దత ఉన్నప్పుడు బూర్జువా చట్టబద్ధ విషయంలో హామీ–సుస్థిరత ఉన్నట్టు కనిపిస్తున్న కాలంలో, రాజకీయ జీవితంలో పార్లమెంటరీ పోరాట పద్ధతి ఆధిపత్యం వహిస్తున్నప్పుడు పెద్దఎత్తున సభ్యులను చేర్చుకునే విషయంలో మరింత కఠినమైన, తీవ్రమైన నిబంధనలను పాటించాల్సి ఉంటుంది." పార్టీ నిర్మాణంలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను ఈ నేపధ్యంలోనే లోతుగా పరిశీలించటం అవసరం.

తగిన నాయకత్వం లేకుండా కమిటీలు ఏర్పాటు చేయవద్దని సుందరయ్య దిశానిర్దేశం చేసేవారు. నాయకత్వ స్థాయి విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. పార్టీ కేంద్రకమిటీ, కమ్యూనిస్టు పార్టీ సభ్యులంతా ఆదర్శప్రాయంగా ఉండాలని చెప్పింది.

"తన చుట్టూ ఉండేవారికి ఆదర్శప్రాయుడై పార్టీ ఎడల గౌరవాన్ని, భక్తిని పెంపొందించే విధంగా తమ జీవితాన్ని గడపాలి. పార్టీ నిర్మాణం, ప్రజా ఉద్యమాల ప్రయోజనాలకు తన ప్రయోజనాలు లోబడి ఉండేలాగా తత్ఫలితంగా ఇబ్బందులను ఎదుర్కొనేందుకు, త్యాగాలు చేసేందుకు సిద్ధపడి ఉండాలి. కమ్యూనిస్టులు ప్రత్యేక మూసలో తయారైన వారనే స్టాలిన్ సూత్రానికి తగినట్టుగా

> **“ సుదీర్ఘ కాలం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అమలులో ఉన్న దేశం మనది. ఓట్లు, సీట్లే పార్టీ బలానికి సూచికలుగా పరిగణిస్తున్న కాలమిది. గత 5 సంవత్సరాలు తెలుగు రాష్ట్రాల శాసనసభలలో కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి లేరు. క్షేత్రస్థాయిలో పార్టీ పునాది చెదిరింది. సొంత పునాది బలహీనపడింది. ఇతర బూర్జువా పార్టీలతో సర్దుబాట్లు, తగిన ఆర్థిక వనరులు లేకుండా పోటీ చేయడానికి పార్టీ శ్రేణులు వెనుకాడుతున్నారు. ”**

ప్రవర్తించేందుకు సదా ప్రయత్నించాలి.” పార్టీ సభ్యులంతా ఇంతటి నిబద్ధత ప్రదర్శించాలన్నారు సుందరయ్య. నాయకత్వ స్థాయి విషయంలో ఈ తీర్మానం మరింత నిర్దిష్టంగా చెప్పింది. “నిరంతర అధ్యయనం, శిక్షణతో ప్రజలలో అనునిత్యం కృషి చేసి వారి విశ్వాసాన్ని, కార్యకర్తల విశ్వాసాన్ని చూరగొన్న కేడరే నాయకత్వ స్థానానికి వచ్చేందుకు అర్హులు.” రివిజనిజంతో తెగతెంపులు చేసుకున్న నాటి పరిస్థితులను ఆ తీర్మానం విశ్లేషించింది. “బాగా రాజకీయ చైతన్యం కలిగి ప్రజా పోరాటాలను నిర్వహించేవారు పార్టీకి నాయకత్వం వహించాల్సింది పోయి పార్టీలో అత్యంత వెనుకబడిన, ప్రజా ఉద్యమంలో లోతైన అనుభవం లేనివారు పార్టీకి నాయకత్వం వహించే స్థితి వచ్చింది. ఈ స్థితే రివిజనిజాన్ని పెంచి పోషించి చివరికి పార్టీ విచ్ఛిన్నతకు దారితీసిందంటే ఆశ్చర్యం లేదు.”

సుదీర్ఘ కాలం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అమలులో ఉన్న దేశం మనది. ఓట్లు, సీట్లే పార్టీ బలానికి సూచికలుగా పరిగణిస్తున్న కాలమిది. గత 5 సంవత్సరాలు తెలుగు రాష్ట్రాల శాసనసభలలో కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి లేరు. క్షేత్రస్థాయిలో పార్టీ పునాది చెదిరింది. సొంత పునాది బలహీనపడింది. ఇతర బూర్జువా పార్టీలతో సర్దుబాట్లు, తగిన ఆర్థిక వనరులు లేకుండా పోటీ చేయడానికి పార్టీ శ్రేణులు వెనుకాడుతున్నారు. చట్టసభల్లో ప్రవేశించడానికే ప్రథమ ప్రాధాన్యతనిచ్చే పరిస్థితి ఏర్పడింది. కమ్యూనిస్టు ఉద్యమానికి ఈ పరిస్థితి కొత్త సవాళ్ళను విసురుతున్నది. 1967లోనే పార్టీ కేంద్రకమిటీ చెప్పిన విషయం గమనిస్తే ఇప్పుడు దాని ప్రాధాన్యత అర్థమవుతుంది. “ఎప్పటికప్పుడు జరిగే సాధారణ ఎన్నికలు, మధ్యంతర ఎన్నికలు, ఉప ఎన్నికలు, పంచాయతీలు, సమితుల ఎన్నికల వంటి వాటికై పార్టీ శక్తిని, నిధులను, కాలాన్ని వ్యయపర్చడం జరిగింది. తత్ఫలితంగా వర్గ, ప్రజాసంఘాలను నిర్మించటం, వాటి రోజువారీ పోరాటాలను నడపటం పూర్తిగా మృగ్యమైంది. ఒక్కముక్కలో చెప్పాలంటే పార్టీ ప్రధాన కార్యక్రమం పార్లమెంటరీ కార్యక్రమానికి దిగజారిపోయింది.” 57 ఏండ్ల అనుభవం తర్వాత వెనుకకు తిరిగి చూసుకుంటే కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ళు మరింత స్పష్టంగా అర్థమవుతాయి.

పార్టీ నిర్మాణంలో పెరుగుతున్న అనేక బలహీనతలకు తోడు గుర్తింపు కోసం ఆరాటం కూడా ముందుకొస్తున్నది. మీడియాలోనో, వేదికలమీదనో కనిపిస్తే, ప్రజాప్రతినిధిగా ఎన్నికైతే లేదా కనీసం పోటీ చేస్తే గుర్తింపు వస్తుందనే ధోరణులు గమనించవచ్చు. సోషల్ మీడియాలో ఇందుకనుగుణమైన ప్రయత్నాలు పెరిగాయి. తరాలు మారినా సుందరయ్య గుర్తింపు చెదరలేదు. పైగా ఆయన స్ఫూర్తి, ఆయన అనుసరించిన బాట మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నది. చారిత్రాత్మక వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించటం, సంస్కరణవాదం, రివిజనిజం నుంచి కమ్యూనిస్టు ఉద్యమాన్ని కాపాడేందుకు సాహసించటమే ఆయన గుర్తింపుకు ప్రధాన కారణాలు. అంతెందుకు, మన కండ్లముందు విద్యుత్తు ఉద్యమం, ఏడు మాసాలు సాగిన భూపోరాటం, పోడుభూముల పోరాటం, కులవివక్ష వ్యతిరేక పోరాటం, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ పోరాటం, ట్రేడ్ యూనియన్ రంగంలో సాగిన పోరాటాలు, ఉమ్మడి రాష్ట్రంలో వరంగల్ జిల్లాలో ఇండ్లస్థలాలు, గుడిసెల కోసం సుమారు 30 సంవత్సరాలు సాగిన ఉద్యమాలతో వచ్చిన గుర్తింపు కంటే మించినదేమున్నది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమం ముద్ర వేసిన పోరాటాలివి. కమ్యూనిస్టు నాయకత్వం గౌరవం పెంచిన ఉద్యమాలివి. ప్రజా ఉద్యమానికి మించిన గుర్తింపు మరి ఎక్కడినుంచి వస్తుంది?

ఇన్ని తెలిసి కూడా పొరపాటు ధోరణులు ఎందుకు బలపడుతున్నాయి? ఈ ప్రశ్నకు సమాధానం కూడా పార్టీ చరిత్రలోనే వెతకాలి. 1967లో పార్టీ కేంద్రకమిటీ తీర్మానం ఇలాంటి పరిస్థితి గురించే హెచ్చరించింది. “మనం రివిజనిస్టు సిద్ధాంతాన్ని విడిచిపెట్టాం. డాంగేయుల రాజకీయాలను వదిలేశాం. అయినా ఇలాంటి పొరపాటు దృక్పథం మనలో కొనసాగుతూనే ఉంది. సులభంగా నాశనం చేయటానికి వీలుకానంతగా ఈ ధోరణి మనలో వ్యాపించింది. ఈ తప్పుడు ధోరణిని నాశనం చేసేందుకు నిరంతరం క్రమబద్ధమైన పోరాటాన్ని సాగించాలి.” “ఈ పెడధోరణులు పార్టీలో ఎంతగా ముదిరినాయో, వాటివల్ల పార్టీ సభ్యుల చైతన్యం ఎంతగా క్షీణించిందో, 1964లో రివిజనిస్టులతో తెగతెంపులు చేసుకున్న మనలో కూడా ఎంతగా జీర్ణించుకుపోయాయో పార్టీ సభ్యులకు అర్థమయితే తప్ప ఈ తప్పులను సరిదిద్దడం సాధ్యం కాదు.” సంస్కరణవాద ధోరణుల మీద పార్టీలో ఆంతరంగికంగా జరగవలసిన పోరాటం గురించి చెప్పిన మాటలివి. 55 ఏండ్ల తర్వాత కన్నూర్‌లో జరిగిన పార్టీ అఖిలభారత మహాసభలలో, పార్టీ నిర్మాణం బలహీనపడటానికి మూడు కారణాలను గుర్తించింది. పార్లమెంటరీ ధోరణులు, స్వీయమానసిక ధోరణులు, సంస్కరణవాదమే ఇందుకు కారణాలని రాజకీయ నిర్మాణ నివేదిక స్పష్టం చేసింది. సంస్కరణవాదం మీద, పార్లమెంటరీ ధోరణుల మీద పోరాటంలో ఆవిర్భవించిన మన పార్టీ మళ్ళీ అవే ధోరణుల గురించి చర్చించవలసి వస్తున్నది. ఇందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. నిరంతరం ఎన్నికల చుట్టూ తిరగవలసిన భౌతిక పరిస్థితుల నేపథ్యమే ఇందుకు కారణం. దీనికి పరిష్కారం వెతకడమే కమ్యూనిస్టుల కర్తవ్యం. ఆవేదన చెందడం, ఆందోళన చెందడం, గుండెలు బాదుకోవడం కమ్యూనిస్టు లక్షణం కాదు. కారణాలు అర్థమైనప్పుడు పరిష్కారాలు అసాధ్యమేమీ కాదు. అయితే అవి వాటంతటఅవి పరిష్కారం కావు. పరిష్కారం కోసం ప్రయత్నించాలి. పోరాడాలి. “విజయం దానంతట అది ఎప్పుడూ రాదు. దానిని సాధించాలి.” ఈ మాట కూడా పార్టీ కేంద్రకమిటీ తీర్మానమే నొక్కి చెప్పింది.

❉

సాంస్కృతిక రంగం

# సంస్కృతి-సమాజం: శాస్త్రీయ అవగాహన

**సాంస్కృతిక రంగంలో పార్టీ అవగాహన కోసం ఇటీవల విజయవాడలో జరిగిన సదస్సులో సమర్పించబడిన పత్రాల్లో కొన్నిటిని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం**

సంస్కృతి అనేది ప్రధానంగా భావజాల రంగానికి సంబంధించినది. ఇది వివిధ వ్యవస్థలలో వివిధ రూపాలలో వ్యక్తమౌతూ వుంటుంది. సమాజంలో నిరంతరం మార్పులు జరుగుతూన్నట్లే సంస్కృతిలోనూ మార్పులు జరుగుతూవుంటాయి. సమాజం, సంస్కృతి పరస్పరం ప్రభావితం చేసుకుంటాయి.

వర్గ సమాజాలలో ఆయా వర్గాలకు పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఉంటాయి. అందుకు అనుగుణంగా విరుద్ధ భావాలు వ్యక్తం ఔతూంటాయి. అవి సంస్కృతి లోనూ ప్రతిఫలిస్తాయి. ఒకానొక సమాజంలో ఆనాటి ఆధిపత్యవర్గపు భావాలే సాధారణంగా పైచేయిగా ఉంటాయి. సమాజంలో పరస్పర విరుద్ధ వర్గాల నడుమ వర్గ పోరాటాలు వివిధ స్థాయిలలో జరుగుతూన్నట్టే సాంస్కృతికంగా కూడా భిన్న భావాల నడుమ సంఘర్షణ జరుగుతూవుంటుంది.

ఆయా చారిత్రిక పరిస్థితుల నేపథ్యంలో ఏ భావజాలం ఏ విధంగా వ్యక్తం ఔతూ వుంటుందో పరిశీలించాలి.

**సంస్కృతి అంటే**

మానవులు ఒకరితో ఒకరు కలిసి జీవించే క్రమంలో వారి సామాజిక ప్రవర్తన రూపు దిద్దుకుంటుంది. ఈ క్రమంలో మనం సమకూర్చుకునే భావాలు, విలువలు, అర్థాలు, వాటిని పొందుపరిచే, వ్యాప్తి చేసే పద్ధతులు, అన్నీ వివిధ వ్యవస్థల ద్వారా వ్యక్తం ఔతాయి. వీటన్నింటినీ కలిపి సంస్కృతి అంటాం.

మానవుల భావజాలాలతో, సున్నితమైన భావోద్వేగాలతో సంస్కృతి ముడిపడివుంటుంది. సృజనాత్మక స్వభావం కల కవిత్వం, ఇతర రూపాల సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, నాటకం, క్రీడలు వంటివి సంస్కృతిలో భాగంగా ఉంటాయి. ఇవి గాక, కుటుంబ పరంగా, రక్త సంబంధీకులతో కలిగివుండే సంబంధాల ద్వారా సంక్రమించే విలువలు, సాంప్రదాయాలు, ఆచారాలు వంటివి కూడా సంస్కృతిలో భాగంగా ఉంటాయి. మతం, మతవిశ్వాసాలు కూడా సంస్కృతిలో ఒక భాగమే. భావోద్వేగాలతో ముడిపడి, మన వ్యక్తిగత, సామాజిక ప్రవర్తనను ప్రభావితం చేసే ఈ అంశాలనే మనం ప్రధానంగా సంస్కృతిగా పరిగణిస్తాం. వీటితోబాటు మేధోపరమైన కృషితో ముడిపడిన ప్రకృతి శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు, సాంకేతిక పరిజ్ఞానం, తత్వశాస్త్రం వంటివి కూడా సంస్కృతిలో భాగం.

ఇవన్నీ కలిసి మానవుల వ్యక్తిత్వాలు పెంపొందే పరిణామానికి దోహదం చేస్తాయి, ప్రభావితం చేస్తాయి. ఏ దిశగా మానవుల వ్యక్తిత్వాల పరిణామానికి సంస్కృతి దోహదం చేస్తుంది అన్నదానిని బట్టి సమాజ పరిణామక్రమం వేగవంతం అవడం కాని, మందగించడం కాని జరుగుతుంది.

**సంస్కృతి - పరిణామ క్రమం**

**తొలి దశ: సామూహిక స్వభావం**

మానవులు తమ మనుగడను కొనసాగించే క్రమంలో ప్రకృతి శక్తులతో నిరంతరం సంబంధం కలిగి ఉంటారు. తమ అవసరాలను తీర్చుకోవడం కోసం ఉత్పత్తి చేస్తారు. ఈ ఉత్పత్తి సమిష్టిగా జరుగుతుంది. సమిష్టిగా జరిగే ఉత్పత్తి క్రమంలో పరస్పర సమన్వయం కోసం మానవులకు భావ వ్యక్తీకరణ అవసరం అయింది. ఇందుకోసం భాష, లిపి, చిత్రాలు గీయడం, సామూహిక క్రీడలు, నృత్యాలు వంటి రూపాలను మానవులు ఆవిష్కరించుకున్నారు. ఆ క్రమంలో ఈ రూపాలు భావ వ్యక్తీకరణకు కూడా తోడ్పడసాగాయి. అవి మానవుల సమిష్టి సంస్కృతికి ప్రతిరూపాలు. అంటే సంస్కృతి మానవుల సమిష్టి శ్రమజీవన క్రమంలో ఆవిర్భవించి పెంపొందింది. ఉత్పత్తి ఎంత విస్తృతంగా వైవిధ్యంగా పెంపొందుతూ వచ్చిందో అంత విస్తృతంగాను, వైవిధ్య భరితంగాను వారి సంస్కృతి పెంపొందుతూ వచ్చింది. శ్రమ పెంపొందుతున్నకొద్దీ సంస్కృతి కూడా పెంపొందింది. అదే క్రమంలో సంస్కృతి పెంపొందిన క్రమం కూడా శ్రమను మరింత పెంపొందించడానికి దోహదం చేసింది. ఇది గతితార్కిక సంబంధం.

*"ప్రజలంటే సంపదను సృష్టించేవాళ్ళు మాత్రమే కాదు. ఆధ్యాత్మిక విలువలను కూడా అనునిత్యం సృష్టిస్తూవుంటారు. సౌందర్యం, మేధస్సు ఆ క్రమంలో వికసిస్తూనే వుంటాయి. తాత్విక ఆలోచనలు, కవిత్వం వగైరాలన్నీ ఆ ప్రజల సమిష్టి జీవన క్రమంలోంచే రూపొందుతాయి. "* - గోర్కీ

మానవ సమాజపు శైశవ దశలో ప్రకృతి శక్తులముందు నిస్సహాయులుగా నిలిచివున్న మానవులు ఒకవైపు ఆ శక్తులంటే భయానికి, మరోవైపు ఆశ్చర్యానికి లోనవుతూవచ్చారు. తమ మనుగడను కొనసాగించడమే ఆ కాలంలోవారి ముందున్న పెద్ద సవాలు. ప్రకృతి శక్తుల ముందు సంభ్రమాశ్చర్యాలకు లోనౌతూన్న క్రమంలోనే మానవులు మతాన్ని రూపొందించుకున్నారు. ఆనాటికి ప్రకృతి పట్ల వారికున్న యావత్తు జ్ఞానమూ అప్పటి మతంలోనే వ్యక్తం అయింది. ఆ ప్రకృతి శక్తులతో జరిపిన సంఘర్షణల అనుభవం కూడా ఆ మతంలోనే వ్యక్తం అయింది. అందులోనే వారి కవిత్వం, తాత్విక దృక్పధాలు వ్యక్తం అయ్యాయి.

ఆ సంఘర్షణ క్రమంలో మానవులు ప్రకృతి శక్తులమీద సాధించిన తొలి విజయాలు తమ మనుగడ కొనసాగుతుందన్న ఒక భరోసానిచ్చాయి. వారి శక్తి పట్ల ఆత్మవిశ్వాసాన్ని కలిగించాయి. మరెన్నో విజయాలు సాధించాలనే ఆశలు రేకెత్తించాయి. ఆ ఆశలకు ప్రతిరూపంగానే వాళ్ళు తమ హీరోలను ఊహించుకున్నారు. తమ సమిష్టి కలల, ఆశల, కోర్కెల ప్రతిరూపంగా మానవులు సృష్టించుకున్న హీరోల గాథలు పురాణాలయ్యాయి. దేవతలను సైతం సవాలు చేయగల శక్తిమంతులుగా ఆ హీరోలు రూపొందారు. చివరికి ఆ హీరోలు దేవతల సరసన స్థానాలు పొందారు.

సమాజంలో ఉనికిలో ఉండిన సామూహిక జీవనం సామూహిక విలువలను, ఆ విలువలతోకూడిన సంస్కృతిని పెంపొందించింది. సమిష్టితత్వం, ఉమ్మడి కట్టుబాట్లు ఆ సంస్కృతి సారాంశంగా ఉండేవి. అవి ఆనాటి కళల్లో, సాహిత్యంలో, ఆటల్లో, పండుగలలో వ్యక్తం అయేవి. నేటికీ వాటిలో కొంతభాగమైనా

> **❝ బలవంతుడిదే రాజ్యం అన్న భావనను సమర్థించడం కోసం వీరత్వాన్ని, సాహసాన్ని ఉత్తమ విలువలుగా ఫ్యూడల్ సమాజం చూపుతుంది. రాజు దైవాంశతో పుట్టాడు అన్న భావనను సమర్థించేలా ఆ రాజు పుట్టుకను, వంశాన్ని, గొప్పగా చిత్రిస్తుంది. శాసనాలు జారీ చేయడం, వాటిని అమలు చేయడం, అతిక్రమించినవారికి శిక్షలు వేయడరా అన్నీ ప్రభువర్గం దగ్గరే కేంద్రీకృతం అయాయి. ❞**

శ్రమజీవుల కుటుంబాల్లో, వారి పండుగలలో కానవస్తూనేవున్నాయి.

**వర్గ సమాజాలు**

**బానిస సమాజాలు**

ఆ తర్వాత వ్యక్తిగత ఆస్తి ఏర్పడడంతో సమాజంలో దోపిడీ మొదలైంది. దాంతోబాటే వర్గసంఘర్షణ కూడా మొదలైంది. వ్యక్తిగత ఆస్తిరక్షణ దోపిడీవర్గాల ప్రధాన లక్ష్యం అయింది. ఆ క్రమంలో ఆస్తి వారసత్వం సమస్య ముందుకొచ్చింది. అది స్త్రీలను అసమానులుగా, హక్కులు లేనివారిగా మార్చింది. పురుషాధిక్యత ఒక సామాజిక విలువగా దోపిడీవర్గాలు సమాజ సంస్కృతిలో ప్రవేశపెట్టాయి. వ్యక్తిగత ఆస్తి ఏర్పడి ప్రజలలో చీలిక తెచ్చింది. వాళ్ళ మధ్య సంబంధాలలో శతృత్వం నెలకొంది. సర్దుబాటు సాధ్యం కాని వైరుధ్యాలు ఏర్పడ్డాయి. ఆ విధంగా వ్యక్తిగత ఆస్తి సమాజంలోని సమిష్టితత్వాన్ని దెబ్బతీసి దాని స్థానంలో వ్యక్తి కేంద్రంగా ఉండే "నేను" అనే భావనను ముందుకు తెచ్చింది. ఈ క్రమంలో ప్రజలు భౌతికంగాను, మానసికం గాను బానిసత్వానికి నెట్టబడ్డారు. వాళ్ళ సమిష్టి శక్తి సామర్థ్యాలు నీరుగారిపోయాయి. సమిష్టి జీవన క్రమంలో ప్రకృతితో జరిపే పోరాటంలో వారు పొందిన తాదాత్మ్యత, వారి కవితా శక్తి, వారిలో అప్పటికప్పుడు ఎగిసిపడే సృజనాత్మకత – అన్నీ క్రమంగా నాశనం అయాయి.

ఆస్తి విహీనులుగా ఉన్న వారిలో అత్యధికులు బానిసలుగా మారారు. వారి శరీరంతో బాటు ప్రాణాలమీద హక్కు కూడా యజమానులదే అయింది. పశువులను వినియోగించినట్టే బానిసలను చాకిరీకి వినియోగించే సంస్కృతి నెలకొంది. ఎట్టి స్వేచ్ఛా లేకుండా బానిసలు మగ్గిపోయారు. మన దేశంలో అత్యంత దారుణమైన వివక్షత, అణచివేతలతో కూడిన కుల వ్యవస్థ బలంగా విస్తరించింది. కుల కట్టుబాట్లను అత్యంత పవిత్రమైనవిగా, అతిక్రమించడానికి వీలు లేనివిగా పరిగణించే సంస్కృతి నెలకొంది. ఈ సంస్కృతిని సమర్థించే ధర్మ శాస్త్రాలు ప్రచారంలోకి వచ్చాయి. ధర్మాన్ని కాపాడడమే ప్రభువు ప్రధాన, ప్రథమ ధర్మం అయింది. అందుకోసం ఏం చేసినా, ఎంత దుర్మార్గాలకు ఒడిగట్టినా, రక్తపాతం సృష్టించినా, అదంతా ధర్మ రక్షణ పేరుతో సమర్థనీయమే అయింది.

**ఫ్యూడల్ సమాజాలు – సాంస్కృతిక భావాలు**

బలవంతుడిదే రాజ్యం అన్న భావనను సమర్థించడం కోసం వీరత్వాన్ని, సాహసాన్ని ఉత్తమ విలువలుగా ఫ్యూడల్ సమాజం చూపుతుంది. రాజు దైవాంశతో పుట్టాడు అన్న భావనను సమర్థించేలా ఆ రాజు పుట్టుకను, వంశాన్ని, గొప్పగా చిత్రిస్తుంది. శాసనాలు జారీ చేయడం, వాటిని అమలు చేయడం, అతిక్రమించినవారికి శిక్షలు వేయడరా అన్నీ ప్రభువర్గం దగ్గరే కేంద్రీకృతం అయాయి. పుట్టుకతోటే కొందరు రాజుకు సేవ చేయడానికే పుట్టారు అన్న భావనను చెప్పడానికి సామాజిక అంతస్తులు ముందుకు వచ్చాయి. పాతివ్రత్యం స్త్రీ కి ప్రాణం కన్నా మిన్న అన్న భావన ప్రచారం అయింది. అదే సమయంలో పురుషుడు ఎక్కువమంది స్త్రీలతో సంపర్కం పెట్టుకోవడం గొప్పగా పరిగణించబడింది. భోగలాలసత, విందులు, వినోదాలతో కాలం వెళ్ళబుచ్చడం సంపన్నుల సామాజిక జీవితంలో ప్రధాన భాగం అయింది.

అదే సమయంలో, ఫ్యూడల్ దోపిడీ ఎంత కర్కశమైనదో, అంత దయామయుడుగా ప్రభువును కీర్తించే సంస్కృతి ఉండేది. మన దేశంలో భట్రాజులు ఏకంగా ప్రభువులను పొగడటమే వృత్తిగా జీవించారు. ఇంకోపక్క భక్తి ఉద్యమం ఒకవైపు శ్రామిక తరగతుల ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను తీర్చడంతోబాటు, ఏక కాలంలో ప్రభువుల పట్ల విధేయత కలిగివుండే విలువలను కూడా బలంగా ప్రచారం చేసింది. వ్యవసాయం విస్తరిస్తున్నకొద్దీ కొత్తగా వచ్చి చేరే ఆదివాసుల దేవతామూర్తులను తమ పురాణ దేవతలుగా ప్రకటించి బ్రాహ్మణమతాచారాలను వారందరిమీదా రుద్ది బ్రాహ్మణాధిపత్యాన్ని బలోపేతం చేసుకున్నారు. ఇటువంటి విలువలను బహుముఖాలుగా సాంస్కృతిక రూపాలద్వారా ప్రజలలోకి జొప్పించారు.

**పెట్టుబడిదారీ సంస్కృతి, విలువలు**

కొత్తగా బలపడుతున్న పెట్టుబడిదారీ వర్గానికి, శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు చాలా తోడ్పడ్డాయి. ఉత్పత్తి శక్తుల సామర్థ్యాన్ని పెంచడానికి అవకాశాలు పెరిగాయి. కాని మూఢవిశ్వాసాలతో, తమ అధికారాన్ని ప్రశ్నించడానికి వీల్లేని నిరంకుశ పద్ధతులతో అప్పటి వ్యవస్థ (ముఖ్యంగా ప్రభువులు, మతాధికారులు) ఈ అభివృద్ధికి ఆటంకం అయింది. హేతువాదం, భౌతికవాదం వంటి తాత్విక ధోరణులు, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ. సౌభ్రాతృత్వం వంటి రాజకీయ ధోరణులు ఆ కాలంలో బలంగా ముందుకు వచ్చాయి. ఫ్యూడల్ ప్రాబల్యాన్ని ఎదుర్కోడానికి పెట్టుబడిదారులు సామాన్య తరగతుల ప్రజలలోకి కూడా ఈ విలువలను తీసుకుపోయారు. వారిని కలుపుకుని ఫ్యూడల్ సమాజాన్ని కూలదోశారు. ఈ పరిణామ క్రమాన్ని మనం ప్రధానంగా యూరప్ ఖండంలో చూస్తాం.

భారతదేశంలో పరిణామం కొంత భిన్నంగా ఉంది. ఇక్కడ ఫ్యూడల్ శక్తులు బలహీనపడుతున్న సమయానికి సామ్రాజ్యవాదులువచ్చి ఈ దేశాన్ని ఆక్రమించుకున్నారు. ఎక్కువమంది ఫ్యూడల్ ప్రభువులు వారితో రాజీపడ్డారు. భారతీయులను తమకు విధేయులుగా ఉంచడం కోసం బ్రిటిష్ పాలకులు బహుముఖ వ్యూహం అనుసరించారు. వలసపాలన పట్ల విధేయత, ఆరాధన పెరిగే చదువును ప్రవేశపెట్టి మధ్య తరగతిని పెంచారు. వలస దోపిడీ తీవ్రత పెరిగి దారిద్ర్యం లోకి పోతున్న ప్రజలను క్రైస్తవ మతం వైపు మళ్ళించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అగ్రవర్ణాల తరగతులతో చెలిమి చేశారు. కులవ్యవస్థను సమర్థించారు. ఇక్కడి మతాచారాలను, సాంఘిక అసమానతలను, పురుషాధిక్యతను బలపరిచారు.

విదేశీ విద్యను అభ్యసించి, అక్కడ ప్రజాస్వామ్య విలువలను గ్రహించి వెనక్కి వచ్చిన కొందరు ఇక్కడ సాంఘిక సంస్కరణలకోసం పాటుపడ్డారు. విద్య, స్త్రీ సమానత్వం, కులవివక్షత నిర్మూలన,

> **❝ పెట్టుబడిదారీ క్రమం యావత్తూ 'వ్యక్తి స్వేచ్ఛ' అనే విలువను ఆకాశానికెత్తుతూ పోయింది. కాని నిజానికి వ్యక్తిత్వం దెబ్బ తినిపోవడం అనేది వ్యక్తిగత ఆస్తి తోపాటు జరిగిన పరిణామం. ఆ క్రమం పెట్టుబడిదారీ విధానంలో తారాస్థాయికి చేరింది. ఐతే ఈ పెట్టుబడిదారీ సమాజంలోనే ఒక కొత్త సమిష్టి శక్తి రూపొందింది. అదే ఆధునిక కార్మికవర్గం. ఈ వర్గంలోకే తక్కిన అన్ని వర్గాలలోని అత్యుత్తమ శక్తులన్నీ వచ్చి చేరుతున్నాయి. ❞**

మూఢాచారాల నిర్మూలన వంటి అంశాలమీద కృషి ఎక్కువగా సాగింది. భారతీయులు ప్రపంచంలో ఎవరికీ తీసిపోరు అన్న భావనతో బ్రిటిష్ వారి ఆధిపత్య భావజాలాన్ని సవాలు చేశారు. ఈ క్రమంలోనే ఈ ఉపఖండం అంతా ఒకే దేశం అన్న భావన బలపడింది.

అదే సమయంలో మరికొందరు మన గతం చాలా గొప్పది అని, హిందూ మతమే సర్వశ్రేష్టం అని ప్రచారం చేస్తూ హిందూ పునరుద్ధరణవాదానికి బీజాలు వేశారు.

1920 దశకం తర్వాత సోషలిస్టు రష్యా విప్లవ స్ఫూర్తితో కార్మికవర్గం సంఘటితం కావడం పెరిగింది. పునాది వర్గాల సామాజిక చైతన్యం పెరిగింది.

జాతీయోద్యమంలో ఫ్యూడల్, పెట్టుబడి దారీ, సోషలిస్టు భావజాలం, ఆయా వ్యవస్థల సాంస్కృతిక విలువలు ఏకకాలంలో కొనసా గాయి. సామ్రాజ్యవాద వ్యతిరేకత, స్వావలం బన అన్న భావాలు ఈ స్రవంతులన్నింటినీ కలిపి నడిపించాయి.

స్వాతంత్ర్యం అనంతరం కూడా ఈ మూడు రకాల సాంస్కృతిక విలువలు కొనసాగాయి.

తన వర్గాధిపత్యాన్ని కాపాడుకోడానికి పెట్టుబడిదారీ వర్గం కార్మికవర్గాన్ని ప్రత్యక్షంగా అణచిపెట్టి వుంచే రాజ్యాంగ వ్యవస్థను పెంపొందించింది. ఐతే ప్రత్యక్ష అణచివేత అనునిత్యం, అందరిమీదా అమలు చేయడం సాధ్యం కాదు. అందుచేత కార్మికవర్గపు చైతన్యాన్ని తనకు లొంగివుండేలా ప్రభావితం చేయడానికి సంస్కృతిని ఒక సాధనంగా పెట్టుబడిదారీ వర్గం ఉపయోగించుకుంటుంది. అంతేగాక, ఒకప్పుడు భూస్వామ్య వ్యవస్థమీద తాను తిరుగుబాటు సాగించినప్పుడు ముందుకు తెచ్చిన "స్వేచ్ఛ", "సమానత్వం", 'సౌభ్రాతృ త్వం", "ప్రజాస్వామ్యం" వంటి నినాదాలను ఇప్పుడు సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని ఎదుర్కో డానికి ఉపయోగిస్తుంది. సోషలిజం అంటే నియంతృత్వం అని, వ్యక్తి స్వేచ్ఛ హరించ బడుతుందని, ఆలోచనలు స్వేచ్ఛగా వికసించ డానికి అవరోధం అని ప్రచారం చేస్తుంది.

రాజ్యాంగ యంత్రం మీద పట్టు కలిగివుండడంతోబాటు పాలకవర్గాలు మీడియా మీద, విద్యావ్యవస్థమీద కూడా తమ ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి పూనుకుంటాయి.

పెట్టుబడిదారీ క్రమం యావత్తూ 'వ్యక్తి స్వేచ్ఛ' అనే విలువను ఆకాశానికెత్తుతూ పోయింది. కాని నిజానికి వ్యక్తిత్వం దెబ్బ తినిపోవడం అనేది వ్యక్తిగత ఆస్తి తోపాటు జరిగిన పరిణామం. ఆ క్రమం పెట్టుబడిదారీ విధానంలో తారాస్థాయికి చేరింది. ఐతే ఈ పెట్టుబడిదారీ సమాజంలోనే ఒక కొత్త సమిష్టి శక్తి రూపొందింది. అదే ఆధునిక కార్మికవర్గం. ఈ వర్గంలోకే తక్కిన అన్ని వర్గాలలోని అత్యుత్తమ శక్తులన్నీ వచ్చి చేరుతున్నాయి. తాను చేస్తున్నది తప్పు అన్న భావన పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎన్నడూ ఉండదు. కాని, తన ఇష్టంతో నిమిత్తం లేకుండానే, అది ఒక నూతన సమిష్టి శక్తిని పునఃసృష్టి చేస్తుంది. ఒక దిట్టమైన నైతిక శక్తితో శ్రామికవర్గం రూపొందుతుంది. ఈ శ్రామిక శక్తి క్రమంగా తన పాత్ర గురించిన చైతన్యాన్ని సంతరించుకుంటుంది. స్వేచ్ఛా యుతమైన సజీవమైన నూతన ప్రపంచాన్ని నిర్మించే కర్తవ్యం తనపైనే ఉన్నదని అది గ్రహిస్తుంది.

ఐతే ఈ నూతన శక్తిని వ్యక్తివాదులు పెద్ద ముప్పుగా పరిగణిస్తారు. ''నేను'' అనేదానికి ఉన్న అగ్రస్థానాన్ని ఈ నూతన శక్తి నాశనం చేస్తుందని భావిస్తారు. అదే సమయంలో దెబ్బ తినిపోతున్న వ్యక్తిత్వాలు వాళ్ళని ఆధ్యాత్మికంగా దరిద్రులుగా చేస్తాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలోపల వాళ్ళ వ్యక్తిత్వా లను కాపాడుకోనూలేరు, నూతన శ్రామిక శక్తిని ఆహ్వానించనూలేరు. ఈ క్రమంలో పరిష్కారం కోసం వాస్తవ ప్రపంచంతో సంబంధం లేని, ఊహాజనితమైన పరిష్కారాల కోసం తాపత్రయపడతారు. దుర్వ్యసనాలకు బానిసలౌతారు. దేవుడిని అన్వేషిస్తూనే, దెయ్యాలనూ విశ్వసిస్తారు. చివరికి ఈ వ్యక్తివాదులు ప్రపంచాన్ని, తమను మోసం చేసుకుంటూ బతికే స్థాయికి దిగజారుతారు. ఈ ధోరణికి అద్దం పడుతుంది ఫాసిజం. దానికి విరుద్ధంగా నూతన సమిష్టితత్వానికి ప్రతిబింబంగా ఉంటుంది సోషలిజం.

**సోషలిస్టు విలువలు**

సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆత్మగౌరవం, సమిష్టి తత్వం, స్త్రీ విముక్తి, అన్ని రకాల శ్రమకూ గౌరవం, సహకార స్ఫూర్తి, సామరస్యం, సృజనాత్మకత వంటివి సోషలిస్టు సమాజంలో పాటించే విలువలు. వ్యక్తిగత ఆస్తిని పెంచుకోవాలనే యావ క్రమంగా అంతరిస్తుంది. లాభం కోసం కాక, శ్రమను సులభతరం చేసుకోడానికి నూతన శాస్త్ర ఆవిష్కరణలను ఉపయోగిస్తారు. సంకుచితమైన దురభిమానాలను అధిగమించి శ్రామికవర్గ అంతర్జాతీయతను పెంపొందిస్తారు. ప్రపంచశాంతి. పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు అత్యతంత ప్రాధాన్యత ఉంటుంది. వ్యక్తి లాభం కోసం కాకుండా సమాజ ప్రయోజనం కోసం ఉత్పత్తి జరుగుతుంది. సంస్కృతి కూడా వ్యాపారం కోసం కాకుండా సమాజ ప్రయోజనం కోసం పెంపొందుతుంది. అందుచేత సృజనాత్మకత సర్వత్రా వెల్లివిరుస్తుంది. శ్రమ-సంస్కృతి నడుమ ఉ ండవలసిన గతితార్కిక సంబంధం దోపిడీ వ్యవస్థల్లో చెదిరిపోతుంది. మళ్ళీ సోషలిస్టు సమాజంలో అది బలపడి పుంజుకుంటుంది. సోషలిజం ఏర్పడ్డాక ఆ దేశాల్లో సాంస్కృతిక రంగంలో సాధించిన అపూర్వ విజయాలు, బలంగా ముందుకు తెచ్చిన ఉన్నత మానవ విలువలు ఇందుకు ఉదాహరణలు.

**ప్రపంచీకరణ - సంస్కృతి**

(1) పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద విధానాల పరిణామ క్రమంలో ప్రపంచీకరణ గుణాత్మకంగానే విభిన్నమైన దశ. ద్రవ్య పెట్టుబడుల పెరుగుదల అపారంగా ఉండి అంతర్జాతీయతను సంతరించుకోడం ఈ దశ ప్రత్యేకత. బ్రహ్మాండమైన ఈ పెట్టుబడి మొత్తాలు సత్వర లాభాలను ఆశిస్తాయి. ప్రధానంగా స్పెక్యులేటివ్ వ్యాపారం ద్వారా అవి ఈ లాభాలను పొందజూస్తాయి. కనుక వాటికి ఏ రకమైన ఆంక్షలూ లేకుండా వివిధ దేశాలలో స్వేచ్ఛాసంచారం అవసరమౌతుంది. ఆ క్రమంలో అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, దాని ఆధిపత్యానికి ప్రతినిధులుగా ఉండే ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్, ప్రపంచ వాణిజ్య

**"ఈ సమాజం ఒక పోటీప్రపంచం. అందుచేత ప్రతీ ఒక్కరూ వ్యక్తిగతంగా ఆలోచించి పోటీలో తాము ఏ విధంగా ముందువరసలో ఉండాలన్నది ఆలోచించాలి. పోటీలో తక్కినవారి గురించి ఆలోచిస్తూ కూచుంటే మనం నెగ్గలేం. సామాజిక స్పృహ వంటివి పొల్లుమాటలుగా పరిగణించబడతాయి."**

సంస్థ వంటివి స్వతంత్ర దేశాల సార్వభౌమత్వాన్ని హరించివేస్తాయి.

అవి వస్తూత్పత్తి లోనూ, పంపిణీ లోనూ అత్యధిక భాగాన్ని అదుపు చేస్తూ, యావత్ ప్రపంచాన్నీ ఒకే ఒక అంతర్జాతీయ మార్కెట్‌గా మార్చాలని చూస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సంపద కేంద్రీకరణ పెరగడం, అసమానతలు పెరగడం, దానితోబాటు పేదరికం, నిరుద్యోగం పెరగడం దీని ఫలితంగా జరుగుతుంది.

ప్రపంచీకరణ క్రమానికి వెనుకబడిన దేశాలనుండి, ప్రాంతాలనుండి, వివిధ తరగతుల ప్రజలనుండి, కార్మికవర్గం నుండి ప్రతిఘటన రాకుండా అదుపు చేయడానికి ఈ ప్రపంచీకరణ శక్తులు పెద్ద ఎత్తున సాంస్కృతిక జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. ఆ ప్రభావం రెండు రకాలుగా ఉంటుంది:

ప్రపంచీకరణ విధానాలకు సాధారణ ప్రజానీకం నుండి ఆమోదం లభించేలా చూడడం, ఆ ప్రజలంతా తమ అంతర్జాతీయ మార్కెట్‌కు వినిమయదారులుగా స్వచ్ఛందంగానే లోబడి వ్యవహరించేలా చూడడం, అందుకోసం ప్రజల అభిరుచులను ప్రభావితం చేసి ప్రపంచవ్యాప్తంగా ఒకే తరహా మార్కెట్ ఉండేలా చేసి తమ ఉత్పత్తులకు మార్కెట్ తోబాటు భారీ లాభాలను సమకూర్చుకోవడం సాంస్కృతిక రంగాన్నే ఒక వ్యాపార, ఉత్పత్తి రంగంగా మార్చివేయడం ఈ రెండు రకాల పర్యవసానాలు ప్రపంచీకరణ ఫలితంగా కలుగుతున్నాయి. సాంస్కృతిక రంగం మీద సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆధిపత్యం నెలకొంది. దీనిని ప్రతిఘటించకుండా విప్లవోద్యమం గాని, ప్రజాతంత్ర ఉద్యమంగాని ముందుకు పోలేవు.

**సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆధిపత్యాన్ని నెరుపుతున్న తీరు**

**సైద్ధాంతికంగా:** పెట్టుబడిదారులతోటే సమాజ అభివృద్ధి సాగుతుంది. వారి లాభాల వేటకు అనుగుణంగా సమాజం యావత్తూ నడుచుకోవాలి. ఉద్యమాలు, పోరాటాలు, హక్కులు వగైరా వలన ఏమీ ప్రయోజనం ఉండదు. ఉత్పాదకతను పెంచడమే లక్ష్యంగా పెట్టుకోవాలి. ఇందుకు భిన్నంగా మాట్లాడితే అది అభివృద్ధిని ఆటంకపరచడమే. అభివృద్ధిని వ్యతిరేకించే శక్తులమీద నిరంకుశత్వం, అణచివేత, అమానవీయత ప్రదర్శించడం సమర్ధనీయం. (ప్రపంచీకరణ దోపిడీ తీవ్రత పెరుగుతున్నకొద్దీ ఈ నిరంకుశత్వం పెరుగుతూ పోతుంది) వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలను ప్రకటించడం, రైతుల రుణ మాఫీ, సామాన్య తరగతులకు సబ్సిడీలు ఇవ్వడం అభివృద్ధి నిరోధకం. కార్పొరేట్లకు దేశ వనరులను కట్టబెట్టడం, వారి రుణాలను మాఫీ చేయడం దేశాభివృద్ధికి దోహద పడుతుంది. పేదరికం ఉంది కనుక వారికి కొన్ని 'ఉచిత' పథకాలను కావాలంటే ఇవ్వవచ్చు. వాటిని కూడా క్రమంగా కుదించుతూపోవాలి. సంపదపన్ను, వారసత్వ పన్ను అభివృద్ధి నిరోధకం. అవి కార్పొరేట్లను నిరుత్సాహపరుస్తాయి. వినియోగదారులపై పరోక్ష పన్నులను వేయడమే సరైన విధానం.

ప్రైవేటు రంగం సమర్ధవంతం, పారదర్శకం, జవాబుదారీ తనంతో ఉంటుంది. ప్రభుత్వ రంగానికి అవేమీ ఉండవు. అందుచేత అన్నీ ప్రైవేట్ పరం చేయాలి. ప్రైవేట్ విద్య, ప్రైవేట్ వైద్యం చాలాగొప్పవి. విదేశీ చదువులు ఇంకా ఉన్నత స్థాయిలో ఉంటాయి.

ఈ సమాజం ఒక పోటీప్రపంచం. అందుచేత ప్రతీ ఒక్కరూ వ్యక్తిగతంగా ఆలోచించి పోటీలో తాము ఏ విధంగా ముందువరసలో ఉండాలన్నది ఆలోచించాలి. పోటీలో తక్కినవారి గురించి ఆలోచిస్తూ కూచుంటే మనం నెగ్గలేం. సామాజిక స్పృహ వంటివి పొల్లుమాటలు.

**వినిమయ తత్వం :** మార్కెట్ లో లభించే అన్ని ఆధునిక వస్తువులనూ పొందడం, వాటిని ఉపయోగించడం జీవితం ఆనందంగా గడపడానికి కీలకం. ఆ వినియోగంలో వెనుకబడితే మనం అనాగరికులుగా మిగిలిపోతాం. వెనుకబడిపోతాం.

సామ్రాజ్యవాద దేశాల ఉత్పత్తులతో ప్రపంచ మార్కెట్లను నింపివేయడం, వాటిని ఉపయోగించడమే చాలా గొప్ప జీవన విధానం అన్నట్టు ప్రచారం చేయడం వాల్‌మార్ట్ తరహా మార్కెట్ చైన్‌లను ఏర్పాటు చేసి ప్రజలను వాటివైపు పెద్ద ఎత్తున ఆకర్షించడం. ఆహారం. పానీయాలు, దుస్తులు, సౌందర్య సాధనాలా అన్నింట్లోనూ ఆధిపత్యం నెలకొల్పడం స్వదేశీ ఉత్పత్తులను కూడా తమ మార్కెట్ చైన్ పరిధిలోకి తీసుకునిరావడం.

(మజ్జిగ, బెల్లం, రాగిపిండి, సాంప్రదాయ తినుబండారాలు, ఊరగాయలు వగైరా) ప్రసార సాధనాలు అన్నీ ప్రైవేట్ కార్పొరేట్ల పెత్తనంలోకి తెచ్చుకుని, వాటిద్వారా విదేశీ వినిమయసంస్కృతిని, ఆ విలువలను గొప్పవిగా ఇక్కడ చిత్రిస్తారు. విశృంఖలత్వం, హింస, విదేశీ మోజు, అసహజమైన హీరో యిజం, అశ్లీలత వంటిధోరణులను పెంచిపోషిస్తారు. అదే సమయంలో ఆ సాంస్కృతిక ఉత్పత్తులు (సినిమాలు, ఆల్బమ్ లు, డాక్యుమెంటరీలు, వీడియో గేములు వగైరా) ఒక భారీ స్థాయిలో ఉత్పత్తి అవడం చేత అదొక అతి పెద్ద మార్కెట్‌గా పెరిగిపోతోంది. చివరికి మనం ఉపయోగించే ఫేస్‌బుక్, వాట్సప్ వగైరా సోషల్ మీడియా వేదికలు సైతం లక్షల కోట్ల వ్యాపార సంస్థలుగా ఎదిగిపోయాయి. మన ఆలోచనలను నియంత్రించే ఈ సాధనాలు అదే సమయంలో సామ్రాజ్యవాదులకు లాభార్జన వనరులుగా కూడా ఉన్నాయి.

**స్థానిక సంస్కృతి, స్థానిక సాంప్రదాయాలను కూడా** తమ ప్రభావం లోకి తీసుకువస్తారు. వాలెంటైన్స్ డే వంటి సంస్కృతిని ఎంతగా తమ వ్యాపారానికి వాడుకుంటారో, రాఖీ పండుగను, దసరా, సంక్రాంతి వంటి పండుగలను కూడా అంతే ఉధృతంగా వాడుకుంటారు. ఆ పండుగలను నిర్వహించుకునే తీరులో ప్రవేశపెట్టే మార్పులు వారి వ్యాపార ప్రయోజనాలకు, సాంస్కృతిక ఆధిపత్యానికి దోహదం చేసేవిగా ఉండేట్టు చూస్తారు. వివాహాలు హిందూ, లేదా ముస్లిం సాంప్రదాయం ప్రకారవే జరిగినట్లు కనిపిస్తుంది. కాని ఆ సమయంలో జరుపుకునే కార్యక్రమాలు, విందులు, దుస్తులు, ఆభరణాలు, అన్నీ కలిపితే ఒక బ్రహ్మాండమైన వ్యాపార సామ్రాజ్యంలా మారిపోయినట్టు కనిపిస్తుంది. అప్రధానమైన అక్షయ తృతీయ అనే ఒక చిన్న పర్వదినం టన్నులకొద్దీ

బంగారాన్ని అమ్ముకోడానికి మార్కెట్‌గా మార్చేశారు.

ప్రపంచీకరణ క్రమంలో దైనందిన జీవితపు ఒత్తిళ్ళను తట్టుకోడానికి, అదే సమయంలో వాస్తవాలను గమనించకుండా ఉండేలా ఉద్యోగులను భ్రమలో కొనసాగించడానికి యోగ, ధ్యానం, వంటి ప్రాచీన సాంప్రదాయాలను పెద్ద ఎత్తున ఉపయోగిస్తున్నారు. పోటీ ప్రపంచం అని వత్తిడిని పెంచే జీవన శైలిలోకి దించి, ఆ వత్తిడిని తట్టుకోడానికి చూపే పరిష్కారాలు కూడా ఒక పెద్ద వ్యాపారంగా మార్చివేశారు.

కాలుష్యపూరిత ఆహారాన్ని ఉత్పత్తి చేసి అమ్ముతారు. ఆ కాలుష్యాన్ని మళ్ళీ బూచిగా చూపించి దానినుంచి పరిష్కారంగా ఆర్గానిక్ ఫుడ్స్ వంటివి ముందుకు తెచ్చి దానిని ఒక పెద్ద వ్యాపార రంగంగా చేస్తున్నారు.

**మతం, మూఢ విశ్వాసాలు :** ప్రపంచీకరణ క్రమంలో అన్ని మతాల ప్రజలలోనూ మత సంబంధిత కార్యకలాపాల్లో పాల్గొనడం బాగా పెరిగింది, శాస్త్ర సాంకేతికాభివృద్ధి వలన సమాజంలో భౌతికవాద దృక్పధం బలపడాలి. కాని ప్రపంచీకరణ క్రమం దానికి భిన్నమైన దిశగా సమాజాన్ని ప్రభావితం చేయగలుగుతోంది. మత సంబంధిత ఉత్సవాలు, ఆరాధనలు, వాటికి పెరుగుతున్న ప్రచారం, వాటి ఆధారంగా జరుగుతున్న వ్యాపారం బలంగా ప్రభావం చూపుతున్నాయి. దేవాలయాల సందర్శన టూరిజం పరిశ్రమలో ఒక ప్రధాన భాగం అయింది. కార్పొరేట్లకు లాభాలను తెచ్చిపెట్టడమే గాక భావజాల ఆధిపత్యాన్ని కొనసాగించడానికి తోడ్పడుతోంది. మూఢవిశ్వాసాలు ఈ వాతావరణంలో మళ్ళీ పెరుగుతున్నాయి. వాస్తు, రంగురాళ్ళు, హస్త సాముద్రికం, రక్షరేకులు వంటివి కార్పొరేట్ వ్యాపారస్థాయిలో సాగుతున్నాయి.

> **❝ ప్రపంచీకరణ క్రమంలో అన్ని మతాల ప్రజలలోనూ మత సంబంధిత కార్యకలాపాల్లో పాల్గొనడం బాగా పెరిగింది, శాస్త్ర సాంకేతికాభివృద్ధి వలన సమాజంలో భౌతికవాద దృక్పధం బలపడాలి. కాని ప్రపంచీకరణ క్రమం దానికి భిన్నమైన దిశగా సమాజాన్ని ప్రభావితం చేయగలుగుతోంది. ❞**

**వినోదం** ఒక సరుకుగా మారిపోయింది. మత విషయిక కార్యకలా పాలు, ధ్యానం వంటివి కొంత సమయాన్ని మాత్రమే తీసుకోగలవు. తక్కిన విశ్రాంతి సమయాన్ని టివి, ఫేస్బుక్ ఆక్రమిస్తున్నాయి.

వినిమయ సంస్కృతి బలపడడంతో బాటు ఆ సరుకుల కొనుగోలుకు రుణాలు కూడా విరివిగా లభిస్తున్నాయి. దాంతో భవిష్యత్ కాలపు కొనుగోలుశక్తిని కూడా ఇప్పుడే వెచ్చించి వస్తువులను సమకూర్చుకుంటున్నారు. వాటిని ఉపయోగించడంలో సమయం వెచ్చిస్తున్నారు. మన విశ్రాంతి సమయం, కుటుంబ జీవితపు సమయం సైతం మన చేతుల్లో లేకుండా పోతోంది. పెట్టుబడిదారుడి దగ్గర పని చేసే 8 గంటల సమయమే గతంలో మన స్వంతం కాదు. కాని ఇప్పుడు మేలుకుని ఉన్నంతసేపూ ఆ సమయం మొత్తం మనది కాకుండా పోతోంది. పరాయీకరణ సంపూర్ణం అవుతోంది.

**ప్రపంచీకరణా కార్మికవర్గం**

క్రమక్రమంగా పెట్టుబడికి వ్యతిరేకంగా శ్రమశక్తి ఐక్యం కావడం వర్గపోరాటాన్ని ముందుకు తీసుకుపోడానికి తోడ్పడుతుంది. ఐక్య కార్మిక శక్తి మూడోవంతు ప్రపంచాన్ని విముక్తి చేసేవరకూ పోయింది. ప్రపంచాన్ని ఫాసిజం నుంచి రక్షించింది. కాని ప్రపంచీకరణ క్రమం కార్మికవర్గాన్ని ముక్కలు ముక్కలుగా చేసింది.

పెర్మనెంటు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, హోమ్ బేస్డ్, ఫ్రాంచైజీ, ఇలా పని నిబంధనల రీత్యా పలు చీలికలు ఏర్పడ్డాయి. అందరూ ఒకే యూనియన్‌లో ఐక్యంగా సంఘటితం కావడానికి తీవ్ర అవరోధంగా ఉంది. కార్మికవర్గ ఐక్యత అనేది వర్గ సంస్కృతిలో ఒక భాగం. దానిని దెబ్బ తీస్తోంది ప్రపంచీకరణ.

ప్రపంచీకరణ కార్మికులను దూర దూర ప్రాంతాలకు తరిమివేస్తోంది. ఎక్కడ లభించే ఉద్యోగాలు అక్కడి స్థానికులకు గాక ఇతరులకు ఇస్తున్నారు. దీనివలన స్థానికేతరులు కార్మికోద్యమాలలోకి రావడానికి సిద్ధం కావడం లేదు. స్థానికులు వారిని పట్టించుకునే పరిస్థితి లేదు. పుట్టి పెరిగిన ప్రాంతానికి దూరం కావడమే గాక, పని చేస్తున్న ప్రాంతపు ప్రజలతో, తోటి కార్మికులతో కలిసిపోలేని దుస్థితి వచ్చింది. వర్గ ప్రతిఘటన బలహీనపడడమే గాక శ్రామిక ప్రజాసంస్కృతి కూడా కకావికలు అయిపోతోంది.

**పపంచీకరణ – విద్య**

విద్య సమగ్ర వ్యక్తిత్వాన్ని, సామాజిక స్పృహను కలిగించేదిగా ఇదివరకు ఉండేది. ఇప్పుడు సామాజిక శాస్త్రాలు, సాహిత్యం, తత్వ శాస్త్రం, లలిత కళలు వంటివి పనికిమాలిన బోధనాంశాలుగా పరిగణించబడుతున్నాయి. ఉపాధ్యాయుడు – విద్యార్థి అన్న సంబంధం బలహీనపడింది. ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తే మంచి చదువు వచ్చేస్తుంది అన్న అభిప్రాయం బలపడింది. విద్యను నేర్చుకోవడం అనేది ప్రధానంగా లేదు. ర్యాంకులు సాధించడమే పరమావధి. అధ్యయనం, పరిశోధన వంటివి తమ విలువను కోల్పోతున్నాయి. విద్యాసంస్థల్లో కనీస ప్రజాస్వామ్య చైతన్యాన్ని కలిగించే బోధన, బోధనేతర కార్యకలాపాలు ఉండేవి. కాని విద్య ఒక వ్యాపారంగా మారిపోయాక సామాజిక చైతన్యం గాని, కనీసం ప్రశ్నించే శక్తి గాని, సమిష్టి తత్వం గాని ఏ మాత్రమూ లేని విధంగా యువత తయారౌతున్నారు. పెట్టుబడిదారులకు తలొంచి పని చేసే కార్మికులుగా, ఉద్యోగులుగా మాత్రమే వారు తయారౌతున్నారు. మన దేశ ప్రత్యేకతలతో కూడిన ఉన్నత విద్యను అందించే విశ్వవిద్యాలయాలు బలహీనపడుతున్నాయి. విదేశీ మూస చదువులు పెరిగాయి. విదేశీ విద్య పట్ల మోజు పెరిగింది. దానితోబాటు సామ్రాజ్యవాదం పట్ల కూడా సానుకూలత పెరుగుతోంది. ఇది మన దేశ స్వాతంత్ర్యానికే ముప్పు.

**ప్రపంచీకరణ, మహిళలు**

ఫ్యూడల్ సమాజపు పురుషాధిక్యత, దురాచారాలు కొనసాగడంతో బాటు పెట్టుబడిదారీ సంస్కృతి సైతం మహిళను పరాధీనగా, వంటింటి కుందేలుగానే ఉంచింది. కార్పొరేట్లకు స్వేచ్ఛ కల్పించిన ప్రపంచీకరణ మహిళకు స్వేచ్ఛనివ్వలేదు సరికదా మరింతగా తనకు తానే స్వచ్ఛందంగా మహిళ పురుషాధిక్యతను ఆమోదించేటట్లు ప్రభావితం చేస్తోంది. వాణిజ్య ప్రకటనలు సాంస్కృతికంగా మహిళ స్థాయిని దిగజార్చుతున్నాయి. వినిమయ సంస్కృతి మహిళ దృక్పధాన్ని , మహిళల పట్ల పురుషుల దృక్పధాన్ని అంతకంతకూ సంకుచితం

> **"సామాన్య ప్రజానీకం తరపున మొనగాడిగా నిలిచే కార్మికవర్గం ఆ ప్రజానీకం పాల్గొనే కార్యకలాపాలకూ దూరంగా ఉండరాదు. ప్రజలు విలువైనవిగా భావించే, ఇష్టపడే వాటినన్నింటినీ మనం గుర్తించి తగిన విలువనివ్వాలి. వాటిలో జోక్యం చేసుకోవాలి. ఆ క్రమంలో వాటిని మార్చి పురోగామి దిశవైపు నడిపించాలి."**

చేస్తోంది. ప్రాచీన పురుషాధిక్య విలువలతో ఆధునిక దోపిడీ, వినిమన సంస్కృతి విలువలు కలగలిసిపోయి ఒక విషసంస్కృతి చెలరేగుతోంది.

ఈ వినిమయ సంస్కృతికి మహిళ దేహాన్ని కూడా ఒక సరుకుగా బలి చేస్తోంది ప్రపంచీకరణ. అందానికి దేహపు కొలతలే, దుస్తులకు వాడే సబ్బే, ఉపయోగించే సౌందర్యసాధనాలే కొలబద్దలుగా మారిపోయాయి. దానితోబాటు పురుషులను ఆనందపరచడమే స్త్రీల జీవిత లక్ష్యం అన్న పురుషాధిక్య భావన కూడా అంతర్లీనంగాను, బాహాటంగాను ప్రచారం అయిపోతోంది.

ఇక మతం, సాంప్రదాయాలు సైతం ప్రపంచీకరణ క్రమంలో మార్కెట్ సరుకులు అయిపోయాక, ఆ ప్రభావం మహిళలమీద మరింత ఎక్కువగా పడుతోంది.

సినిమాలలో, టివి సీరియళ్ళలో మహిళా పాత్రల చిత్రీకరణ అత్యధిక సందర్భాలలో మహిళల అస్థిత్వాన్ని కించపరిచేదిగానే ఉంది.

**భారతీయ సంస్కృతి :** భారతీయ సంస్కృతి అనేది ఒకే మూసలో పోసినట్లు ఉండే ఏకరూప సంస్కృతి కాదు. వేల సంవత్సరాల కాలంలో బహు ప్రాంతాలలో వైవిధ్యంతో రూపొందింది. 1985లో ఆంత్రొపాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మన దేశంలో4635 తెగలు తమ తమ ప్రత్యేకతలతో ఉన్నాయని, 12 భాషా కుటుంబాలకు చెందిన 325 భాషలు ఉన్నాయని, 23 లిపులు ఉన్నాయని, సాంస్కృతికంగా 91 జోన్లు ఉన్నాయని గుర్తించింది. దీనిని బట్టి భారతదేశ సంస్కృతి బహుళత్వం అర్థం చేసుకోవచ్చు.

ఈ బహుళత్వం నేటికీ కొనసాగుతున్నదంటే దానికి కారణం భిన్న సంస్కృతుల ప్రజానీకం నడుమ ఇచ్చిపుచ్చుకునే ధోరణి, సమన్వయ ధోరణి ఉండడమే. అదే సమయంలో ఈ బహుళత్వంలోనే అణచివేత కూడా కొనసాగుతోందన్న విషయాన్ని కూడా గమనించాలి.

సమాజంలో ఆధిపత్య వర్గాలు ఏర్పడిన క్రమంలో మన సంస్కృతిలో ఆ వర్గాల మధ్య ఉండే వైరుధ్యాలు ప్రతిబింబించాయి. సమానత్వ భావనలకు ప్రతిరూపంగా ఉండే సంస్కృతికి, మానవులనడుమ ఉచ్చ, నీచాలను పాటించే ఆధిపత్య సంస్కృతికి నిరంతర ఘర్షణ కూడా కొనసాగింది. ఈ ఘర్షణ క్రమంలోనుంచి కొత్త మతాలు, కొత్త ఆచారాలు పుట్టుకొచ్చాయి. బ్రాహ్మణ మతానికి, తక్కిన మతాలకు నడుమ ఘర్షణలు కొనసాగాయి. బలహీనవర్గాల ప్రయోజనాలను ప్రతిబింబించే కొత్త ప్రబోధకులు, కొత్త విశ్వాసాలు తలెత్తాయి. ఇవన్నీ తాత్విక రంగంలోనూ ప్రతిబింబించాయి. అనాదికాలం నుండీ మన ఉపఖండంలోకి ఇతర దేశాలనుండి అనేక తెగలు వస్తూనేవున్నాయి. అలా వచ్చిన తెగల ప్రజలు వారితోబాటు వారి విశ్వాసాలను, మత ఆచారాలను కూడా తీసుకొచ్చారు. వాటికి, స్థానికంగా అప్పటికే ఉన్నవాటికి నడుమ సంపర్కం, ఘర్షణ జరుగుతూవచ్చాయి.

మొత్తంగా చూసినప్పుడు భిన్న మత విశ్వాసాల, భిన్న ప్రాంతాల ప్రజల నడుమ పరస్పర సహకారం, సమన్వయం ప్రధానధోరణిగా ఉంటే ఆయా కాలాల్లోని వివిధ ఆధిపత్య తరగతుల నడుమ ఘర్షణలు ప్రధాన ధోరణిగా కనిపిస్తాయి.

భారతదేశపు సాంస్కృతిక బహుళత్వం 1980 దశకం నుండీ హిందూత్వ సాంస్కృతిక జాతీయ వాద శక్తులనుండి ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. దీనిని ప్రజలందరినీ సాంస్కృతికంగా జాగృతం చేయాలి. ఆ క్రమంలోనే ప్రత్యామ్నాయ సంస్కృతి బలపడుతుంది.

### గతకాలపు సంస్కృతి – మన వైఖరి

గతకాలపు సాంస్కృతిక జీవితాన్ని, రూపాలను మొత్తంగా తిరస్కరించడమో, లేక యధాతథంగా అనుసరించడమో చేయడం సరైన విధానం కాదు. వాటి చారిత్రిక క్రమాన్ని అవగతం చేసుకుంటూ, మనం తగు ఎత్తుగడలను రూపొందించుకోవాలి.

అభ్యుదయ సాహిత్యకారులలో1930 దశకంలో ఒక ధోరణి ఉండేది. రామాయణం, భారతం వంటివి అభివృద్ధి నిరోధక సాహిత్యంగా వారు పరిగణించేవారు. ఇది ఒక రకంగా చెప్పాలంటే ఆధునిక కార్మిక వర్గం ఆవిర్భవించేవరకూ ఉండిన సంస్కృతి, సాహిత్యం అంతా అభివృద్ధి నిరోధకం అని, అందుచేత దానినంతా తిరస్కరించాలని చెప్పడమే.

సమాజంలో ఒక కొనసాగింపు ఉంటుంది. అదే సమయంలో గతం నుండి విడగొట్టుకుని ముందడుగు వేయడమూ ఉంటుంది. సమాజ అభివృద్ధి క్రమం గతితార్కికం. ఈ క్రమంలో ఆవిర్భవించిన ఆధునిక కార్మికవర్గం మానవత్వానికి అత్యుత్తమ ప్రతినిధిగా ఉంటుంది. అందుచేత ఈ వర్గం ఇంతవరకూ మానవసమాజం సాధించిన విజయాలకు, అత్యుత్తమమైన వాటన్నింటికీ వారసురాలిగా, ప్రతినిధిగా ఉంటుంది. అంతేకాదు, వాటన్నింటినీ మరింత పెంపొందించి ముందుకు తీసుకుపోవలసిన బాధ్యత కూడా ఆ వర్గం పైనే ఉంది. అందుచేత గతంలోని ఏయే భాగాలైతే మానవ సమాజ ప్రగతిశీల గమనానికి దోహదం చేస్తాయో, వాటన్నింటినీ కార్మికవర్గం స్వీకరించాలి. వాటిని మరింత పెంపొందించాలి. అంటే గతంలోని సంస్కృతిలో మనం స్వీకరించాల్సిన భాగమూ ఉంటుంది, అదేవిధంగా తిరస్కరించాల్సిన భాగమూ ఉంటుంది.

సామాన్య ప్రజానీకం తరఫున మొనగాడిగా నిలిచే కార్మికవర్గం ఆ ప్రజానీకం పాల్గొనే కార్యకలాపాలకూ దూరంగా ఉండరాదు. ప్రజలు విలువైనవిగా భావించే, ఇష్టపడే వాటినన్నింటినీ మనం గుర్తించి తగిన విలువనివ్వాలి. వాటిలో జోక్యం చేసుకోవాలి. ఆ క్రమంలో వాటిని మార్చి పురోగామి దిశవైపు నడిపించాలి.

రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాల మూలాలు సామాన్యజనంలోనే ఉన్నాయి. మొదట్లో వీటిని వైదిక మతం పరిగణనలోకి తీసుకోడానికి నిరాకరించింది. బ్రాహ్మణాధిపత్య సంస్కృతికి, పీడనకు, వివక్షకు నిరసనగా సామాన్య ప్రజల్లో తలెత్తిన భక్తి ఉద్యమం వైదిక మతాచారాలను పక్కనబెట్టి రాముడు, కృష్ణుడు, శివుడు, ఆదిశక్తి వంటి దేవతల ఆరాధనకు పూనుకోవడంతో వైదికమతం ఆ దేవతలను సైతం తన పరిధిలోకి తెచ్చుకుంది. ఈ క్రమంలో ఇప్పుడు

రామాయణ భారతాలు అగ్రకులాల కుటుంబాల సంస్కృతిలో భాగం అయిపో యాయి. హైందవేతరులు గాని, తక్కువస్థాయి కులాలుగా పరిగణింపబడేవారు గాని వాటికి దూరం అయిపోయారు. ఇదే మాదిరిగా వివిధ కళారూపాలు తొలుత సాధారణ ప్రజానీకం నుండే పుట్టుకొచ్చినా, వాటికి ఆధిపత్య శక్తులు క్రమంగా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. ఆ తర్వాత తమ పోషణలో వాటిని కృత్రిమ సొగసులతో, హంగులతో నింపివేశాయి. ఉదా: శాస్త్రీయ సంగీతం, భరతనాట్యం, హరికథ వగైరా. మధ్య యుగాలలో ఈ ప్రత్యేక నైపుణ్యం గల కళాకారులు, విద్వాంసులు, పండితులు ఆధిపత్య కులాలనుండే వచ్చారు. హిందూ లేదా ముస్లిం మేథావులు సాంస్కృతిక, సాహిత్య రంగాలలో అటువంటి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. అందుచేత అవి సంస్కృతం ప్రధాన భాషగానో, లేక పర్షియన్ ప్రధాన భాషగానో ఉండేవి. అవి సామాన్య ప్రజానీకానికి దూరం అయిపోయాయి.

వైదిక సంస్కృతిలో యజ్ఞాలు, కర్మకాండలు ప్రధాన రూపం. దానికి ప్రత్యామ్నాయంగా సామాన్య ప్రజలు భక్తి ఉద్యమంలో భాగంగా దేవతలకు ఆలయాలను కట్టి వాటిలో పూజలు చేయడం ప్రారంభించారు. బౌద్ధ, జైన ఆరామాలు సైతం విస్తరించాయి. అట్టడుగు కులాలు తమవైన దేవతలను ప్రతిష్టించుకుని తమ స్వంత ఆరాధనా పద్ధతులను అనుసరించడం ప్రారంభించాయి. ఈ దేవాలయాలు, ప్రార్థనా స్థలాలు ప్రజాసంస్కృతికి కేంద్రాలుగా ఉండేవి. ఇప్పటికీ వాటి ధోరణులు మనకు జాతరలలో, ఉర్సులలో, నవరాత్రులలో, దీక్షలలో కనిపిస్తాయి. ఐతే, ఆధిపత్య కులాలు చాలావరకూ దేవాలయాలను, ప్రార్థనాస్థలా లను తమ ఆధీనంలోకి క్రమంగా తెచ్చుకున్నాయి. వాటి నిర్వహణ ఆధిపత్య కులాల చేతుల్లోకి క్రమంగా పోయింది.

ఈ నేపథ్యంలో మనం ప్రాచీన. జానపద కళలను, సంస్కృతిని చూడాలి. వాటన్నింటినీ ఆధిపత్య సంస్కృతిగా పరిగణించి వాటికి దూరంగా ఉండడం అంటే ఆ కార్యకలాపాల్లో పాల్గొనే కోట్లాది సామాన్య ప్రజానీకాన్ని పాలకవర్గ ఆధిపత్య భావజాలపు ప్రభావంలో కొనసాగేదానికి తోడ్పడడమే ఔతుంది.

మన జానపద కళారూపాలలో, ఉత్సవాలలో కుల వివక్షతను, భూస్వామ్య ఆధిపత్యాన్ని అవహేళన చేస్తూ, విమర్శిస్తూ చాలా అంశాలు మనకు కనిపిస్తాయి. స్త్రీల సమస్యలను వ్యక్తం చేసే రూపాలు కూడా చాలా ఉన్నాయి. వాటన్నింటినీ గుర్తించి ఫోకస్‌లోకి తేవాలి.

❝ మానవ సమాజ నిర్మాణంలో పునాదిగా ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి శక్తులు ఉంటాయి. ఉత్పత్తి, పంపిణీ విస్తృతం కావడంతో ఈ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా, ఆర్థిక శక్తులుగా వ్యక్తం ఔతున్నాయి. ఈ పునాదిపైన దానిని కాపాడే రాజ్యాంగయంత్రం ఉంటుంది. సంస్కృతి కూడా ఈ పునాదిపైనే నిర్మితం ఔతుంది. ❞

### ఆర్థిక వ్యవస్థ – భావజాల అంశాలు : పరస్పర సంబంధం

మానవ సమాజం ఒక సంక్లిష్ట పరిణామ క్రమంలో కొనసాగుతూవుంటుంది. ఈ క్రమంలోనే మానవులు ఆర్థిక, రాజకీయ, తాత్విక, సాంస్కృతిక, శాస్త్ర విజ్ఞానాల నన్నింటినీ రూపొందించుకుంటు న్నారు. అవన్నీ ఎంతో కొంతమేరకు వ్యక్తి మీద ప్రభావం చూపుతాయి. అతని, లేదా ఆమె నడవడికలో అవన్నీ ప్రతిఫలిస్తాయి. ఉదా: ఆర్థికాంశాలమీద మనిషి స్పందనను ఆ మనిషి తాత్విక దృక్పథం ప్రభావితం చేస్తుంది. అదే సమయంలో ఆర్థికాంశాలు కూడా ఆ మనిషి తాత్విక దృక్పథం మీద ప్రభావం చూపుతాయి.

మానవ సమాజ నిర్మాణంలో పునాదిగా ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి శక్తులు ఉంటాయి. ఉత్పత్తి, పంపిణీ విస్తృతం కావడంతో ఈ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా, ఆర్థిక శక్తులుగా వ్యక్తం ఔతున్నాయి. ఈ పునాదిపైన దానిని కాపాడే రాజ్యాంగయంత్రం ఉంటుంది. సంస్కృతి కూడా ఈ పునాదిపైనే నిర్మితం ఔతుంది.

ఒక భవనం మాదిరిగా, చలనరహితంగా ఉండే విధంగా ఈ సూత్రాన్ని అర్థం చేసుకుంటే మనం చాలా పొరపాటు పడతాం. సమాజాన్ని మార్చడం అంటే భవనాన్ని కూల్చి అంతకన్నా మెరుగైన భవనాన్ని నిర్మించడం వంటిదే అనే యాంత్రిక దృక్పథం లోకి జారిపోతాం. భవనాన్ని కూల్చడానికి దాని పునాదిని కూల్చడం పైన కేంద్రీకరిస్తే సరిపోతుంది అనుకుంటాం. కాని మానవ సమాజం చలనశీలమైనది, నిత్యం మార్పులకు లోనవుతూవుంటుంది. పునాదిలో జరిగే మార్పుల ప్రభావం ఉపరితలంలో జరిగే మార్పుల క్రమాన్ని నిర్ధారిస్తుంది అన్నది వాస్తవం. అదే సమయంలో ఉపరితలంలో ఉండే సంస్కృతి కూడా పునాదిలో జరిగే మార్పులను ప్రభావితం చేస్తుంది. ఉదా:

(1) ఉత్పత్తిని అభివృద్ధి చేయడం పట్ల విముఖతను మిధ్యావాదం పెంచింది.

(2) బౌద్ధం తెగల నడుమ జరిగే ఘర్షణలను, యజ్ఞాలను వ్యతిరేకించి వ్యవసాయాన్ని విస్తరింపజేయడానికి దోహదం చేసింది.

(3) వినిమయ తత్వం ప్రపంచీకరణ క్రమాన్ని ప్రజలు వేగంగా స్వీకరించడానికి దోహదం చేసింది.

పునాదిలో జరిగే మార్పులకు అనుగుణంగా మాత్రమే ఉపరితలంలో మార్పులు ఉంటాయి అని చెప్పలేము. అనేకసార్లు ముందు ఉపరితలంలో మార్పులు మొదలై అవి పునాది సంబంధాలను మార్చేందుకు దారి తీస్తాయి కూడా.

శాస్త్ర విజ్ఞాన ఆవిష్కరణలు జరిగాక బూర్జువా ప్రజాతంత్ర విప్లవాలు వచ్చాయి. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి వేగవంతం కావాలన్న ఆకాంక్షలు శాస్త్ర విజ్ఞాన అభివృద్ధిని ప్రోత్సహించాయి. ఈ క్రమాన్ని పరిశీలిస్తే పునాది, ఉపరితలం ఒకదానినింకొకటి ఏవిధంగా ప్రభావితం చేస్తాయో బోధపడుతుంది. పునాదికి, ఉపరితలానికి నడుమ ఉన్నది గతితార్కిక సంబంధం. అందుచేత పునాదే ముఖ్యం, ఉపరితలం గురించి పెద్దగా పట్టించుకోనవసరం లేదు అన్న అభిప్రాయం తప్పు.

ప్రజల ఆర్థిక సమస్యలను పట్టించుకుంటే చాలు, వారి అభిప్రాయాలు ఎప్పటికైనా మారి సమాజాన్ని మార్చడానికి మనతో కలిసివస్తారు అన్న భావన ఇటువంటి పొరపాటు భావనే.

పునాదిని, ఉపరితలాన్ని విడదీసే గీత ఏదీ లేదు. సాహిత్యం ఉపరితలంలో భాగం. కాని పుస్తకాల ప్రచురణ, పత్రికల నిర్వహణ ఉత్పత్తిలో భాగం. సినిమా రంగం కళకు సంబంధించినది. కాని సినిమా ఒక పరిశ్రమ కూడా. వంట ఉత్పత్తికి సంబంధించినది. కాని పాకశాస్త్రం ఒక కళ కూడా. మతం ఉపరితలానికి చెందిన ఒక విశ్వాసం. కాని అది ఇప్పుడు ఒక పెద్ద పరిశ్రమ అయింది.

అందుచేత పునాది – ఉపరితలం అనే భావాలను మనం సరిగ్గా అర్థం చేసుకోవాలి.

**❝ ఒక రచన చేయడానికి గాని, ఒక కళారూపాన్ని రూపొందిచడానికి కాని వారి సృజనాత్మకత చాలా ముఖ్యం. అందుచేత కళను సృష్టించడమే ముఖ్యం తప్ప దాని ప్రయోజనం ప్రధానం కాదు అనో, కళకు ప్రయోజనం సమాజపు గుర్తింపు అనో అనుకోవడం జరుగుతుంది. ఇక కళ వ్యాపారంగా మారాక కళ కాసులకోసమే అన్నది కూడా వచ్చింది. ❞**

పునాది రంగాల్లోనే గాక ఉపరితలరంగాల్లో కూడా మనం జోక్యం చేసుకోవాలి. కొన్ని సందర్భాలలో ఉపరితల రంగాలలో – సాంస్కృతిక రంగంలో, భావజాల రంగంలో – చేయవలసిన కృషికి ఆర్థిక రంగంలో చేయవలసిన కృషి కన్నా ఎక్కువ ప్రాధాన్యత ఏర్పడవచ్చు. వాస్తవానికి ప్రస్తుతం మనం అటువంటి స్థితిలోనే ఉన్నాం.

**కళ కళ కోసమే అనే వాదన**

మానవ సమాజంలో శారీరక, మానసిక శ్రమల మధ్య విభజన జరిగిన అనంతరమే కొంతమంది వ్యక్తులు ప్రత్యేకించి ఆయా సాంస్కృతిక రంగాలలో కేంద్రీకరించి పని చేయగల స్థితి వచ్చింది. సమాజం దోపిడీ దారులుగా, దోపిడీ చేయబడేవారుగా చీలిన అనంతరమే ఈ పరిణామం జరిగింది. అంతవరకూ చాలా మొరటు రూపాలలో ఉండిన వివిధ రూపాల కళలు, సాహిత్యం ఈ ప్రత్యేక కృషి ఫలితంగా మెరుగులు దిద్దుకున్నాయి.

వర్గ సమాజంలో వర్గ వైరుధ్యాలు కొన్ని రంగాలలో (ఉత్పత్తి రంగాలు వంటివి) స్పష్టంగా వ్యక్తం ఔతాయి. కాని అలా స్పష్టంగా వ్యక్తం కాని రంగాలు చాల ఉంటాయి. చాలా భావాలు, సిద్ధాంతాలు పైకి చూస్తే ఏ ఒక్క వర్గానికో చెందినవిగా కనిపించవు.

శ్రమజీవుల సమిష్టి సృజనతో మొదలైన కళ శారీరక, మానసిక శ్రమ విభజన తర్వాత ఉత్పత్తితో, సామాన్య ప్రజలతో సంబంధంలేనిదిగా పరిగణింపబడడం మొదలైంది. సంగీతం యావత్తూ ఓంకారం నుండి వచ్చినదని, నాట్యం నటరాజు నుండి వచ్చినదని, విద్యకు మూలం సరస్వతి అని – ఇలా చెప్పి సామాన్య ప్రజానీకాన్ని కళలకు దూరంగా పెట్టే సిద్ధాంతాలు వచ్చాయి. వాటిలో ఒకటి 'కళ కళ కోసమే.' అన్న సిద్ధాంతం. కాని వాస్తవం వేరు. కళ అనేది ఒక సామాజిక ఉత్పత్తి. అది సామాజిక పరిణామాలను వేగవంతం చేయడమో, లేక ఆటంకపరచడమో చేసే పాత్రను పోషిస్తుంది. ఆధిపత్య వర్గాలు తప్పనిసరిగా కళను తమ వర్గ దోపిడీని కొనసాగించడానికి ఒక సాధనంగా వాడుకుంటాయి. అదే విధంగా దోపిడీకి గురయే వర్గాలు కూడా వర్గ ప్రతిఘటనలో ప్రజలను చైతన్యపరచడానికి కళను ఏదో ఒక మేరకు ఉపయోగిస్తాయి. అందుచేత ఏ కళాకారుడూ, ఏ రచయితా ఈ వర్గ పోరాటానికి అతీతంగా ఉండలేరు. ఏదో ఒకవైపు ఉండాల్సిందే.

కాని చాలామంది కళాకారులకు, రచయితలకు ఈవర్గ దృక్పథం ఉండకపోవచ్చు. అందుచేత అటువంటివారు తాము ఈ వర్గాలకు అతీతులమని భావించవచ్చు.

పైగా ఒక రచన చేయడానికి గాని, ఒక కళారూపాన్ని రూపొందిచడానికి కాని వారి సృజనాత్మకత చాలా ముఖ్యం. అందుచేత కళను సృష్టించడమే ముఖ్యం తప్ప దాని ప్రయోజనం ప్రధానం కాదు అనో, కళకు ప్రయోజనం సమాజపు గుర్తింపు అనో అనుకోవడం జరుగుతుంది. ఇక కళ వ్యాపారంగా మారాక కళ కాసులకోసమే అన్నది కూడా వచ్చింది.

కళ ప్రజలకోసమే అని గుర్తించడం కళాకారులకు ఎంత అవసరమో, కళాకారులకుండే సృజన ప్రాధాన్యతను, వారి సైద్ధాంతిక పరిమితులను దృష్టిలో ఉంచుకుని వ్యవహరించడం కమ్యూనిస్టులకూ అంతే అవసరం.

**మార్క్సిస్టు రసజ్ఞత (ఈస్థటిక్స్)**

మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం కలిగివుండి, సృజనాత్మకంగా కళారూపాల సృష్టి చేయడం, తక్కిన అన్ని కళారూపాలనూ విచక్షణతో పరిశీలించి వాటి మంచి చెడులను గ్రహించి ఆస్వాదించడం మార్క్సిస్టు రసజ్ఞత అవుతుంది.

సాహిత్యంలో, తక్కిన కళారూపాలలో విప్లవ సారాంశానికి ప్రాధాన్యతనివ్వాలా? లేక ఆ కళారూపం యొక్క రసానుభూతికి ప్రాధాన్యతనివ్వాలా? అన్న ప్రశ్న అభ్యుదయ సాంస్కృతికోద్యమంలో తలెత్తింది.

గోర్కీ ఈ రెండింటికీ మధ్య ఏ సంఘర్షణా ఉండనవసరం లేదని స్పష్టం చేశాడు. గొప్ప సౌందర్యవంతమైన, రస ప్రేరితమైన కళారూపాలను సృజించిన కళాకారులు ఆ రూపాలలోనే మానవసమాజ సమిష్టితత్వానికి అత్యంత ప్రాధాన్యతను కల్పించారు అని తెలిపాడు. సౌందర్యవంతమైన కళారూపం, దాని విప్లవ సారాంశం ఒకదానినింకొకటి బలపరుచుకుంటాయే తప్ప ఒకదానికొకటి పోటీ కాదు అని వివరించాడు.

''ఒక రచయిత ఒకానొక దుకాణదారుడిని యథాతథంగా తన రచనలో అన్ని కోణాలనుండీ చూపగలిగాడనుకుందాం. అప్పుడది ఆ దుకాణదారుడి వివరాల నివేదిక అవుతుందే తప్ప ఒక కళారూపం కానేరదు. అదే ఆ రచయిత ఒక 20, 50 లేదా 100 మంది దుకాణదారులను పరిశీలించి ఆ వర్గ ప్రజల ఉమ్మడి స్వభావాన్ని గ్రహించి వారి అలవాట్లను, అభిరుచులను, హావభావాలను, విశ్వాసాలను, సంభాషణ తీరును ఒక దుకాణదారుడి పాత్ర ద్వారా తెలియజెప్పితే అది ఒక పాత్రను సృష్టించడం ఔతుంది. అంటే అది ఒక కళారూపం ఔతుంది." అని ఉదహరించాడు గోర్కీ.

అందుచేత కళారూపం లోని విప్లవ సారానికి, రసానుభూతి కలిగించగలిగే దాని రూపానికి పోటీ పెట్టకూడదు. నిజానికి ఆ విప్లవసారం గాని, దాని రూపం గాని రెండూ ప్రజలనుండి సృష్టించబడినవే. తొలుత ప్రకృతితో తలపడిన క్రమంలో, ఆ తర్వాత దోపిడీ వర్గాలతో తలపడే క్రమంలో ప్రజలనుండి సౌందర్య రసానుభూతితో కూడిన విప్లవసారాంశం కల కళారూపాలు సృజించబడతాయి.

**కళాకారుడు – కళ**

వ్యక్తి, సమాజం, భౌతిక ప్రపంచం అన్నీ పరస్పరం సన్నిహితంగా, విడదీయలేనంతగా కలిసివుంటాయి. కాని కమ్యూనిస్టేతర సిద్ధాంతవేత్తలు వ్యక్తిని సమాజానికి అతీతంగా పరిగణిస్తారు. చుట్టూవున్న ప్రపంచంతోగాని, సమాజంతోగాని నిమిత్తం లేకుండా ఒకానొక కళాకారుడి ప్రజ్ఞను, సృజనను చూడాలి అని అంటారు. అతడి లేదా ఆమె ప్రజ్ఞ, సృజన స్వతఃసిద్ధంగానే, పుట్టుకతోటే వారికి సంక్రమిస్తాయి అంటారు. గొప్ప గొప్ప వ్యక్తులే చరిత్రను సృష్టిస్తారు అంటారు.

"మానవుల చైతన్యం వారి అస్తిత్వాన్ని నిర్ణయించదు. దానికి భిన్నంగా, వారి సామాజిక అస్తిత్వమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది." అని మార్క్స్ చెప్పాడు.

(మిగతా 32వ పేజీలో)

జాతీయ పరిణామాలు

# ఎన్నికల ప్రచారంలో అధోగతికి దిగజారిన మోడీ



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

ఎ కోటిరెడ్డి

"వంద ఎలుకలను తిన్న పిల్లి ఇక తపస్సు చేసుకుంటానన్న" చందంగా ప్రధాని నరేంద్ర మోడి వ్యవహరి స్తున్నాడు. రెండు మాసాలకు పైగా జరిగిన ఎన్నికల ప్రచారంలో తన స్థాయిని మరచి అబద్ధాలు, విద్వేషం పెంచటం లక్ష్యంగా ప్రచారం చేశాడు. ప్రచారం పూర్తికాగానే 45 గంటలు ధ్యానం చేయటం కోసమంటూ కన్యాకుమారి వెళ్ళాడు. కన్యాకుమారి వెళ్ళింది నిజంగా ధ్యానం చేయటం కోసమా లేక ధ్యానాన్ని కూడా ఒక 'జుమ్లా' గా వినియోగించుకొని ప్రజలను పిచ్చివాళ్ళను చేయటానికా? ఎన్నికల ప్రచారంలో వ్యవహరించిన తీరుతో పోగొట్టుకున్న ప్రతిష్ఠను కన్యాకుమారిలో 'ధ్యానం' పేరుతో తిరిగి సంపాదించు కోవచ్చునని మోడి భావిస్తుంటే అది పగటి కల అవుతుంది.

స్వాతంత్ర్యానంతరం దేశంలో అనేకమంది ప్రధాని పదవిని నిర్వహించారు. ప్రధానిగా ఉన్న వ్యక్తులు, వారి పార్టీలు ప్రతిపక్షాలతో, ఆయా పార్టీల నాయకులతో వివాద పడిన సందర్భాలూ ఉన్నాయి. కాని మోడి లాగా ఇంతగా దిగజారి ఆరోపణలు చేయటం, అబద్ధాలు చెప్పటం ఎవరూ చేయలేదు. ఇంతటి చౌకబారు ప్రచారం చేయటం ద్వారా ప్రధాని పదవికి ఉన్న గౌరవాన్ని మోడి దిగజార్చాడు. చివరి దశ ప్రచారంలో మరీ చౌకబారు ఆరోపణలు చేశాడు. ఒడిశాలో మాట్లాడుతూ నవీన్ పట్నాయక్ ఆరోగ్యంపై అబద్ధాలు చెప్పాడు. చివరికి జాతిపిత మహాత్మాగాంధిని కూడా వదలలేదు. గాంధిపై సినిమా తీసిన తర్వాతే ఆయనకు ప్రజలలో గుర్తింపు వచ్చిందని చెప్పాడు.

ప్రధాని ఇంతగా అబద్ధాలు చెబుతాడని, ఇంతగా దిగజారి మాట్లాడతాడని, ప్రజలు ఊహించలేదు. 10 సంవత్సరాలు అధికారంలో ఉండి తాము సాధించినదేమిటి, తిరిగి అధికారం అప్పగిస్తే దేశాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తారు అన్న అంశాలపై ప్రధాని ప్రచారం చేస్తాడని ప్రజలు భావిస్తారు. గతంలో దేశంలో అధికారంలో ఉన్న పార్టీలు, ప్రతిపక్షాలు ఇదే విధంగా ప్రచారం చేశాయి. ఈ ఎన్నికలలో కూడా మోడి, బిజెపి నాయకులు మినహా మిగతా పార్టీలు ఈ అంశాలపైనే ప్రచారం చేశాయి. దేశం, ప్రజలు ఎదుర్కొంటున్న నిరుద్యోగం, అధికధరలు, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు,పనికి తగిన కూలిరేట్లు, జీతాలు తదితర సమస్యలపై ప్రతిపక్షాలు చేసిన ప్రచారం ప్రజలను ఆకట్టుకున్నది. ప్రధాని, బిజెపి నాయకులు చేస్తున్న అబద్ధాలు, విద్వేష ప్రచారానికి ప్రజలు స్పందించలేదు. అయినప్పటికీ వారు చివరి వరకు ఇదే విధమైన ప్రచారాన్ని కొనసాగించారు. "కనకపు సింహాసనమున, శునకము గూర్చుండ బెట్టి శుభలగ్నమునన్, దొనరగ పట్టము గట్టిన, వెనుకటి గుణమేల మాను వినరా సుమతి" అని శతకకారుడు చెప్పినది అక్షరసత్యమని నిరూపించారు.

**అభివృద్ధి గురించి ఊదరగొడుగున్న బడా పెట్టుబడిదారీ సంస్థలు**

దేశంలో ఎన్నికలు జరగబోతున్న వాతావరణం ఏర్పడినప్పటి నుండి దేశ, విదేశాల్లోని బడా పెట్టుబడిదారీ సంస్థలు బిజెపి పాలనలో దేశం అభివృద్ధి సాధిస్తున్నదని, రాబోయే రోజులలో అభివృద్ధి శరవేగంతో పరుగులు పెడుతుందని ప్రచారం చేస్తున్నారు. మోడి పాలనలో అభివృద్ధి లేదనే వాస్తవాన్ని కప్పిపెట్టటం కోసం నానాపాట్లు పడుతున్నారు. సామ్రాజ్య వాదుల ఆధిపత్యంలో ఉన్న వివిధ సంస్థలు కూడా దీనిని బలపరిచే విధంగా నివేదికలను విడుదల చేస్తున్నాయి. రెండు పర్యాయాల తన పదవీ కాలంలో ప్రధాని మోడి పరిశ్రమలు, గనులు, అడవులు, పంటభూములు, నదులు, పోర్టులు, విమానాశ్రయాలు తదితర సమస్త సంపదలను పెట్టుబడిదారుల వరం చేయటానికి పూనుకున్నాడు. మోడి తిరిగి అధికారంలోకి వస్తే భారతదేశ వనరులను, సంపదలను మొత్తం అప్పనంగా ఆకాజేయవచ్చునని వీరు ఆశ పడుతున్నారు. తమకు అవసరమైన విధానాలను అనుసరిస్తున్న మోడి, బిజెపి లకు అనుకూలంగా ఓటర్లను ప్రభావితం చేయటానికి బహుళజాతి సంస్థలు, బడా పెట్టుబడిదారులు ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వసంస్థలు కూడా ఇదే విధమైన ప్రచారం చేస్తున్నాయి.

మోడి ప్రభుత్వం విజయం సాధించాలని భావిస్తున్న సంస్థలు దేశంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని తమ నివేదికలలో పేర్కొంటున్నాయి. సరుకుల తయారీ రంగం గురించి విడుదల చేసిన మార్చి నెల నివేదికలో మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ 16 సంవత్సరాలలో అత్యున్నతస్థాయికి పెరిగిందని పేర్కొన్నారు. గత 10 సంవత్సరాల నుండి అనుసరిస్తున్న విధానాలను కొనసాగిస్తే భారతదేశం 2047 వరకు సంవత్సరానికి 8 శాతం చొప్పున అభివృద్ధిని సాధిస్తుందని, మార్చి 28వ తేదీన ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణమూర్తి సుబ్రహ్మణ్యం పేర్కొన్నాడు.

**❝దేశంలో కనిపిస్తున్న వాస్తవాలకు భిన్నంగా ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు చెబుతున్న అంకెలు ఉంటున్నాయి. అభివృద్ధికి సంబంధించిన అంకెలను ప్రభుత్వం తొత్తడం చేస్తున్నదని, వాస్త వంగా జరిగిన దాని కన్నా రెండు శాతం అదనంగా అభివృద్ధి జరిగినట్లు చూయిస్తున్నదని నిపుణులు చెబుతు న్నారు. ప్రభుత్వ లెక్కలపై ఇంతకు ముందే విశ్వాసం సన్నగిల్లింది. ఇపుడు విడుదల చేస్తున్న ఈ తరహా లెక్కలతో పూర్తిగా నమ్మకం పోతుంది. ❞**

అంతకు ముందు ఐఎంఎఫ్ వేసిన అంచనాలలో కూడా 2024లో భారతదేశం 7.8 శాతం అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. ఎన్నికల సమయంలో మోడి ప్రభుత్వంపై ప్రజలకు సానుకూలత కల్పించాలన్న భావం దీని వెనుక ఉన్నది.

దేశంలో కనిపిస్తున్న వాస్తవాలకు భిన్నంగా ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు చెబుతున్న అంకెలు ఉంటున్నాయి. అభివృద్ధికి సంబంధించిన అంకెలను ప్రభుత్వం తొత్తడం చేస్తున్నదని, వాస్తవంగా జరిగిన దాని కన్నా రెండు శాతం అదనంగా అభివృద్ధి జరిగినట్లు చూయిస్తున్నదని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ లెక్కలపై ఇంతకు ముందే విశ్వాసం సన్నగిల్లింది. ఇపుడు విడుదల చేస్తున్న ఈ తరహా లెక్కలతో పూర్తిగా నమ్మకం పోతుంది.

ఒకవైపు పెరుగుతున్న ధరలతో సాధారణ ప్రజలకు బ్రతుకు పోరాటం కష్టంగా మారుతుండగా మరోవైపు దేశ అభివృద్ధిని గురించి బిజెపి నాయకులు కట్టుకథలు చెబుతూ ప్రజలను నమ్మించటానికి ప్రయత్నం చేస్తున్నారు. దేశం 7 శాతానికి మించి అభివృద్ధి సాధిస్తున్నదని, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉన్నదని, కొద్దికాలంలోనే ప్రపంచంలో మూడవ ఆర్థికవ్యవస్థగా భారతదేశం ఆవిర్భవిస్తుందని ప్రచారం చేస్తున్నారు. అభివృద్ధి గురించి చర్చించేటపుడు చైనా అభివృద్ధిని గుర్తు చేసుకోవటం ఉపయుక్తంగా ఉంటుంది. అత్యంత వెనుకబడిన ఆర్థికవ్యవస్థ స్థాయి నుండి ప్రపంచంలోని రెండవ ఆర్థికవ్యవస్థగా ఎదిగింది. మరికొద్ది కాలంలోనే అమెరికాను అధిగమించి, ప్రపంచంలో మొదటి ఆర్థికవ్యవస్థగా నిలుస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. కీలక పరిశ్రమలు ప్రభుత్వం చేతుల్లో ఉండటం, ప్రజలందరికీ ఉపాధి కల్పించే విధానాలు, సాగుదార్లందరికీ భూమిని ఇవ్వటం, విద్య, వైద్యం తదితరాలను అందరికీ అందుబాటులోకి తీసుకురావటం చైనా విజయానికి ప్రధాన కారణాలు.

మనదేశంలో బిజెపి అనుసరిస్తున్న విధానాలు వీటికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. దేశసంపద మొత్తాన్ని దేశ, విదేశీ పెట్టుబడిదారులకు అప్పగిస్తు, అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్న మోడి ప్రభుత్వం ఆర్థికవ్యవస్థ ఐదు ట్రిలియన్ డాలర్లకు చేరటానికి పరుగులు పెడుతున్నదని చెబుతున్నది. ప్రణాళికా విధానాన్ని, ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి, ప్రణాళికాబద్ధ అభివృద్ధిని పక్కన పెట్టిన ప్రభుత్వం ఇపుడు 25 సంవత్సరాల ప్రణాళికను గురించి మాట్లాడుతున్నది. బిజెపి, సంఘ్ పరివార్‌లకు కావలసినది దేశాభివృద్ధి, ప్రజల అభ్యున్నతి కాదు. ఆర్ఎస్ఎస్ అభివృద్ధి నిరోధక, సనాతన భావజాలాన్ని అంగీకరించే స్థితిలో ప్రజలను ఉంచటం. అందుకోసం దేశాన్ని ధ్వంసం చేయటానికైనా ఆర్ఎస్ఎస్ సిద్ధపడుతుంది. మోడి అధికారంలో ఉన్న ఈ పది సంవత్సరాల కాలం వారు అదే పనిచేశారు. తిరిగి అధికారంలోకి వస్తే దానినే కొనసాగిస్తారు. అభ్యుదయ దృక్పధానికి ఆర్ఎస్ఎస్ ఆమడ దూరంలో ఉన్నది. దాని చేతిలో కీలుబొమ్మగా ఉన్న బిజెపి దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నానని చెప్పటం ప్రజల కళ్ళు కప్పటానికే. 2047 వరకు బిజెపి అధికారంలో ఉంటే దేశం పురోగమించటం కాదు. స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న స్థితికి తిరోగమిస్తుంది.

### ఆర్ఎస్ఎస్ నిజ స్వరూపాన్ని బహిర్గతం చేయాలి

బిజెపి,ఎన్‌డిఏ దుష్పరిపాలనను 10 సంవత్సరాల పాటు అనుభవించిన ప్రజలకు ఆ పార్టీ పట్ల విశ్వాసం సన్నగిల్లింది. కాని బిజెపిని నడిపిస్తున్న ఆర్ఎస్ఎస్ విధానాలు ప్రజలకు పూర్తిగా అర్థం కాలేదు. బిజెపి అనుసరించే విధానాలను ఆర్ఎస్ఎస్ నిర్దేశిస్తుంది. ఈ రోజు మోడి అధికారంలో ఉన్నాడు. మోడికి ప్రజాదరణ ఉంది కాబట్టి అంతా మోడియే చేస్తున్నట్లుగా చూపుతున్నారు. రేపు మోడికి ప్రజాదరణ తగ్గితే ఆయనను పక్కన పెట్టి, ఆర్ఎస్ఎస్ మరొకరిని రంగంలోకి తీసుకొస్తుంది. దేశంలో రాజ్యాంగబద్ధంగా సాగుతున్న పాలనను అంతం చేయటం, చాతుర్వర్ణ వ్యవస్థను తిరిగి ప్రతిష్ఠించటం, మతపరమైన మైనారిటీలుగా ఉన్న ముస్లింలపై ద్వేషాన్ని పెంచటం ద్వారా మత సమీకరణ చేయటం, మెజారిటీ హిందువుల పేరుతో నిరంకుశ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం ఆర్ఎస్ఎస్ లక్ష్యంగా ఉన్నాయి.

మతాల మధ్య విద్వేషాలను పెంచే అంశాలను ఆర్ఎస్ఎస్ నిరంతరం ముందుకు తెస్తుంటుంది. వారి విధానాలను స్పష్టంగా చెబితే మెజారిటీ హిందువులు అంగీకరించరు. అందువలన నిరంతరం అబద్ధాలను ప్రచారం చేయటం, ప్రజలను మోసగించటం ద్వారా తమ విధానాలను అమలు చేయటానికి ప్రయత్నం చేస్తున్నారు. ముస్లింల జనాభా పెరిగిపోతున్నదని, కొద్దికాలంలోనే వారు హిందు జనాభాను మించిపోతారని పచ్చి అబద్ధాలను ప్రచారంలో పెడుతున్నారు. స్వాతంత్ర్యానంతరం ముస్లింల జనాభా ఏడు శాతం పెరిగిందని, అదే దామాషాలో హిందువుల జనాభా తగ్గిందని అధ్యయనంలో వెల్లడైనట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వాస్తవంగా స్వాతంత్ర్యానంతరం దేశంలో అన్ని మతాలలోని జనాభా పెరుగదల రేటు తగ్గింది. ఈ తగ్గుదల రేటు ఇతర మతాల వారి కన్నా ముస్లింలలో ఎక్కువగా ఉన్నది. ఈ వాస్తవాన్ని కప్పిపెట్టి, అబద్ధాలతో హిందువులలో భయాన్ని పెంచుతున్నారు.

ప్రార్థనా స్థలాలను వివాదాస్పదం చేయటం వారి ఎత్తుగడలలో ఒకటి. అయోధ్య తరహాలోనే కాశి, మథుర, ఇంకా ఇతరస్థలాలను వివాదాస్పదం చేస్తున్నారు. ఆ వివాదాలను పెంచి, ఘర్షణల వరకు తీసుకురావటం, మైనారిటీలు తమకు ప్రార్థన చేసుకొనే అవకాశాలు లేకుండా చేస్తున్నారని రెచ్చగొట్టటం ద్వారా మెజారిటీ మతస్తులను సంఘటితం చేస్తున్నారు. ఇటువంటి కట్టుకథలను సినిమాలుగా తీసి, ప్రజలను తప్పుదారి పట్టించటానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

చరిత్రను వక్రీకరించటం ద్వారా ముస్లింలు విదేశస్తులని, మనదేశంలో చొరబడ్డారని, మన సంపదలను కాజేస్తున్నారని ప్రచారం చేస్తారు. శాస్త్రీయంగా అధ్యయనం చేసి రూపొందించిన చరిత్రను పక్కన పెట్టి పురాణాలు, పురాతన కథలలో చెప్పిన వాటినే చరిత్రగా ప్రచారం చేస్తున్నారు. ఈ వక్రీకరణలను పాఠ్యాంశాలలో చేర్చి, విద్యార్థుల మెదళ్ళను కలుషితం చేస్తున్నారు.

ఇటువంటి పరిస్థితులలో బిజెపి, ఆర్ఎస్ఎస్ విధానాలను వ్యతిరేకించే వారి కర్తవ్యం ఏమిటి? ఎన్నికలలో బిజెపి గెలిచినా, ఓడిపోయినా ఆర్ఎస్ఎస్ బలంగా ఉన్నంత కాలం రాజ్యాంగం, లౌకికవాదం, ప్రజాస్వామ్యాలకు ప్రమాదం పొంచి ఉంటుంది. ఆర్ఎస్ఎస్ నిజ స్వరూపాన్ని ప్రజలంతా అర్థం చేసుకొంటేనే మనదేశం సురక్షితంగా ఉంటుంది. అందుకోసం ఆ సంస్థ లక్ష్యాలను, దానితో ప్రజలకు ఎదురయే ప్రమాదాలను బయటపెట్టాలి. ఆర్ఎస్ఎస్ ప్రచారాన్ని తిప్పికొట్టేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలి. సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను బట్టబయలు చేయాలి. వాటిలో భాగస్వాములౌతున్న వారికి సరైన సమాచారాన్ని అందించాలి.

వేయి తలల నాగులా అన్ని రంగాలలోకి చొరబడి విషాన్ని చిమ్ముతున్న ఆర్ఎస్ఎస్‌ను ఎదుర్కోవటానికి వేలు, లక్షల సంఖ్యలో చైతన్యవంతులైన కార్యకర్తలు అవసరం. దేశభక్తి, ప్రజల మధ్య ఐక్యతను పరిరక్షించటం లక్ష్యంగా పనిచేయటానికి యువతను సన్నద్ధం చేయాలి. అన్ని రంగాలలోనూ ఆర్ఎస్ఎస్‌ను బలహీనపరచాలి. ఆర్ఎస్ఎస్ బలహీన పడితేనే బిజెపి శక్తిహీనమౌతుంది. ప్రజలలో దానికి మద్దతు తగ్గుతుంది.

బిజెపి విధానాలను వ్యతిరేకిస్తున్న వారు, దానికి ప్రత్యామ్నాయం కోసం అన్వేషిస్తున్నవారు ఈ అంశాలను గమనంలో ఉంచుకోవాలి. లక్ష్యసాధన కోసం దీర్ఘకాలిక పోరాటానికి సన్నద్ధం కావాలి.

❋

# బ్రిటన్‌లో ఆకలి కేకలు

(17వ పేజీ తరువాయి)

ఇంటర్మీడియట్ వంటిది) మరిన్ని సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఇంగ్లండు ఒక్కదానిలోనే 4,68,000 మంది పూర్తికాలం శిక్షణ పొందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులున్నారని 2023 డిసెంబర్‌లో ఒక పార్లమెంటరీ చర్చాపత్రం తెలిపింది. అంటే గత దశాబ్ద కాలంగా దేశంలో పాఠశాల ఉపాధ్యాయుల సంఖ్య పెరగలేదని ఈ పత్రం తెలిపింది. 2023-24 విద్యా సంవత్సరంలో 34 శాతం ఉపాధ్యాయుల కొరత ఉన్నది. ఉపాధ్యాయుడు, విద్యార్థుల నిష్పత్తి 2010లో 17 నుండి 2022లో 18కి పెరిగింది. కోవిడ్ బాగా వ్యాపించి ఉన్నప్పుడు ఉపాధ్యాయ శిక్షణకు రిక్రూట్ మెంట్ పెద్ద ఎత్తున పెరిగింది. కానీ అది తరువాత కొనసాగలేదు. (తన స్వంత విద్యా విధానం ఉన్న స్కాట్‌లాండ్‌లో ఉపాధ్యా, విద్యార్థి నిష్పత్తి 14 ఉంది. ఇంగ్లండ్‌లో ఉపాధ్యాయుల లభ్యత "క్లిష్ట స్థాయిలో" ఉన్నదని విద్యా పరిశోధనకు సంబంధించిన జాతీయ సంస్థ తెలిపింది.

ఇంకో పెద్ద సమస్య ఏమంటే ఉపాధ్యాయులు ఆ వృత్తిలో ఉండడం లేదు. మొదటి పది సంవత్సరాల్లో ఉపాధ్యాయులను నిలుపుకునే రేటు ఇంగ్లండులో పడిపోతున్నదని విద్యా విధాన సంస్థ తెలిపింది. 2010లో రిక్రూట్ అయిన ఉపాధ్యాయుల్లో 40 శాతం మంది 2020 వచ్చేసరికి వృత్తి నుండి తప్పుకున్నారు. ప్రాథమిక, సెంకండరీ పాఠశాలల్లోని ఉపాధ్యాయులే కాకుండా ప్రిన్సిపాళ్ళు, డిప్యూటి ప్రిన్సిపాళ్లు కూడా వృత్తిని వదిలి వెళ్లిపోతున్నారు. ఇన్‌స్పెక్షన్ల 'బాధ' తట్టుకోలేక ప్రిన్సిపాళ్లు, డిప్యూటీ ప్రిన్సిపాళ్లు మానేస్తున్నారు.

అక్కడ ఇన్‌స్పెక్షన్లు ఎలా ఉంటున్నాయంటే వాటి ఒత్తిడికి తట్టుకోలేక ఇటీవల ఒక ప్రిన్సిపాల్ ఆత్మహత్య చేసుకున్నాడు. తనకు మూడు అత్యుత్తమ (ఔట్‌స్టాండింగ్) గ్రేడ్‌లు ఇచ్చిన తరువాత ఒక్కసారిగా 'చెడ్డ' (బాడ్) గ్రేడ్ ఇవ్వడంతో తట్టుకోలేక ఆయన ప్రాణాలు తీసుకున్నాడు. ప్రిన్సిపాల్స్‌ను శిక్షించే ఇటువంటి దారుణమైన యాజమాన్య పద్ధతులను కన్సర్వేటివ్, లేబర్ ప్రభుత్వాలు రెండూ కొనసాగిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చాలా తక్కువ వేతనాలున్నాయని చెప్పి ఎవరైనా ఇతర పాఠశాలలకూ వెళ్లలేకపోతున్నారు. ఎందుకంటే అక్కడ ఇళ్ల ధరలూ, అద్దెలూ ఎక్కువగా ఉండడమే కాకుండా వీళ్లను తాత్కాలికంగానే తీసుకుంటున్నారుగాని శాశ్వత ఉద్యోగాలు ఇవ్వడం లేదు.

ప్రభుత్వ రంగ రవాణా వ్యవస్థతో విద్యార్థులు నిత్యం అనుభవిస్తున్న నరకం ఉపాధ్యాయులకు మరో సమస్యగా ఉంది. చిన్న చిన్న పట్టణాల్లో కనీసం పావు వంతు విద్యార్థులు లంచ్ సమయానికి గానీ పాఠశాలకు రాలేక పోతున్నారు. ఉదయం పూట బస్సులు రాకపోవడం, బస్సుల సంఖ్య తగినంతగా లేకపోవడం దీనికి కారణం. ఒక బస్సు తప్పిపోతే మళ్లీ రెండు గంటలకు గానీ మరో బస్సు రాదు. కంప్యూటరైజ్డ్ అటెండెన్స్‌లో ఇప్పుడు బస్సులు లేటుగా రావడం కూడా లేటుకు ఒక కారణంగా పేర్కొనానికి అనుమతిచ్చారు. నేను నా సహోపాధాయులం శీతాకాలంలో పిల్లలను త్వరగా వదిలేస్తాం. ఎందుకంటే వారిలో చాలా మంది 30 కిలోమీటర్లు దాటి ప్రయాణం చేయాలి. అక్కడి నుండి ఇళ్లకు పోవాలంటే మనుషుల అలికిడి లేని రోడ్లపై, కళ్లు పొడుకున్నా కానరాని చీకట్లో నడుచుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. దీనికి "రవాణా పేదరికం" అన్న పదం చక్కగా అతుకుతుంది. ఇంగ్లండ్‌లోని బస్ సర్వీసులన్ని టినీ దశాబ్దాల క్రితమే ప్రయివేటీకరించారు. ఒక్క లండన్ మాత్రమే దీనికి మినహాయింపు. గ్రేటర్ మాంచెస్టర్‌లో బస్సులనూ, ట్రామ్‌లనూ తిరిగి ప్రభుత్వ రంగంలోకి స్వాధీనం చేసుకున్నారు. (స్కాట్‌లాండ్ రాజధాని ఎడిన్‌బరోలో కూడా ఇటువంటి ఏర్పాటే జరిగింది.)

### ఎన్‌హెచ్ఎస్‌పై ఒత్తిళ్లు

బ్రిటన్‌లో ఏకైక పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ జాతీయ వైద్య సర్వేసు లేక ఎన్‌హెచ్ఎస్. 1948లో ఇది ప్రారంభమైంది. మొత్తం దేశం దీన్ని అత్యంత విలువైన సంస్థగా పరిగణిస్తున్నప్పటికీ దీనికి ప్రభుత్వం నుండి నిధులు తగ్గిపోతుండడంతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతోంది. ఇంగ్లండులో రాజరికానికన్నా ఈ వైద్య సర్వీసుకు ప్రజలు ఎక్కువ గౌరవం ఇస్తారని 2012లో ప్రొఫెసర్ కోలిన్ లేస్ పేర్కొన్నారు. హెల్త్ ఫౌండేషన్ కూడా ఇదే విషయాన్ని చెప్పింది.

అయినప్పటికీ ప్రభుత్వాలు గత కొన్నేళుగా ఈ సర్వీసుకు నిధులు తగ్గించేస్తున్నాయి. 2010-15 మధ్య టోరి-లిబరల్ కూటమి ప్రభుత్వం ఎన్‌హెచ్ఎస్‌కు వార్షిక బడ్జెట్ పెంపుదలను 1.1 శాతానికి తగ్గించేసిందని 2023లో గార్డియన్ పత్రికలో వచ్చిన ఒక వ్యాసం తెలిపింది. 2010-18 మధ్య టోరీలు ఈ బడ్జెట్‌ను 1.7కు పెంచారు. తరువాత 4 శాతం పెంచుతూ వస్తున్నారు. కానీ ద్రవ్యోల్బణంతో పోలిస్తే నిధులు పెంచినట్లు కాదు, తగ్గించినట్లు.

(అనువాదం: ఎస్ వెంకట్రావు)

# సంస్కృతి-సమాజం

**(28వ పేజీ తరువాయి)**

అందుచేత సాహిత్యానికి గాని, మరేదైనా కళారూపానికి గాని, మానవుల మేథోపరమైన జీవితాలకు గాని మూలాలు వారి సమాజ భౌతిక జీవితంలో ఉంటాయి. అందుచేత ఒకానొక కళారూపాన్ని విమర్శనాత్మకంగా ఆస్వాదించాలంటే ఆ కళారూపాన్ని సృజించిన కళాకారుడు ఏ కాలంలో, ఏ సామాజిక పరిస్థితుల్లో జీవించాడో ముందు తెలుసుకోవాలి. ఐతే ఆ కళారూపానికి, దానిని సృజించిన కళాకారుడి సామాజిక జీవితానికి యాంత్రికంగా ముడి పెట్టకూడదు. ఒకే సామాజిక పరిస్థితుల్లో జీవించిన ఇద్దరు రచయితలు వేర్వేరు సారాంశం కలిగిన రచనలు చేయవచ్చు. అందులో వారి వ్యక్తిగత సృజన, వ్యక్తిగత దృక్పథం ప్రభావం ఉంటుంది. ఒకే రచయిత వేర్వేరు రకాల సారాంశాలతో రచనలు చేయవచ్చు కూడా.

ఒక రచయిత గొప్పదనం అతను లేదా ఆమె సమాజ పరిణామ క్రమాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడంలో, ఆ సమాజ పురోగమనానికి తోడ్పడే రచన చేయడంలో ఉంటుంది.

ఆదిమ సమాజం నుండి ముందుకు సాగి ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందిన తర్వాత వర్గ సమాజాలలో కొందరికి ఉత్పత్తి శ్రమ చేయనవసరం లేని పరిస్థితి కలిగింది. అప్పుడే కళారూపాలను ఆదిమ, మొరటు స్థాయి నుండి నైపుణ్యవంతంగా, సౌందర్యానుభూతి కలిగించగలిగేలా పెంపొందించడం సాధ్యపడింది.

మళ్ళీ దోపిడీ సమాజంలో పరాయీకరణకు లోనైన శ్రామికవర్గం వర్గపోరాటాలను తీవ్రతరం చేసే క్రమంలో ఎదుర్కొనే అనుభవాలు కళారూపాలను నూతన స్థాయికి తీసుకుపోగలుగుతాయి. సోషలిస్టు దేశాలలో చిత్రాలు నూతన మానవుడిని ఆవిష్కరించి నూతన విలువలను, వాస్తవికతను చూపడం మొదలైన తర్వాత ఆ ప్రభావం ప్రపంచం మొత్తంగా పడింది.

అందుచేత కళాకారుడు వ్యక్తిగా ఎంత ప్రజ్ఞ కలిగినవాడైనా అతడి సామాజిక జీవితం చూపించే ప్రభావానికి అతీతంగా వ్యవహరించలేడు.

అదే సమయంలో కళారూపాన్ని సృజించడంలో వ్యక్తిగత ప్రజ్ఞ, సృజనాత్మక శక్తి కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అందుచేత ఈ రెండింటికీ మధ్య ఉండే పరస్పర సంబంధాన్ని మనం గ్రహించాలి. సమతూకంతో వ్యవహరించాలి.

**కళారూపాలు – మార్క్సిస్టు విమర్శ**

దోపిడీవర్గాల ఆధిపత్యంలో సమాజం ఉన్నప్పుడు సమాజ సంస్కృతిలో దోపిడీ సంస్కృతిదే బలమైన ధోరణిగా ఉంటుంది. దానిని ఎదుర్కొని, ఎండగట్టి బలహీనపరిచే క్రమంలోనే మనం ప్రత్యామ్నాయ, శ్రామికవర్గ సంస్కృతిని ముందుకు తీసుకురాగలం. కేవలం మన భావాలను వ్యక్తం చేసే కళారూపాలను సృష్టిస్తే చాలదు.

ఉదా: మనం చాలా ఖర్చు చేసి ఒక సినిమా తీయవచ్చు. అంతమాత్రాన మన భావాలు ప్రజల్లో పైచేయి సాధించలేవు. ప్రజలను అనునిత్యం ప్రభావితం చేసే సినిమాలమీద చర్చ పెట్టి, వాటిలో ప్రబోధిస్తున్న విలువల బండారాన్ని బైటపెట్టడం చాలా అవసరం.

ఇదే సాహిత్య రంగంలోను, తక్కిన కళా రంగాలలోను వర్తిస్తుంది.

ఈ విమర్శకు పూనుకునేటప్పుడు ఆ సినిమాలో, లేదా ఆ రచనలో వ్యక్తం అయే అభ్యుదయ అంశాలను విస్మరించి విమర్శ అంటే కేవలం తెగనాడడమే అన్నట్టు వ్యవహరించకూడదు.

కేవలం వర్గ పోరాట ఆవశ్యకతను తెలపడం, ఆ దిశగా ప్రేరణ కలిగించడం మాత్రమే ముఖ్యం అని అనుకోరాదు. సమాజ పురోగమనం వైపుగా ఆలోచనలను ప్రేరేపించగల కళారూపాలన్నీ ఉద్యమానికి అవసరమే. విశాల ప్రాతిపదికన ఉన్నత మానవ విలువలను ప్రబోధించే కళారూపాలన్నింటినీ మనం స్వీకరించాలి.

ప్రతీ కమ్యూనిస్టూ సాంస్కృతిక రూపాలను సృష్టించలేకపోవచ్చు. కాని సాంస్కృతిక రూపాలను విమర్శనాత్మకంగా పరిశీలించే దృష్టిని తప్పకుండా అలవరచుకోవాలి. అటువంటి విమర్శలను, చర్చలను ప్రోత్సహించాలి.

**కళారూపానికి, ప్రచారరూపానికి తేడా**

ఆయా ఉద్యమాల సందర్భంగా. పోరాటాల సందర్భంగా సృష్టించే కళారూపాలు చాలా ఉంటాయి. ఎన్నికల సందర్భంలో, సమ్మెల సందర్భంలో, మహాసభల సందర్భంలో అనేక కళారూపాలను సృష్టిస్తాం. కళారూపం అన్న నిజమైన అర్థం వాటన్నింటికీ వర్తించదు. వాటిలో కొన్ని మాత్రమే కళారూపాలుగా మిగులుతాయి. దోపిడీ సమాజ విలువల్ని ఎండగట్టి ప్రజల్ని బలంగా ప్రభావితం చేయగల కళారూపాలు, శ్రామికవర్గ సంస్కృతిని, దాని విలువలను తెలియజెప్పి ఉత్తేజపరచగల కళారూపాలు, దీర్ఘకాలం సమాజంలో ప్రజలను చైతన్యపరచగల శక్తి కలిగివుంటాయి. అటువంటి వాటినే కళారూపాలుగా పరిగణించాలి.

**. ప్రజా సంఘాల, ప్రజాతంత్ర ఉద్యమాల కర్తవ్యం**

ఆయా తరగతుల శ్రమజీవుల కోసం, సామాన్య ప్రజలకోసం పని చేసే వివిధ ప్రజాసంఘాలు, ప్రజాతంత్ర ఉద్యమం ఆర్థిక రాజకీయ పోరాటాల పట్ల ఎంత శ్రద్ధ వహించాలో, తాత్విక, సైద్ధాంతిక పోరాటాల పట్ల ఎంత శ్రద్ధ వహించాలో, అంతే శ్రద్ధ సాంస్కృతిక రంగంలోని పోరాటం పట్ల కూడా పెట్టాలి. సాంస్కృతిక రంగానికి మేథోపరమైన, భావావేశపరమైన పార్శ్వాలు రెండూ ఉంటాయి. ఆ రెండు పార్శ్వాల్లోనూ పోరాటం సాగించాలి.

పాలకవర్గాలు దోపిడీ సంస్కృతిని బలంగా ముందుకు తీసుకుపోయేందుకు కావలసిన అన్ని వనరులనూ సమకూర్చుతాయి. మరి ప్రత్యామ్నాయ శ్రామిక సంస్కృతిని బలంగా నిర్మించాలంటే ప్రజా ఉద్యమాలే అందుకు పూనుకోవాలి. అన్ని ప్రజా సంఘాలూ సాంస్కృతిక కృషిని తమ పనిలో ఒక అంతర్భాగంగా చేయాలి. ముఖ్యంగా ఆర్థిక తోడ్పాటు అందించి పోషించడం కీలకం. పెట్టుబడిదారులు వారి భావాలను ప్రచారం చేసే సంస్కృతిని పోషిస్తున్నట్టే శ్రామికవర్గం తన ప్రత్యామ్నాయ సంస్కృతిని పోషించాలి. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో పాలు పంచుకోవాలి. ❋

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

# తెలుగు వెలుగుల వేమన్న

*(2వ పేజీ తరువాయి)*

ధరలోన/విశ్వదాభిరామ వినురవేమ.

వేమన గొప్ప గొప్ప ప్రబంధాలను, సంస్కృతంలో పురాణాలను, రాజులను కీర్తిస్తూ కవిత్వాన్ని రాయలేదు. అతి సామాన్య ప్రజానీకానికి సులభమైన తెలుగు చాటు పద్యాలలో తత్వాన్ని వివరించడానికీ, సమాజంలో ఉన్న మురికిని ఎండగట్టటానికి ప్రయత్నం చేసిన ప్రజాకవి. సామాన్య ప్రజలకు అర్థమయ్యే ఉదాహరణలు తీసుకోవడం, పద్యాలలో హాస్యస్ఫూరకతను జోడించడం, తన పద్యాలలో సమకాలీన అంశాల ప్రస్తావన ఉండటం, పద్యాలలో ఎత్తిపొడుపులు ఉండటం, సమాజంలో కరుడుగట్టి ఉన్న సాంప్రదాయాల పట్ల నిరసన ధ్వనించడం ఆయన పద్యాలలోని ప్రత్యేకత.

అంది వచ్చిన అనుభవాలను ఆటవెలదుల్లో అలవోకగా లోకానికి అందించాడు వేమన. మితిమీరిన విగ్రహారాధన, అవివేకంతో కూడిన సంప్రదాయాలు, పాటింప వీలులేని, కొన్ని వర్గాలకే పరిమితమైన "విజ్ఞానం"వంటివి వేమనకు నచ్చలేదు.వేదం చదివామని చెప్పే వారిలో "వివేకం" శూన్యం అని వేమనకు తెలుసు. దేవాలయాల ముసుగులో జరిగిన దారుణాలు, వ్యాపారాలు నాటి సమాజంలో చీకటి దృశ్యాలను ఆయన చూశారు. పురుషాధిక్యతతో స్త్రీలను దేవదాసీలుగా చిత్రించటం వెనుక స్వార్థపరుల కుట్రలను వేమన గ్రహించాడు. వేశ్యల వెనుకబడి "విత్తం"(సొమ్ము) పోగొట్టుకుని వెర్రివారైన విటుల జీవితాలు, వారి కుటుంబాల్లోని విషాదం ఇలాంటివన్నీ ఆయన గ్రహింపు కొచ్చిన అంశాలు. ఒక వైపున స్త్రీ ఔన్నత్యం గురించి శాస్త్రాలు ఘోషిస్తూనే అవే శాస్త్రాలు ఆమెను ఒక భోగ వస్తువుగా పరిగణించిన విషాదాన్ని ఆ శాస్త్రాలలో ఉన్న చౌకబారుతనాన్ని, ఆనాటి సమాజపు ''సహజ రీతిగా''చలామణి కావటానికి గర్హించాడు. కనుకనే ఆయన తన పద్యాలలో ఆచార సంప్రదాయాలను గొప్పవిగా అంగీకరించలేకపోయాడు. కారణం ఆనాటి సమాజంలోని ఒక వర్గపు ఆధిపత్యం. కుహనా సంప్రదాయ వాదుల విలాసవంతమైన జీవితాల వెలుగు ఆయన్ను ఆలోచింపజేశాయి. వేమన దృష్టిలో మనిషే దేవుడు. ఆయన మతం మానవతావాదం."బాపడనగా నేమి? భక్తుడనగ నేమి?/ జోగి అనగ నేమి? సొంపు లేక/ఎన్ని పేరులైన ఇనజుడు (యముడు) పనితీర్పు/విశ్వదాభిరామ వినురవేమ. బ్రాహ్మణుడైన, భక్తుడైన, జోగి అయిన ఎవరైనా సరే చివరకు యమధర్మరాజు చేత పడవలసిన వారే. అనే పద్యమే ఈ వాదాన్ని బలపరుస్తుంది.

ఆచారాలు పాటించే వారిలో చిత్తశుద్ధి శూన్యతను వేమన గమనించాడు. ఈనాటి సమాజంలో కూడా ప్రచారం కోసమే భక్తి ఆచారాలు పాటించేవారే ఎక్కువ. డబ్బు ఖర్చును బట్టి తమ స్థాయికి తగిన, తన స్థాయికిమించిన  పూజలు, భజనలు చేస్తున్న భక్త శిఖా మణులను మనం ప్రతిరోజు చూస్తూనే ఉన్నాం. అయ్యప్ప దీక్ష పట్టే ముందు రోజు వరకు, పీకలదాకా తాగే అయ్యప్ప భక్త శిఖామణులు వారి శక్తికి మించి ఖర్చు చేస్తూ గొప్ప భక్తులుగా చలామణి అయ్యే వారి గురించి ఆనాడే వేమన ఊహించి చెప్పాడేమో అనిపిస్తుంది. ఇటువంటి వాళ్ళను ఉద్దేశించే, వారి కోసమే "ఆత్మ శుద్ధి లేని ఆచార మదియేల/బాండ శుద్ధి లేని పాకమేల/చిత్త శుద్ధి లేని శివ పూజ లేలరా?/విశ్వదాభిరామ వినురవేమ అని ప్రశ్నించాడు వేమన. అంతేకాదు వేదం చదివిన వారు వివేకులుగా ప్రవర్తించక అనైతిక కార్యాలకు పాల్పడటం వేమన చూశాడు కనుకనే "వేద విద్యలెల్ల వేశ్యల వంటివి/భ్రమలో పెట్టి తేటపడగ నీవు/గుప్త విద్య ఒక్కటే కులకాంత వంటిది/అన్నాడు వేమన. ఆనాటి కర్మకాండలోని డొల్లతనాన్ని వేమన నిరసించాడు. ఇవన్నీ పురోహితుల భుక్తి కోసమేనని ఆయన గమనించాడు. "పిండంబులను చేసి పితరులను దలబోసి/కాకులకు పిండంబులను పెట్టు గాడ్దేలారా/పియ్యి తినెడి కాకి పితరు డేట్లాయెరా.అంటూ ప్రశ్నించడం ద్వారా భావదాస్యంలోకి ప్రజలను నెట్టే పురోహిత వర్గాలను తూర్పారపడ్డాడు. ఇందుకు కారణం లేకపోలేదు ఆనాటి సంఘంలో యజ్ఞాలు యాగాలు చేసేటప్పుడు యజమాని భార్య తాను వ్యభిచరిస్తే, ఎంతమందితో సంబంధంలోకి పోయిందో సూచించటానికి అన్ని గడ్డి పోచలను పెట్టాలనేది ఆనాటి ఓ ఆచారం. తద్దినాలలో పేరుకు తండ్రి ఎవడైనా జన్మ ఇచ్చిన వాడేవడో వాడికే పిండం చెందుతుంది. కట్టుకున్న భార్య రంకు, కన్నతల్లి రంకు బయట పెట్టించే కర్మకాండ దుర్మార్గమే. ఇలాంటి నాటు సత్యాలను బహిర్గత పరుస్తూ, దుర్మార్గాలను ఆ ఆచారాలను వేమన వ్యతిరేకించాడు."ఆలి రంకు తెలుపు అఖిల యజ్ఞంబులు/తల్లి రంకు తెలుపు తద్దినములు/ కాని తెరువు కర్మకాండ కల్పిత మాయే/ విశ్వదాభిరామ వినురవేమ. అంటూ ఆనాటి పురోహిత వర్గం యొక్క జారత్వాన్ని బహిరంగ పరిచాడు. వాళ్ల మెదడులను ములు కర్రతో ఒక పోటు పొడిచాడు.

దేవుడంటే ఎవరు? ఎక్కడున్నాడు? కనిపించని దేవుని గురించి గొప్పగా కీర్తించి, కళ్ళ ముందు కనిపించే మనిషిని జాతి, కుల, మత, వివక్షలతో, ఆర్థిక అసమానతలతో వేధించే మనుషులను వేమన దూషించాడు, ద్వేషించాడు. తన హేతువాద భావాల తూటాల వర్షం కురిపించాడు. అసలు దేవుడు ఎక్కడున్నాడు అని నిలదీశాడు."దేవుడనగ వేరే దేశమందున్నాడే/ దేవుడనగ తనదు దేహమందు/వాహనంబు లైదు వడి తోలుచున్నాడు''. మనిషిని నడిపించే జీవచైతన్యమే దేవుడు. పాడి, పంట, రైతు, తల్లి, తండ్రి, మానవత్వం ఇవే దైవ స్వరూపాలుగా వేమన సిద్ధాంతీకరించాడు.

తన కాలం నాటి అనేక ఆచారాలను మూడనమ్మకాలను వేమన తిరస్కరించాడు వాటిని దుయ్యబట్టాడు. వేమన తీవ్రమైన భావాలు గలవాడు. వేమన రచనల్లో భావం, భాష రెండూ ఒకదానితో ఒకటి పోటీపడి ఆయన హృదయం నుండి దూకి పైకి వస్తాయి. అమాయక ప్రజలైన వారిని పేదవారుగా మార్చే వారిని ఆకలి చావులకు గురి చేసే మతాధికారుల మౌఢ్యపు చేష్టలను నిర్ద్వందంగా తిరస్కరించాడు. ఆనాటి మత పెద్దలు చెప్పే బోధనలో స్వర్గంపై మమకారం కన్నా రంభ ఊర్వశిల పైన ఆశ ఎక్కువగా ఉండేది. యజ్ఞం చేసిన తండ్రి, కొడుకు ఇద్దరు మరణిస్తే ఇద్దరు రంభతో రమిస్తే అప్పుడు వాళ్ళిద్దరూ వావివరసలు తప్పి పాపం చేసినట్లు కాదా? అని ప్రశ్నించాడు వేమన."తల్లితో రమించే తండ్రి యజ్ఞం చేసి/తనయుడట్లే రంభ దనరగూడే/తల్లిని రమయింత్రు దబ్బర విప్రులు/ విశ్వదాభిరామ వినురవేమ అని ఎత్తి చూపాడు. ఆచార వ్యవహారాల్లో ''శకునముల''కు ప్రాధాన్యత ఇస్తారు. విధవలను దుశ్శకునంగా భావించేవారు. వేమన ఇక్కడ కూడా తన పదునైన విమర్శనాస్త్రములను సంధిస్తాడు. శకునం అనగా పక్షి అని అర్థం. పక్షులకు శకునాలకు సంబంధం ఉంది. అది వేరే విషయం. శకునాలను ఆరు రకాలుగా విభజించారు. వీటిని తీవ్రంగా నిరసించిన వేమన "మంచి శకునములనె ఎంచక పెండ్లాడు/

వారలొకరు లేరు వసుధలోన/జనుల కర్మములను శకునముల్ నిల్పునా" అంటాడు. జాతకాలు, ఇటు ఆరు తరాలు, అటు ఏడుతరాలు చూసి పెండ్లాడిన వారు కొట్టుకొని, విడిపోయి, కోర్టు గుమ్మాలు ఎక్కుతున్న వర్తమాన కాలంలో వీటిని ఎందుకు నమ్మాలి? అయినప్పటికీ శకునాలు జాతకాలు చూశాక శుభ ముహూర్తాలు అని పెట్టించుకుంటారు. ఈ విషయాన్ని వేమన సూటిగా విమర్శిస్తూ "విప్రులెల్ల కూడి వెర్రి కూతలు కూసి/సతిని పతిని కూర్చ సమ్మతముగ/సుముహూర్త ముంచ ముండెట్లు వెూసేరా''అంటూ ముహూర్త బలమే నిజమైతే ముండెందుకు కావాలి? ముండమోస్తుందని ముందుగా తెలిస్తే ఆ ముహూర్తం ఎందుకు పెట్టాలి? జ్యోతిషం అంతా బూటకం. పురోహితులు పెళ్ళిలో చదివే మంత్రాలన్నీ వేమన గారు వెర్రి కూతలు అని అన్నారు. ఆనాటి సమాజంలోని కొంతమంది యొక్క ఆధిపత్య భావజాలానికి సమాధి కట్టే ప్రయత్నం చేశాడు. వేమన భాష స్వచ్ఛమైనది. వాడి గలది. శైలి సరళం సాటిలేనిది. ఆయన చేసే పోలికలు సహజంగా సరికొత్తగా గంభీరంగా మేరు తీగల్లాగా ఉంటాయి. ఇతరుల సొమ్మును ఆశించే లక్షణం ''వెన్నదొంగ''లోనూ కనిపిస్తుంది అంటూ వ్యంగ్యాస్త్రాలు విసురుతాడు."పాల కడలి పైన పవళించిన స్వామి/గొల్ల ఇండ్లపాలు కోరనేల?/ఎదుటివారి సొమ్ము ఎల్లవారికి తీపి/విశ్వదాభిరామ వినురవేమ.

బంగారు లేడి ఉండదని తెలియని రాముడు దేవుడు ఎలా గయ్యాడు? అంటూ ప్రశ్నిస్తాడు వేమన. "కనక మృగము భువిని కద్దు లేదనుకుండ/తరుణి విడిచి పోయే దాశరధియు/తెలివి లేని వాడు దేవుడేట్లయేరా" అలానే కుల వివక్షత లోని డొల్లతనం గురించి ''మాలవానినంటి మరి నీట మునిగితే/ కాటికేగునప్పుడు కాల్చు మాల/అప్పుడంటి నంటు ఇప్పుడెన్దేగేనో? అంటూ సామాజిక రుగ్మత అయిన కుల వివక్షతను చీల్చి చెండాడాడు. మనిషిని మనిషిగా చూడాలే కానీ కులంపేరుతో దూరం చేయకూడదు అనే నగ్న సత్యాన్ని సమాజానికి చెప్పి అప్రమత్తం చేశాడు. వేమన మానవతా ధర్మం గురించి చెప్తూ "చంపదగిన యట్టి శత్రువు తన చేత/ చిక్కెనేని కీడు సేయరాదు/పొసగ మేలు చేసి పొమ్మంటే చాలు/విశ్వదాభిరామ వినురవేమ అంటూ మానవత్వాన్ని చాటుతాడు.

వేమన ఆంధ్రులలో సాటి లేని వ్యక్తి. తనకు తెలిసిన వాటిని నిర్భయంగా ప్రపంచమునకు బోధించు ధైర్యము, దానికి సాధనమైన మంచి పదును గల చురకత్తి వంటి కవితా శక్తి వేమన సొంతం. తాము సత్యమని నమ్మినప్పటికికూడా ఇతరుల మనసు నొచ్చుకుంటుందేమోనని చెప్పకుండా తప్పించుకు తిరుగు "ధన్యులు" కవులు ఆంధ్రులలోఎందరో ఉన్నారు.

వేమన కాలమునకు కాస్త అటు ఇటుగా ఉన్న కటార్ల పల్లె వేమన్న, ఏగంటి వారు, పోతులూరి వీరబ్రహ్మం, సదానంద యోగి మొదలగువారు, వేమన సాహిత్య భావపరంపరను, హేతువాద దృక్పథం కలిగి సర్వ మానవ సమానత్వాన్ని బోధించిన వారే.

వేమన పద్యములు చిటుకులో ముగింపు గల చిన్న పలుకులు. అచ్చ తెలుగు పద్యపు నడక. గురితప్పని చిక్కని చెక్కిన మాటలు. నోరు గల తెలుగు వారందరును నేర్చుకొనుటకు అనుకూలమైన భాష, భావము. వేమన అందరికీ తేలికగా అర్థమయ్యే పదాలతో పద్యాలు రాసిన వాడు. వేమనను ప్రజాకవి అంటారు. ఆయన సమాజంలో ఉండే మంచి విషయాలను గ్రహించి వాటిని చిన్న పిల్లలు సైతం అర్థం చేసుకునే విధంగా చిన్న చిన్న పదాలతో శతకం రాశాడు. వేమన ఆశుకవి. ఆటవెలది ఛందం లో ఈటెను సూటిగా విసిరిన దిట్ట వేమన. ఛాందసభావాలకు తొలి అడ్డుకట్ట వేమన. ధర్మ శాస్త్రాలన్నీ ఆడు వాళ్లను శూద్రులను ఒకే గాట కట్టేసాయి."తాత గన్నతల్లి, తమ తండ్రి గనుతల్లి/తన్నుగన్నతల్లి, తల్లి తల్లి/తల్లి శూద్రురాలు తానెట్లు బాపడు?/ విశ్వదాభిరామ వినురవేమ. అగ్రవర్ణాల స్త్రీలైనా సరే వాళ్ళకి శూద్రుల్లాగానే స్వేచ్ఛ లేదు. వేదాధ్యయన అధికారం లేదు. తరతరాలుగా బ్రాహ్మణ వంశంలో తాతమ్మ, నాయనమ్మ, అమ్మమ్మ, అమ్మ అందరూ శూద్రులే. తల్లి సూద్రురాలు అయితే తానెలాగా బ్రాహ్మణుడు అవుతాడు? అని వేమన సూటిగా ప్రశ్నిస్తున్నాడు. మోక్షమార్గం గురించి గురువుల దగ్గరకు వెళ్లేవాళ్ళను అపహాస్యం చేస్తూ వేమన ఇలా అంటాడు."గుహలోన జొచ్చి గురువుల వెతుకంగ/క్రూర మృగ మొకండు తారసిల్లిన/ ముక్తి మార్గమదియే ముందుగా చూపురా/ విశ్వదాభిరామ వినురవేమ." కొండ గుహల్లో

# నిరుద్యోగ భారతం

(10వ పేజీ తరువాయి)

సవాలుగా ఉండబోతున్నది. దేశంలో ఉద్యోగ కల్పన బాగా జరగాలంటే పైన చర్చించిన వాటిలో కొన్ని ముఖ్యాంశాలను గమనంలో ఉంచుకోవాలి.

మొదటి అంశం, దేశంలో తీవ్రమౌతున్న అసమానతలు రానున్న కాలంలో సరుకులు, సేవలకు డిమాండ్ తగ్గటానికి దారితీస్తాయి. కాబట్టి వాటిని యుద్ధ ప్రాతిపదికపై పరిష్కరించాలి. శత కోటీశ్వరుల సంఖ్య పెరగటం నాగరిక సమాజంలో గొప్పే కావచ్చు. కాని కొద్దిసంఖ్యలో ఉన్న శత కోటీశ్వరులు భవిష్యత్‌లో విస్తృతంగా జరగాల్సిన సామాజిక ఉత్పత్తికి అవసరమైన డిమాండ్‌ను సృష్టించలేరు. దానితో నిరుద్యోగం, అసమానతలు పెరుగుతాయి.

ప్రపంచీకరణ చెందిన ఆర్థికవ్యవస్థలో వ్యక్తులను విద్యావంతులను చేయటం, నైపుణ్యాలను పెంచటం, నూతన నైపుణ్యాలను అందించటం లాంటివి చేయాలంటే ప్రముఖమైన సంస్థలను కొద్దిసంఖ్యలో ఏర్పాటు చేయటం సరిపోదు. పట్టణ-గ్రామీణ ప్రాంతాలు, ధనికులు-పేదల మధ్య అన్ని స్థాయిలలోనూ తీవ్ర అసమానతలకు కారణమౌతున్న మన విద్యా విధానాన్ని పూర్తిగా సంస్కరించాలి.

ఆటోమేషన్‌కు అనివార్యంగా వెళుతున్న పరిస్థితులలో తక్కువ డిమాండ్ ఉండటం "ఏ మాత్రం ఉపయోగం లేని వర్గాన్ని" సృష్టించే తీవ్ర ప్రమాదానికి దారితీస్తుంది. ఈ వర్గం వ్యవస్థాగతంగానే నిరుద్యోగులుగా ఉంటారని చరిత్రకారుడు యువల్ నోయా హరారి చెప్పాడు. భవిష్యత్‌లో సరుకులు, సేవలకు మార్కెట్లు సక్రమంగా పనిచేయాలంటే, కనీస సార్వత్రిక ఆదాయాన్ని గ్యారంటి చేసే పథకాల ద్వారా వీరికి రక్షణ కల్పించే విధానాలపై అత్యవసరంగా చర్చ జరగాలి.

చివరిగా, భారతదేశంతో పాటు దక్షిణాది దేశాలన్నీ కర్బన ఉద్గారాలను తగ్గించే స్థిరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవటానికి కృషి చేయాలి. ప్రస్తుతం ప్రమాదకరంగా పెరుగుతున్న జల, వాయు కాలుష్యాలను, ఉష్ణోగ్రతలను తగ్గించటానికి ఇది దోహదం చేస్తుంది. పర్యావరణ సంబంధిత మార్పులు పేద కార్మికులపై అత్యధికంగా ప్రభావాన్ని చూపటం వలన వైద్యం కోసం వారు అధికంగా ఖర్చు చేయాల్సివస్తుంది. ఇది ప్రభుత్వ, ప్రైవేటు వైద్యరంగాలపై తీవ్రమైన భారంగా మారుతుంది.

(అనువాదం: ఎ కోటిరెడ్డి)

మునీశ్వరులు ముక్కుమూసుకుని తపస్సు చేసుకుంటూ ఉంటారని జనుల విశ్వాసం. వాళ్లకు సిద్ధులు మహిమలు ఉంటాయని వారిని సేవించుకుని ఉపదేశం పొందితే మోక్షం సిద్ధిస్తుందని మరో విశ్వాసం. అటువంటి గురువును వెతుక్కుంటూ కొండ గుహల్లోకి వెళితే, గురువుకు బదులుగా క్రూర జంతువు ఏదైనా ఎదురుపడితే ముందుగా అదే తనకు భుక్తి దొరికిందని శిష్యునికి ముక్తి మార్గం చూపెడుతుంది. అని చమత్కారంగా చెప్తాడు వేమన. అలానే రూపం లేని దేవతలకు రూపాన్ని ఆపాదించి రాళ్లను బొమ్మగా చెక్కి ఆరాధిస్తారు. అలా ఆరాధించే వాళ్ళని ఉద్దేశించి "శిలను ప్రతిమ చేసి చీకటింటను బెట్టి/ మ్రొక్క వలదు వెర్రి మూడులారా/జీవులందే గాని శిలలందు లేదయా/విశ్వదాభిరామ వినురవేమ.'' శిలలను శిల్పాలను చెక్కి గర్భగుడిలో పెడతారు. ఏ గర్భగుడి అయినా చీకటి మయమే. బహుశా చీకటి మన అజ్ఞానానికి నిదర్శనం కాబోలు అనిపిస్తుంది. అలాంటి చీకటింట పెట్టిన శిలకు మ్రొక్కటం వెర్రితనం, మూర్ఖత్వం. దేవుడనేవాడు ఉంటే గింటే జనుల్లో ఉంటాడు గానీ శిలల్లో ఉండడు అని ప్రబోధిస్తున్నాడు వేమన్న. దేవాలయంలో విగ్రహాలకు పట్టుబట్టలు కట్టబెడతారు. అలంకరిస్తారు. ఆపైన ప్రార్థిస్తూ కోరికలను కోరుకుంటారు. వాళ్లను ఉద్దేశిస్తూ "రాతి బొమ్మ కేల రంగయిన వలువలు/గుళ్ళు గోపురములు కుంభములను/కూడు గుడ్డ తాను కోరు నా దేవుడు/విశ్వదాభిరామ వినురవేమ.'' దేవాలయంలో దేవుడి విగ్రహానికి విలువైన ఆభరణాలు చేయిస్తారు. పట్టు వస్త్రాలు కట్టబెడతారు. గోపురాలకు బంగారు పూతల పూయిస్తారు. నైవేద్యానికి కుంభాలు పోస్తారు. లోకంలో గూడు గుడ్డ లేని వాళ్ళు కోటానుకోట్లు ఉన్నారు. అన్న వస్త్రాలు అర్థించే అటువంటి వాళ్లకు పెట్టకుండా అడగని దేవుడికి పెడతారు. నిజానికి దేవుడి పేరు చెప్పి పొట్ట పోసుకునే వాళ్లే అదంతా కైంకర్యం చేస్తారు. లోకంలో సహజంగా మంచి పనుల కన్నా సరదాలకు, సరసాలకు సొమ్ము వెచ్చిస్తూ ఉంటారు. అలాంటి వారిని ఉద్దేశిస్తూ వేమన వ్యంగ్యంగా ఇలా అంటాడు.''కల్లుకిచ్చినట్లు చల్లకి ఇవ్వగలేరు/కొల్ల కిచ్చునట్లు కుడువలేరు/బుల్ల కిచ్చునట్లు పుణ్యానికీయరు/విశ్వదాభిరామ వినురవేమ." సాటివారికి కల్లుకొని పోస్తారే తప్ప లేని వాళ్లకు చల్ల పోసే చలివేంద్రాలు కట్టించరు. ఎవరో కొల్లగొట్టుకు పోతే కిక్కురుమనకుండా ఉంటారు కానీ అలా కొల్ల పోవడానికి ముందే ఆ సొమ్ము హాయిగా ఖర్చుపెట్టి తృప్తిగా తినలేరు. లైంగిక సుఖాలకు వెచ్చించినట్లుగా మంచి కార్యాలకు ఇవ్వలేరు. ఈ మానవ నైజాన్ని నిరసిస్తాడు వేమన. మనుషుల మధ్య సమానత్వం ఉండాలని చెబుతూ "ఉర్వి వారి కెల్ల నొక్క కంచంబు పెట్టి/పొత్తు గుడిపి కులము పోలయజేసి/తలను చెయ్యిపెట్టి తగ నమ్మ చెప్పరా/విశ్వదాభిరామ వినురవేమ" అంటాడు. సమాజంలో ఉన్న బాధలకు, దుఃఖాలకు, దురహంకారానికి, దౌర్జన్యానికి, గర్వానికి, మూల కారణం వర్ణ వ్యవస్థ, వర్గ విభజన అన్న సత్యాన్ని వేమన తెలుసుకున్నాడు. మానవులంతా ఒక్కటే అన్న నగ్న సత్యాన్ని చాటి చెప్పాడు. మానవులలో ఎక్కువ తక్కువలో ఉన్నంతకాలం చిక్కులు తప్పవు అంటాడు వేమన.

వేమన పద్యాలు తెలుగు సాహిత్య వనంలో విరబూసిన రత్నాల హారాలు. ఆయన చెప్పిన ప్రతి విషయం ఒక సత్య నిఘంటువే. పండిత లోకానికి పరిమితమైన వేదాంతాన్ని అతి సామాన్య మానవునికి కూడా అందుబాటులో ఉండేట్లు స్వచ్ఛమైన అచ్చమైన తేనె లాంటి తేట తెలుగు పద్యాలలో వివరించిన మహానుభావుడు వేమన. తన భావాలను సూటిగాను స్పష్టంగాను తన పద్యాల ద్వారా మృదు మధురమైన భాషలో విప్పి చెప్పినాడు. ఈ స్పష్టత ప్రాపంచిక విషయాలందు మరీ ఎక్కువ. ప్రతి పద్యానికి ఆనాటి చారిత్రక, నైసర్గిక, సాంఘిక, నైతిక, ఆర్థిక, రాజకీయ, మత వ్యవస్థలతో సంబంధం ముడిపడి ఉన్నది. అందువల్లనే ఒకే పద్యం అనేక కోణాలలో అనేక అర్థాలను ఇవ్వగలుగుతున్నది. ఇందులోకి ఈ వేమన పద్యమే నిదర్శనం

వేయి విధము లమర వేమన పద్యంబు
లర్థ మిచ్చు వాని నరసి చూడ
చూడ జూడ గలుగు
చోద్యమౌ జ్ఞానంబు
విశ్వదాభిరామ వినురవేమ.

"విశ్వదాభిరామ వినురవేమ"అనే మాట వినని తెలుగు వారు, వానకు తడవని వారు, వేమన పద్యం ఒకటి కూడా రాని తెలుగువారు ఉండరు.

ఇక వేమన జీవిత చరిత్రను ఎంతో కళాత్మకంగా సినిమాగా తీశారు 1947లో కేవీ రెడ్డి గారు. చిత్తూరు నాగయ్య గారు వేమనగా జీవించారు. ఇదే వేమన జీవితాన్ని నటుడు విజయ్ చందర్ కూడా నిర్మించారు. శ్రీ వేమన చరిత్రగా 1986లో విడుదలైన ఆ సినిమా కాలానుగుణంగా కాస్త మార్పులతో తీసినా గొప్ప విజయవంతం కాలేదు.

కేంద్ర సాహిత్య అకాడమీ వారు వేమన జీవిత చరిత్రను వ్రాయించి 14 భాషల్లో అనువదింపజేశారు.

ఆంగ్ల, యూరోపియన్ భాషలన్నింటిలోకి, అన్ని ద్రవిడ భాషల్లోకి వేమన పద్యాలు అనువదించబడ్డాయి. వేమనకు లభించిన గౌరవం మరే తెలుగు కవికి లభించలేదు.

ఐక్యరాజ్యసమితి–యునెస్కో విభాగం వారు ప్రపంచ భాషా కవులలో గొప్ప వారిని ఎంపిక చేసే సందర్భంలో వేమనను ఎంపిక చేసి ఆయన రచనలను పలు భాషల్లోకి అనువదింప చేశారు.

''విశ్వదాభిరామ వినర వేమ''అన్న మకుటం కీర్తి కిరీటం వంటిది. వేమన ఆలనా పాలనా చూసిన ఆయన వదిన విశ్వదను, ఆయన ఆప్తమిత్రుడు అభిరాముడిని, మకుటంలో చేర్చి వారికి శాశ్వతత్వాన్ని ఇచ్చాడని ఒక వాదన. వేమన హేతువాద దృష్టిని, అభ్యుదయ భావాలను, సంఘసంస్కరణ భావాలను ప్రతిపాదించాడు. మూఢనమ్మకాలను ఖండించాడు. అల్పమైన పదాలతో అనల్పమైన భావాలను ఆవిష్కరించాడు. అందుకే వేమన ప్రజాకవి ఆయ్యాడు

పరలోకాన్ని తిరస్కరించటం, వైదిక కర్మలను ఖండించడం, చాతుర్వర్ణ్య, చతురాశ్రమాలను అంగీకరించకపోవడం, విగ్రహారాధన తీర్థయాత్రలు మొదలైన వాటిని నిరసించటం వేమన ప్రబోధాలలో ముఖ్యమైనవి. అందుకే మహాకవి శ్రీశ్రీ అంటాడు తెలుగు కవిత్రయం ఎవరంటే తిక్కన, వేమన, గురజాడ అని.

హైదరాబాదులో ట్యాంక్బండ్ పైన తెలుగుజాతి వెలుగుల విగ్రహాలలో వేమన విగ్రహం కూడా ప్రతిష్ఠించారు. 1972లో భారత తపాలా శాఖ వేమనపై ఒక స్టాంపు విడుదల చేసింది.

ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లా, కదిరి తాలూకాలోని గ్రామమైన కటారుపల్లి (కదిరి పట్టణం)లో వేమన సమాధి గుర్తుగా ఒక శిలాఫలకం ఉన్నది. వేమన ఈ గ్రామంలోనే మరణించాడని విశ్వసిస్తారు. వేమన చిరస్మరణీయుడు. భవిష్యత్తుకు మార్గదర్శి.

చివరగా. ............

ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు
చూడ చూడ రుచులు జాడ వేరు
పురుషులందు పుణ్యపురుషులు వేరయా
విశ్వదాభిరామ వినురవేమ.

వేమన పుణ్యపురుషుడే కాదు, ధన్యజీవి కూడా.

❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2023-24, Marxistu Monthly Magazine, Volume 20, issue: 1 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# పాత రాజ్యాంగ యంత్రాన్ని నాశనం చేసి కొత్త రాజ్యాంగ యంత్రంతో పరిపాలన సాగించినప్పుడే విప్లవం నిలుస్తుంది

**- లెనిన్**



కొత్త వర్గం, పాత రాజ్యాంగ యంత్రంతో పరిపాలన సాగిస్తానంటే విప్లవం నిలవదు. ఈ కొత్త తరగతి పాత రాజ్యాంగ యంత్రాన్ని నాశనం చేసి కొత్త రాజ్యాంగ యంత్రంతో పరిపాలన సాగించినప్పుడే అది నిలుస్తుంది.

.....

ఒక్కోసారి రెండు అడుగులు ముందకేయడానికి ఒక అడుగు వెనక్కు వేయాల్సి వస్తుంది.

.....

ఒక ఫాక్టరీలో లేక ఒక పరిశ్రమలోని ఒక శాఖలో కార్మికులు తమ యజమానికి లేక యజమానులకు వ్యతిరేకంగా పోరాడితే దాన్ని వర్గ పోరాటం అంటామా? అనం. అది వర్గపోరాటపు బలహీనమైన పిండం మాత్రమే. కార్మికుల పోరాటం వర్గపోరాటం ఎప్పుడవుతుందంటే, మొత్తం దేశంలోని మొత్తం కార్మికవర్గపు అగ్రగామి ప్రతినిధులందరూ తమను తాము ఒకే ఒక కార్మికవర్గం అన్న చైతన్యం పొందినప్పుడు, వారంతా వ్యక్తిగత యజమానులమీద కాకుండా మొత్తం పెట్టుబడిదారీ వర్గం మీద, ఆ వర్గానికి మద్దతిచ్చే ప్రభుత్వం మీద పోరాడినప్పుడు మాత్రమే అది వర్గ పోరాటం అవుతుంది. వ్యక్తిగత కార్మికుడు తాను మొత్తం కార్మికవర్గంలో సభ్యుడిననీ, వ్యక్తిగత యజమాని లేక వ్యక్తిగత ప్రభుత్వాధికారుల మీద తాను చేసే రోజువారీ పోరాటం మొత్తం బూర్జువా వర్గం మీద, మొత్తం ప్రభుత్వం మీద జరిపే పోరాటం అని తెలుసుకున్నప్పుడు మాత్రమే అతని పోరాటం వర్గ పోరాటం అవుతుంది.

.....

ఇతరుల శ్రమ దోచుకుని బ్రతికేవారు భూమ్మీద ఉన్నప్పుడు దానాలు చేయాలని మతం బోధిస్తుంది. ఆ విధంగా దోపిడీ దారులుగా వారి మొత్తం ఉనికిని చౌకగా సమర్థించుకునే మార్గాన్ని, స్వర్గంలో సుఖాలు అనుభవించడానికి చౌకగా టిక్కెట్లు లభించే మార్గాన్ని వారికి చూపుతుంది,

.....

అధ్యయనం చేయి, మరింత తెలుసుకో, నిరంతరం తెలుసుకుంటూనే ఉండు.

.....

ఆధునిక మతం యొక్క మూలాలు కార్మిక ప్రజల సామాజిక అణచివేతలో లోతుగా పాతుకుని ఉన్నాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

**ఇంటి నెంబరు** ....................................................

**వీధి**

............................................................................

**గ్రామం**

............................................................................

**మండలం లేదా పట్టణం** ..........................................

email : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.